Crime News
# ది క్రైమ్ న్యూస్
తెలుగు దినపత్రిక


హైదరాబాద్ పోలీసుల భారీ ఆపరేషన్.. రూ.5000 కోట్ల స్కామ్‌కు చెక్!

సంపుటి : 19 సంచిక : 57 పేజీలు : 12, వెల రూ. 6రూ/ శుక్రవారం 12 - 06 - 2026
: Circulated in Anantapuram, Satya Sai, Vijayavada, Ysr Kadapa, Annamayya, Prakasham, Bapatla,Ntr, Karimnagar,Gunturu,East Godavari, West Godavari, Kakinada, Eluru, Sri Potti Sriramulu Nellore, Kurnool



## దమ్ముంటే 12 వైఫల్యాలపై జవాబివ్వండి

- బీజేపీపై వైఎస్ షర్మిల ఫైర్
- రాజ్యసభ సీటు అంశంపై బీజేపీ అనవసరంగా స్పందిస్తోందని విమర్శ
- కేంద్ర ప్రభుత్వ 12 వైఫల్యాలపై సమాధానం చెప్పే దమ్ము బీజేపీకి ఉందా అని ప్రశ్న
- ధరల పెరుగుదల, నిరుద్యోగం, మహిళల భద్రతపై కేంద్రాన్ని నిలదీత

**అమరావతి :** కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాజ్యసభ సీటు గురించి బీజేపీ నేతలు చేస్తున్న విమర్శలను తిప్పికొడుతూ,కేంద్ర - మిగతా 2 లో

# ఏపీ రాజ్యసభ ఎన్నికలు ఏకగ్రీవం

### కూటమి ఖాతాలోకి మరో నలుగురు ఎంపీలు

- రాజ్యసభ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన కూటమి అభ్యర్థులు సానా సతీశ్, చింతకాయల విజయ్, భాష్యం రామకృష్ణ, లింగమనేని రమేశ్
- నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఈసీ ప్రకటన
- ప్రత్యర్థి పార్టీల నుంచి రాని నామినేషన్లు
- జనసేన నుంచి లింగమనేని రమేశ్ జయకేతనం



**అమరావతి :** రాష్ట్రం నుంచి రాజ్యసభ సభ్యులుగా సానా సతీశ్, చింతకాయల విజయ్, భాష్యం రామకృష్ణ, లింగమనేని రమేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడంతో నలుగురూ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఈసీ ధ్రువీకరించింది. నాలుగు ఖాళీలకు నాలుగు నామినేషన్లే దాఖలు కావడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించింది. అనంతరం ఎన్నికైన సభ్యులకు ధ్రువపత్రాలు జారీ చేసింది. రాష్ట్రం నుంచి నాలుగు రాజ్యసభ స్థానాలు ఖాళీకాగా ముగ్గురు టీడీపీ తరఫున, ఒకరు జనసేన తరఫున ఎన్నికయ్యారు.ఏపీ నుంచి ఖాళీ అయిన 4 రాజ్యసభ స్థానాలకు కూటమి - మిగతా 2 లో

## లక్షలాది మంది జీవితాలతో ఆడుకున్నారు



- వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్
- డీఎస్సీ స్కామ్‌పై సీబీఐ దర్యాప్తు జరిపించాలి
- మెగా డీఎస్సీలో భారీ కుంభకోణం జరిగిందన్న వైఎస్ జగన్
- నియామక ప్రక్రియపై సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్

**అమరావతి :** ఏపీ మెగా డీఎస్సీ పరీక్ష, నియామకాల ప్రక్రియలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని, దీనిపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ)తో విచారణ జరిపించాలని వైసీపీ - మిగతా 2 లో

## టీఎంసీ రెబల్ ఎంపీల భవిష్యత్ ప్రశ్నార్థకం



- ఫిరాయింపుల చట్టం ఏం చెబుతోంది?
- లోక్‌సభలో తృణమూల్ కాంగ్రెస్‌లో చీలిక
- 28 మంది ఎంపీలలో 20 మంది తిరుగుబాటు జెండా
- ఎన్డీయేకు మద్దతివ్వాలని యోచిస్తున్న రెబల్ వర్గం
- ఫిరాయింపుల నిరోధక చట్టంపై కొనసాగుతున్న చర్చ
- స్పీకర్ ఓం బిర్లా నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ

**పశ్చిమ బెంగాల్ :** పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో మొదలైన సంక్షోభం ఇప్పుడు దేశ రాజధాని ఢిల్లీకి పాకింది. అధికారాన్ని కోల్పోయిన తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధినేత్రి మమతా బెనర్జీకి లోక్‌సభలోనూ భారీ ఎదురుదెబ్బ తగిలింది. పార్టీకి చెందిన 28 మంది లోక్‌సభ సభ్యులలో ఏకంగా 20 మంది ఎంపీలు తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. ప్రత్యేక వర్గంగా ఏర్పడి కేంద్రంలోని ఎన్డీయే కూటమికి మద్దతు ఇవ్వాలని వారు యోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ పరిణామం టీఎంసీలో పెను ప్రకంపనలు సృష్టిస్తోంది.సీనియర్ నాయకురాలు, నాలుగుసార్లు ఎంపీగా గెలిచిన కకోలీ ఘోష్ దస్తీదార్ ఈ తిరుగుబాటుకు నాయకత్వం వహిస్తున్నారు. బుధవారం రాత్రి ఢిల్లీలో బీజేపీ సీనియర్ - మిగతా 2 లో

## రాత్రే ఇరాన్‌పై తీవ్ర దాడులు

- ట్రంప్ సంచలన ప్రకటన
- ఇరాన్ కీలక ఆయిల్ కేంద్రమైన ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకుంటామని వెల్లడి
- ఇప్పటికే ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న సైనిక ఘర్షణలు
- దాడుల హెచ్చరికల మధ్యే కొనసాగుతున్న దౌత్యపరమైన చర్చలు



**ఢిల్లీ :** అమెరికా - ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి పతాకస్థాయికి చేరాయి. ఇరాన్‌పై ఈ రాత్రే భారీస్థాయిలో దాడులు చేయనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. సమీప భవిష్యత్తులో ఇరాన్‌కు చెందిన కీలక చమురు క్షేత్రాలను, ముఖ్యంగా ఖర్గ్ ద్వీపాన్ని తమ ఆధీనంలోకి తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.గురువారం తన - మిగతా 2 లో

# నౌకలపై దాడులు ఆపండి

- గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతలపై భారత్ తీవ్ర ఆగ్రహం
- గల్ఫ్ జలాల్లో వాణిజ్య నౌకలపై దాడులను తీవ్రంగా ఖండించిన భారత్
- అమెరికా జరిపిన దాడిలో ముగ్గురు భారత నావికుల దుర్మరణం
- ఘటనపై అమెరికా దౌత్యాధికారికి సమన్లు జారీ చేసి నిరసన
- పలు నౌకల్లో చిక్కుకున్న వందలాది భారతీయుల భద్రతపై ఆందోళన



**ఢిల్లీ :** గల్ఫ్ ఆఫ్ ఒమన్, దాని పరిసర జలాల్లో వాణిజ్య నౌకలపై జరుగుతున్న దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. ఈ దాడుల కారణంగా భారతీయ నావికులు ప్రాణాలు కోల్పోవడంపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. అమెరికా జరిపిన ఓ దాడిలో ముగ్గురు భారతీయులు మరణించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఇటువంటి దాడులను వెంటనే నిలిపివేయాలని, దౌత్య మార్గాల ద్వారా శాంతిని నెలకొల్పాలని భారత విదేశాంగ శాఖ పిలుపునిచ్చింది.బుధవారం ఒమన్ తీరంలో 'ఎంటీ సెటెబెల్లో' అనే ఆయిల్ ట్యాంకర్‌పై అమెరికా బలగాలు దాడి చేశాయి. అమెరికా ఆంక్షలను ఉల్లంఘించి, ఈ నౌక ఇరాన్ నుంచి చమురు రవాణా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ దాడిలో డెక్ క్యాడెట్ ఆదిత్య శర్మ, ఇంజిన్ ఫిట్టర్ శివానంద్ చౌరాసియా, చీఫ్ ఇంజనీర్ పట్నాల సురేష్ అనే ముగ్గురు భారతీయ నావికులు ప్రాణాలు కోల్పోయారు. నౌకలోని మరో 21 మంది భారత సిబ్బందిని సురక్షితంగా రక్షించారు. ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన భారత్, న్యూఢిల్లీలోని అమెరికా రాయబారికి సమన్లు జారీ చేసి తన నిరసనను వ్యక్తం చేసింది.గడిచిన కొద్ది రోజుల్లో భారతీయులు ఉన్న మూడు నౌకలపై దాడులు జరిగినట్లు షిప్పింగ్ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. జూన్ 8న 'మారివెక్స్' నౌకలో మంటలు చెలరేగగా, అందులోని 24 మంది భారత సిబ్బంది సురక్షితంగా బయటపడ్డారు. గురువారం షినాస్ పోర్టు వద్ద 'ఎంటీ జల్వీర్' నౌకపై దాడి జరగ్గా, ఒమన్ అధికారులు స్పందించి 20 మంది భారత సిబ్బందిని రక్షించారు.వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకోవడాన్ని భారత్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. నావికుల భద్రతకు, అంతర్జాతీయ జలాల్లో నౌకల స్వేచ్ఛాయుత ప్రయాణానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్ నొక్కి చెప్పింది. ప్రస్తుతం హార్మూజ్ జలసంధిలో 13 భారతీయ నౌకలు, 562 మంది భారత నావికులు - మిగతా 2 లో

## రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు




- తెలంగాణ రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- తొలి దశలో 125 తహసీల్దార్, 11 ఆర్డీవో కార్యాలయాలకు కొత్త భవనాలు నిర్మిస్తున్నట్టు పొంగులేటి వెల్లడి
- దీని ద్వారా శిథిలావస్థలో ఉన్న భవనాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వెల్లడి
- భవనాల నిర్మాణాల కోసం స్థలాల గుర్తింపును వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం



## కవిత కొత్త పార్టీకి పేరు చిక్కులు

- 'టీఆర్ఎస్'పై ముప్పేట దాడి
- కవిత కొత్త పార్టీ 'తెలంగాణ రక్షణ సేన'కు పేరు చిక్కులు
- 'టీఆర్ఎస్' పేరు తమదేనంటూ అభ్యంతరం వ్యక్తం చేసిన బీఆర్ఎస్
- మహారాష్ట్రకు చెందిన ఓ పార్టీ కూడా అదే పేరు కోసం దరఖాస్తు
- వివరణ ఇచ్చేందుకు ఎన్నికల సంఘాన్ని కలవనున్న కవిత ప్రతినిధులు

**హైదరాబాద్ :** కవిత ప్రతిపాదించిన కొత్త రాజకీయ పార్టీ 'తెలంగాణ రక్షణ సేన' (టీఆర్ఎస్)కు ఆరంభంలోనే అడ్డంకులు ఎదురవుతున్నాయి. పార్టీ పేరు చుట్టూ తీవ్ర వివాదం నెలకొనడంతో, ఈ - మిగతా 2 లో

# ప్రధాని నరేంద్ర మోదీతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ

- నీతి ఆయోగ్ పాలకమండలి సమావేశం తర్వాత ఇరువురి మధ్య ప్రత్యేక భేటీ
- రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలను ప్రధానితో చర్చించిన సీఎం
- తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చ
- వికసిత్ భారత్ 2047 లక్ష్యంతో జరిగిన నీతి ఆయోగ్ భేటీ



**హైదరాబాద్ :** ప్రధాని మోదీతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో సమావేశం అయ్యారు. నీతి ఆయోగ్ పాలక మండలి సమావేశం తర్వాత పీఎం, సీఎం ప్రత్యేకంగా భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలను ప్రధానితో చర్చించారు. పెండింగ్‌లోని అంశాలను ఆమోదించాలని ప్రధానిని కోరారు.మోదీతో భేటీ అనంతరం కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. మెట్రోరైలు విస్తరణకు అనుమతులపై కేంద్రమంత్రితో చర్చించారు. మూసీ ప్రక్షాళన, పట్టణాభివృద్ధి సంబంధిత ప్రాజెక్టులపై ఖట్టర్‌తో రేవంత్ చర్చించారు. ఢిల్లీ రాష్ట్రపతి భవన్‌లో ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగిన 11వ నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఆ సమావేశంలో తెలంగాణ అభివృద్ధి నమూనాను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. దేశాభివృద్ధి అంటే.. ప్రజల అభివృద్ధేనని గుర్తుచేసిన సీఎం ప్రజలను ఆర్థిక శక్తులుగా, దేశనిర్మాతలుగా తీర్చిదిద్దడంలో విద్య, ఆరోగ్యం కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు.తెలంగాణ ప్రభుత్వం 2024లో నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులసర్వేలో - మిగతా 2 లో

# సంపాదకీయం

## మరో ఎదురుదెబ్బ

విదేశీ వృత్తి నిపుణుల హెచ్1బీ వీసాలపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విధించిన లక్షడాలర్ల ఫీజును అక్కడి ఫెడరల్ కోర్టు కొట్టివేయడం భారతీయులకు మంచి ఉపశమనం. అనేక కంపెనీలకు సైతం ఈ తీర్పుతో ఊరట లభించింది. ప్రవాస భారతీయ సంఘాలు, డెమోక్రాట్లే కాదు, ట్రంప్ సొంతపార్టీ నేతలు సైతం దీనిపై హర్షం వ్యక్తంచేస్తున్నారు. సాంకేతిక నైపుణ్యం ఉన్న విదేశీయులను ఈ నాన్ ఇమ్మిగ్రెంట్ వీసాద్వారా ఉద్యోగాల్లో నియమించుకొంటున్న అమెరికాలోని కంపెనీలకు నామమాత్రపు ఫీజుతో మెచ్చినవారిని ఎంపిక చేసుకొనే అవకాశాన్ని ట్రంప్ తన చర్యతో అడ్డుకొట్టారు. ఫీజును భరించలేని స్థాయికి పెంచడం ద్వారా విదేశీ ఉద్యోగులను అడ్డుకొని, వారిస్థానంలో ఆయా కంపెనీలు అమెరికన్లను నియమించుకొనేట్టు చేయాలన్నది ట్రంప్ ఆలోచన. గత ఏడాది సెప్టెంబర్‌లో ట్రంప్ విధించిన ఈ లక్షడాలర్ల ఫీజును భరించలేక కంపెనీలు హెచ్1బీ నియామకాలను తగ్గించుకున్నాయి కూడా. అమెరికన్ చాంబర్ ఆఫ్ కామర్స్, పలు డెమోక్రాటిక్ రాష్ట్రాలు, ప్రసిద్ధ కంపెనీలు సవాలు చేసిన నేపథ్యంలో ఇప్పుడు ఫెడరల్ కోర్టు ఇచ్చిన తీర్పు పూర్తి సాంకేతికమైనది. హెచ్1బీ విధానం మంచిచెడులు, న్యాయాన్యాయాల పరిధిలోకి పోకుండా, ఈ లక్షడాలర్ల ఫీజును పన్నుగా పరిగణిస్తూ, అమెరికన్ కాంగ్రెస్ ఆమోదం లేకుండా దీనిని విధించే హక్కు దేశాధ్యక్షుడికి లేదని కోర్టు తేల్చింది.నీకు ఆ అధికారం లేదని కోర్టు అన్నంతమాత్రాన ట్రంప్ తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోరు కనుక, ఎప్పటిలాగానే, ట్రంప్ సర్కారు తనకు వ్యతిరేకంగా వచ్చిన ఈ తీర్పుమీద కూడా పై కోర్టులో సవాలు చేయడానికి సిద్ధపడుతోంది. తద్వారా, మరికొంతకాలం ఈ వివాదం ఉన్నతన్యాయస్థానాల్లో కొనసాగబోతోంది. అంతలోగా, ఈ తీర్పునుంచి దక్కిన ఉపశమనాన్ని నిపుణుల కొరతతో సతమతమవుతున్న కంపెనీలు సద్వినియోగం చేసుకొని, నియామకాలు పెంచుకొనే అవకాశం ఉన్నదని, భారతీయులే 70శాతానికి పైగా హెచ్1బీ వీసాలు పొందుతున్నందున వారికి ఈ పరిణామం లాభిస్తుందని కొందరి అంచనా. అయితే, ఓటమి సహించలేని ట్రంప్ కొన్ని విధానపరమైన చర్యలతో ఈ వీసాదారులకు అడ్డంకులు సృష్టించే ప్రయత్నాలు చేయకపోరు.ట్రంప్ టారిఫ్ వార్‌మీద సరిగ్గా నెలరోజుల క్రితం అమెరికా వాణిజ్య న్యాయస్థానం ఇచ్చిన తీర్పు కూడా ఇటువంటిదే. కాంగ్రెస్‌ను పక్కకునెట్టి, కేవలం కార్యనిర్వాహక ఆదేశాలతో అధ్యక్షుడు ఈ తరహా నిర్ణయాలు చేయకూడదన్నది ఈ తీర్పుల సారాంశం. మిగతా ప్రపంచంమీద ట్రంప్ ఇష్టారాజ్యంగా విధించిన ప్రతీకార సుంకాలు చెల్లవంటూ సుప్రీంకోర్టు ఫిబ్రవరిలో ఇచ్చిన ఆదేశాలను వెంటనే వమ్ముచేయడంకోసం, 1974 వాణిజ్యచట్టంలోని 122వ సెక్షన్ ప్రయోగించి ట్రంప్ పదిశాతం అదనపు సుంకం ఆదేశాలను ఇచ్చుకున్నారు. దీనిపై అమెరికా?లోని కొన్ని రాష్ట్రాలు, వ్యాపార వాణిజ్య సంస్థలు ట్రేడ్ కోర్టును ఆశ్రయించాయి. చెల్లింపుల సంక్షోభంతో వ్యవహరించడానికి అధ్యక్షుడికి ఈ సెక్షన్ ద్వారా ఐదునెలల పాటు టారిఫ్ విధించే హక్కు ఉందన్న ట్రంప్ వాదనను కోర్టు అంగీకరించలేదు. ఇంటర్నేషనల్ ఎమర్జెన్సీ ఎకనామిక్ పవర్ యాక్ట్ (ఐఈఈపిఎ) కింద గత ఏడాది విధించిన ప్రతీకార సుంకాలకు సుప్రీంకోర్టు అడ్డుపడటంతో, ఆయన ఇలా మరో చట్టాన్ని వాడి ఎదురుదెబ్బ తిన్నారు. తనకు వ్యతిరేకంగా తీర్పులు వచ్చిన ప్రతీ సందర్భంలోనూ న్యాయమూర్తులను నిందించడం, వారికి దేశభక్తి లేదనడం, పక్షపాతాన్ని అంటగట్టడం ట్రంప్‌కు తెలిసిన విద్య. అమెరికా కోర్టులు తనకు అడ్డుపడుతూంటే మిగతాదేశాలు సంతోషిస్తాయని, అవి ఏ విధమైన తీర్పులు ఇచ్చినా, ఉన్న చట్టాలన్నీ తవ్వితీసి తాను చేయదల్చుకున్నదే చేస్తానని ట్రంప్ చెబుతూంటారు. ఇటీవల భారత్ సహా యాభైమూడు దేశాలకు పన్నెండున్నరశాతం సుంకాలను ప్రతిపాదించడం అందులో భాగమే. కొత్తదారుల్లో, కొత్త పేర్లతో టారిఫ్ వార్‌ను ఒక వాణిజ్య విధానంగా ఆయన అమలుచేయదల్చుకున్నారు. మధ్యంతర ఎన్నికలు దగ్గరపడుతున్న తరుణంలో ట్రంప్‌కు అమెరికా ప్రయోజనాల పరిరక్షకుడిగా కనిపించడం మరీ అవసరం. అమెరికాని మళ్ళీ ఉన్నతంగా నిలబెట్టడం కోసం మిగతా ప్రపంచంతో పోరాడుతున్న తనకు, న్యాయస్థానాలు ద్రోహం చేస్తున్నాయని ఆయన ప్రచారం చేసుకోవచ్చు. ఇరాన్‌తో యుద్ధం తనను విజేతగా, హీరోగా నిలబెడుతుందన్న ఆశ నెరవేరకపోగా, రాజకీయంగా అప్రదిష్ఠ తీసుకువచ్చింది. ట్రేడ్‌వార్‌లోనూ, ఇరాన్‌వార్‌లోనూ ఎదురుదెబ్బలు తింటున్న ట్రంప్ ఎన్నికలు ముగిసేలోగా ఎన్ని ఎత్తులు వేస్తారో, ఎన్ని విన్యాసాలు చేస్తారో చూడాలి.

# ఏపీ రాజ్యసభ ఎన్నికలు ఏకగ్రీవం



**మొదటిపేజీ తరువాయి -** ఒప్పందం మేరకు 4 రాజ్యసభ స్థానాల్లో 1 జనసేన, 3 టీడీపీకి ఖరారైన సంగతి తెలిసిందే. రాజ్యసభ అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ గడువు సోమవారంతో ముగిసింది. మంగళవారం నామినేషన్ల పరిశీలన, బుధవారం ఉపసంహరణకు చివరి తేదిగా గడువు పెట్టారు. చివరికి నాలుగు ఖాళీలకు నాలుగు నామినేషన్లే దాఖలవడంతో గురువారం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఈసీ ప్రకటించింది.విద్యావేత్త, భాష్యం విద్యాసంస్థల అధినేత రామకృష్ణ టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీకి అన్ని విధాలా అండగా నిలిచారు. 2024లో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా పార్టీ సంస్థాగత నిర్మాణం, శిక్షణ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. 2024 ఎన్నికల్లో గుంటూరు లోక్‌సభ టికెట్ ఆశించినా వివిధ కారణాలతో ఆయనకు దక్కలేదు. అయినప్పటికీ పార్టీని వీడకుండా సేవలందిస్తున్నారు. త్రజాగా కూటమి టీడీపీ రాజ్యసభ సీటును భాష్యం రామకృష్ణకు కేటాయించింది.కాకినాడకు చెందిన సానా సతీశ్ 2024 ఎన్నికల్లో లోక్‌సభ టికెట్ ఆశించినా రాలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక 2024 డిసెంబరులో మోపిదేవి వెంకటరమణారావు రాజీనామాతో జరిగిన రాజ్యసభ ఉప ఎన్నికలో సతీశ్ ఎన్నికయ్యారు. ఏడాదిన్నర మాత్రమే ఎంపీగా ఉన్నందున, సామాజిక సమీకరణాలను దృష్టిలో ఉంచుకొని మరోసారి అవకాశం ఇచ్చారు.బీసీ సామాజికవర్గానికి అవకాశం ఇవ్వడంతో పాటు యువ నాయకత్వాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో అధిష్ఠానం చింతకాయల విజయ్‌ను ఎంపిక చేసింది. విజయ్ తండ్రి అయ్యన్నపాత్రుడు శాసనసభాపతిగా ఉన్నా, టీడీపీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో విజయ్ పార్టీకి చేసిన సేవలు ఆయన ఎంపికకు కలిసొచ్చాయి. 2024 ఎన్నికల్లో అనకాపల్లి లోక్‌సభ టికెట్ ఆశించినా అప్పటి రాజకీయ సమీకరణాల వల్ల దక్కలేదు. తన కుమారుడికి రాజ్యసభకు అవకాశం ఇవ్వాలని అయ్యన్నపాత్రుడు ఈసారి గట్టిగా కోరడంతో ఆ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకొని విజయ్‌కు ఛాన్స్ ఇచ్చారు. జనసేన రాజ్యసభ అభ్యర్థిగా లింగమనేని రమేశ్ పేరు పార్టీ అధిష్ఠానం ఎంపిక చేసింది. లింగమనేనికి పార్టీతో 2015 నుంచి అనుబంధం ఉందని పవన్ రాజకీయ కార్యదర్శి హరిప్రసాద్ తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలనే పవన్ ఆలోచనలకు లింగమనేని ఆకర్షితులయ్యారన్నారు. 2019 ఎన్నికల్లో ప్రతికూల ఫలితాలు వచ్చినా లింగమనేని, పవన్ వెంటే ఉన్నారని గుర్తు చేశారు. ఓర్పుతో ఉన్నవారికి నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించామన్నారు. నేతల కులమతాలు పట్టించుకోకుండా అవకాశం కల్పించామని తెలిపారు. ఇదే సూత్రాన్ని రాజ్యసభ అభ్యర్థి ఎంపికలోనూ పవన్ అనుసరించారని హరిప్రసాద్ స్పష్టం చేశారు.

# దమ్ముంటే 12 వైఫల్యాలపై జవాబివ్వండి

**మొదటిపేజీ తరువాయి -** ప్రభుత్వ 12 ఏళ్ల వైఫల్యాలపై సమాధానం చెప్పే దమ్ముందా అని సవాల్ విసిరారు. ఈ మేరకు ఆమె గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.రాజ్యసభ సీటు అనేది మాట ఇచ్చిన వారికి, తీసుకున్న వారికి సంబంధించిన వ్యక్తిగత విషయమని, మధ్యలో బీజేపీ నేతల అసహనం, అతి స్పందన ఎందుకని షర్మిల ప్రశ్నించారు. తాము ప్రజా సమస్యలపై, ప్రభుత్వ వైఫల్యాలపై నిలదీస్తుంటే, సమాధానం చెప్పలేక అర్థం పర్థం లేని అంశాలను తెరపైకి తెచ్చి బీజేపీ తన సంస్కారాన్ని బయటపెట్టుకుంటోందని విమర్శించారు. నిజంగా చిత్తశుద్ధి ఉంటే, కాంగ్రెస్ పార్టీ లేవనెత్తిన 12 వైఫల్యాలపై చర్చకు రావాలని, పుండు మీద కారం చల్లే చేష్టలు మానుకోవాలని హితవు పలికారు.కేంద్ర ప్రభుత్వ పాలనపై షర్మిల ప్రశ్నల వర్షం కురిపించారు. "రైళ్లు, రహదారులు అని గొప్పలు చెప్పడం కాదు, నిత్యావసరాల ధరలు 300 శాతం ఎందుకు పెరిగాయో చెప్పాలి. అతిపెద్ద స్టార్టప్ దేశమని చెప్పుకోవడం కాదు, ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఎందుకు ఇవ్వలేకపోయారో సమాధానం చెప్పాలి. డీబీటీల గురించి కాదు, దేశవ్యాప్తంగా 28 సార్లు జరిగిన పేపర్ లీకుల గురించి మాట్లాడాలి. మహిళా సాధికారిత అని సమర్థించుకోవడం కాదు, ఏటా జరుగుతున్న 5 లక్షల అఘాయిత్యాలపై జవాబివ్వాలి" అని ఆమె నిలదీశారు.అంతేకాకుండా, దేశ ఆర్థిక పరిస్థితిపైనా షర్మిల తీవ్ర విమర్శలు చేశారు. "తెచ్చిన లక్షల కోట్ల అప్పులు ఎక్కడ ఖర్చు చేశారో శ్వేతపత్రం ఇవ్వాలి. దేశీయ ఆర్థిక వృద్ధి మెరుగ్గా ఉంటే, డాలర్‌తో రూపాయి విలువ రెండింతలు ఎందుకు పతనమైంది? పీఎం కిసాన్ నిధులతో రైతులను ఆదుకుంటే, ఏటా 12 వేల మంది రైతులు ఎందుకు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు?" అని ఆమె ప్రశ్నించారు.విభజన రాజకీయాల గురించి బీజేపీ మాట్లాడటం 'దెయ్యాలు వేదాలు వల్లించినట్టు' ఉందని షర్మిల ఎద్దేవా చేశారు. మతాల మధ్య చిచ్చు పెట్టి, ఓటు బ్యాంకు రాజకీయాలు చేసేది ఎవరో దేశ ప్రజలందరికీ తెలుసన్నారు. ఎన్నికల కమిషన్ వంటి రాజ్యాంగ సంస్థలను కీలుబొమ్మలుగా మార్చుకుని, ఓట్లు, సీట్ల చోరీకి పాల్పడుతున్నంత కాలం బీజేపీకి ప్రజాభిమానం లభించదని, వారికి దక్కేవి దొంగ సర్టిఫికెట్లు మాత్రమేనని ఆమె తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర అభివృద్ధికి కాంగ్రెస్ అంకితభావంతో ఉందని, ప్రజా ఉద్యమ గొంతుక తమదేనని షర్మిల స్పష్టం చేశారు.

# లక్షలాది మంది జీవితాలతో ఆడుకున్నారు

**మొదటిపేజీ తరువాయి -** అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ డిమాండ్ చేశారు. నేడు ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, డీఎస్సీకి సంబంధించి వెలుగులోకి వస్తున్న వాస్తవాలు అత్యంత దిగ్భ్రాంతికరంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం కుంభకోణాలతో లక్షలాది మంది అభ్యర్థుల నమ్మకాన్ని వమ్ము చేసిందని, ప్రతిభావంతులైన నిరుద్యోగుల జీవితాలను తీవ్రంగా దెబ్బతీసిందని జగన్ ఆరోపించారు. ఇంతటి దారుణమైన నియామక ప్రక్రియను ఎక్కడా చూడలేదని అన్నారు. "అబద్ధాలు, మోసం, దగా, వెన్నుపోటు, కుంభకోణాలకు చొక్కా, ప్యాంటు వేస్తే అది చంద్రబాబు అవుతారు" అని ఆయన విమర్శించారు. లక్షలాది మంది యువత ఆశలు, భవిష్యత్తు ముడిపడి ఉన్న డీఎస్సీ వంటి ప్రక్రియలో కూడా అవినీతి, అక్రమాలకు పాల్పడటం అత్యంత దారుణమని అన్నారు.ప్రభుత్వం చేస్తున్న అక్రమాలను జనరేషన్ జెడ్ గమనిస్తోందని చంద్రబాబు గుర్తుంచుకోవాలని జగన్ హెచ్చరించారు. "చంద్రబాబూ గుర్తుంచుకో, ఇది జెన్ జెడ్. జెన్ ఆల్ఫా కూడా వస్తోంది. తప్పులు ఒప్పుకోకుండా ఇబ్బంది పెడితే బొద్దింకలు తిరగబడతాయి" అని వ్యాఖ్యానించారు. నీట్ పేపర్ లీక్ తర్వాత ఆన్‌లైన్‌లో మొదలైన 'జనతా కాక్రోచ్ పార్టీ' ఉద్యమం గురించి ప్రస్తావించగా, "ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మేం కూడా బొద్దింకలమే. యువతకు అన్యాయం జరిగితే వారు ఇలాంటి మార్గాలనే ఎంచుకుంటారు" అని జగన్ పేర్కొన్నారు.డీఎస్సీ అక్రమాలపై జగన్ వివరంగా మాట్లాడుతూ.. 1995 నుంచి చంద్రబాబు పాలన లీకులు, అవినీతితోనే నిండిపోయిందన్నారు. ఈసారి డీఎస్సీ కన్వీనర్‌ను పక్కనపెట్టి, ప్రశ్నపత్రం రూపకల్పన, పరీక్షల నిర్వహణ బాధ్యతలను ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్‌కు అప్పగించారని, ఒకే అధికారి చేతిలో కీలక అధికారాలు కేంద్రీకరించి పారదర్శకతను దెబ్బతీశారని ఆరోపించారు. ప్రశ్నపత్రం ఎంతమంది చేతుల్లోకి వెళ్లింది, ఎంత డబ్బు చేతులు మారింది అనే విషయాలు థర్డ్ పార్టీ ఏజెన్సీ విచారణలోనే తెలుతాయన్నారు.స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు జరిగాయంటూ జగన్ ధ్వజమెత్తారు. "స్పోర్ట్స్ కోటా అభ్యర్థులకు అర్హత పరీక్ష రాయాల్సిన అవసరం లేదని, కేవలం పార్టిసిపేషన్ సర్టిఫికేట్ ఉంటే చాలని జీవోలు ఇచ్చి తమకు కావాల్సిన వారిని ఉద్యోగాల్లోకి తీసుకున్నారు. టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇచ్చిన కాలేజీ, యూనివర్సిటీ, జిల్లా స్థాయి పోటీల పార్టిసిపేషన్ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు ఇచ్చారు. మరోవైపు, జాతీయ క్రీడల్లో బంగారు పతకాలు సాధించి ఇంటర్వ్యూలకు పిలిపించిన నిజమైన అభ్యర్థులకు ఉద్యోగాలు రాలేదు. మొత్తం 270 మంది అర్హత పరీక్ష రాయకుండానే స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు పొందారు" అని జగన్ వివరించారు.తమ హయాంలో నోటిఫికేషన్ నుంచి నియామక పత్రాలు ఇచ్చే వరకు కేవలం నాలుగు నెలల్లో 1.30 లక్షల ఉద్యోగాలను ఎలాంటి లోపాలు లేకుండా భర్తీ చేశామని జగన్ గుర్తుచేశారు. డీఎస్సీ వ్యవహారంలో చంద్రబాబు, విద్యాశాఖ మంత్రిగా ఉన్న ఆయన కుమారుడు లోకేశ్ ముద్దాయిలని, వారే తీర్పు చెబితే న్యాయం జరగదని, అందుకే సీబీఐ విచారణ డిమాండ్ చేస్తున్నామని స్పష్టం చేశారు. జూన్ 12న తలపెట్టిన 'వెన్నుపోటుకు రెండేళ్లు' నిరసన కార్యక్రమంలో ఈ డీఎస్సీ అక్రమాల అంశాన్ని ప్రముఖంగా ప్రస్తావించాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

# ప్రధాని నరేంద్ర మోదీతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ

కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయని రేవంత్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మూడున్నర కోట్ల మంది, 242 కులాలకు చెందిన ప్రజల వివరాలను సేకరించినట్లు చెప్పారు. ఆ సర్వేలో నగదు, భూమి కంటే విద్యే సామాజిక వెనుకబాటుతనాన్ని ప్రభావితం చేస్తోన్న ముఖ్యమైన అంశంగా తేలిందని చెప్పారు. ప్రతి పౌరుడికి నాణ్యమైన విద్య అందించడం ద్వారానే వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించవచ్చని స్పష్టం చేశారు.ప్రస్తుతం నాణ్యమైన విద్య అందించడం సవాలుగా మారిందని సీఎం వ్యాఖ్యానించారు. అందుకే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తూ, విద్యా విప్లవానికి శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూళ్లలో ఇంగ్లీష్ మీడియం, డిజిటల్ తరగతులు, ఉచిత అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్ తోపాటు పాఠశాల బస్సులు, క్రీడా సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు.నర్సరీ నుంచి ఇంటర్ వరకు ఒకే క్యాంపస్‌లో చదివే అవకాశం కల్పిస్తున్నట్లు రేవంత్‌రెడ్డి చెప్పారు. యంగ్ ఇండియా స్కూల్స్ కులాల మధ్య గోడలు కూల్చేస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో యంగ్ ఇండియా స్కూల్ నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ఏ రాష్ట్రానికి చెందిన ముఖ్యమంత్రి అయినా, అధికారులైనా యంగ్ ఇండియా స్కూల్స్ చూడాలంటే సంతోషంగా చూపిస్తామన్నారు.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో యువతకు కొత్త నైపుణ్యాలు అవసరమని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. తయారీ, సేవారంగాల్లో భారీ ఉపాధి అవకాశాలు సృష్టించేందుకు రీజినల్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రైల్వే, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. యువతకు ప్రపంచస్థాయి శిక్షణ అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలోని అన్ని ఐటీఐలను ఆధునిక సాంకేతిక శిక్షణ కేంద్రాలుగా మార్చేందుకు టాటా గ్రూప్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నామని సీఎం తెలిపారు. ఈ ప్రాజెక్టులో టాటా సంస్థ రూ.2,100 కోట్ల పెట్టుబడి పెడుతుందన్నారు.తెలంగాణ రైజింగ్ విజన్‌లో భాగంగా 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం చెప్పారు. ఉన్నత విద్య, పరిశోధనలు, ఆవిష్కరణలు, స్టార్టప్‌ల అభివృద్ధికి తెలంగాణ కేంద్రంగా మారుతోందన్నారు. ఇప్పటికే ఐఐటీ, ట్రిపుల్ ఐటీ, నల్సార్, ఐఎస్‌బీ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలు ఉన్నాయని, హైదరాబాద్‌కు ఐఐఎం కూడా రావాల్సిన అవసరం ఉందని చెప్పారు.అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలను తెలంగాణకు తీసుకురావడానికి కృషి చేస్తున్నామన్నారు. యూనివర్సిటీ ఆఫ్ లండన్ హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ క్యాంపస్ ఏర్పాటు చేయడం తొలి విజయమని చెప్పారు. దేశ ఆర్థికాభివృద్ధికి ప్రధాన ఇంజిన్లుగా ఉన్న దిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు నగరాల అభివృద్ధి కోసం ప్రధానమంత్రి కార్యాలయం ఆధ్వర్యంలో 'ఎం-6 టాస్క్‌ఫోర్స్' ఏర్పాటు చేయాలని సీఎం ప్రతిపాదించారు. ఈ నగరాల అభివృద్ధి కోసం రూ.6 లక్షల కోట్ల ప్రత్యేక నిధిని మౌలిక వసతుల కోసం కేటాయించాలని కోరారు.తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలని కోరుతూ సీఎం పలు ప్రతిపాదనలు చేశారు. రీజినల్ రింగ్ రోడ్, హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణ, మూసీ పునరుజ్జీవనం, భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి అనుమతులు, సెమీ కండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు సహకారం అందించాలని కోరారు.

## రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు

**మొదటిపేజీ తరువాయి -** రాష్ట్రంలోని అన్ని ఆర్డీవో, తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఆధునిక సౌకర్యాలతో శాశ్వత భవనాలను నిర్మించనున్నట్లు తెలంగాణ రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. ఈరోజు అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజలకు గౌరవప్రదమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.తొలి దశలో భాగంగా 125 తహసీల్దార్, 11 ఆర్డీవో కార్యాలయాలకు ఒకే నమూనాలో కొత్త భవనాలను నిర్మించనున్నట్లు మంత్రి వెల్లడించారు. అద్దె ఇళ్లలో, శిథిలావస్థలో ఉన్న కార్యాలయాల సమస్యకు దీని ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు తుది డిజైన్లను ఖరారు చేస్తామని తెలిపారు. భవన నిర్మాణాల కోసం స్థలాల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.మరోవైపు, ఓఆర్ఆర్ పరిధిలోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 12 క్లస్టర్లుగా విభజించి ఆధునిక సమీకృత భవనాలుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే గచ్చిబౌలి, మేడ్చల్, పటాన్‌చెరు, కోహెడలలో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు.గత ప్రభుత్వం ప్రణాళిక లేకుండా మండలాల పునర్విభజన చేసిందని విమర్శించిన మంత్రి, తాము కొత్త మండలాలకు అవసరమైన పోస్టులను భర్తీ చేసి పరిపాలనను బలోపేతం చేశామని వివరించారు. అలాగే, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసం స్థలాల గుర్తింపు ప్రక్రియను ముమ్మరం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## కవిత కొత్త పార్టీకి పేరు చిక్కులు

**మొదటిపేజీ తరువాయి -** అంశం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. 'టీఆర్ఎస్' అనే పేరును ఇతరులకు కేటాయించవద్దంటూ కేంద్ర ఎన్నికల సంఘానికి (ఈసీఐ) పలు వైపుల నుంచి అభ్యంతరాలు వెల్లువెత్తాయి.ఈ వివాదంలో ప్రధానంగా భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 'టీఆర్ఎస్' అనే పేరు 14 ఏళ్ల తెలంగాణ ఉద్యమ చరిత్రతో, ప్రజల భావోద్వేగాలతో ముడిపడి ఉందని పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ తమ పార్టీని ప్రజలు 'టీఆర్ఎస్'గానే గుర్తిస్తున్నారని, కాబట్టి ఆ పేరును వేరొకరికి కేటాయించవద్దని కోరుతూ ఈసీకి అధికారికంగా ఫిర్యాదు చేసింది.మరోవైపు, కవిత పార్టీ ప్రకటనకు ఒక రోజు ముందే మహారాష్ట్ర సోలాపూర్‌కు చెందిన 'తెలంగాణ రాష్ట్రసామాజిక సేన' అనే సంస్థ కూడా 'టీఆర్ఎస్' అనే పేరు కోసం ఈసీకి దరఖాస్తు చేసుకోవడం గమనార్హం. సోలాపూర్‌కు చెందిన దయానంద్ మహాదేవ్ మామ్‌డ్యాల్ ఈ మేరకు దరఖాస్తు చేసినట్లు తెలియవచ్చింది.ఇవి మాత్రమే కాకుండా, కవిత పత్రికల్లో ఇచ్చిన ప్రకటన ఆధారంగా సుమారు 600 నుంచి 700 వరకు ప్రజా అభ్యంతరాలు ఈసీకి అందినట్లు సమాచారం. అదే సమయంలో, రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద ఇప్పటికే 'తెలంగాణ రాజ్య సమితి' పేరుతో నమోదైన మరో పార్టీ కూడా 'టీఆర్ఎస్' అనే సంక్షిప్త నామాన్ని వాడటంపై అభ్యంతరం తెలుపుతూ ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించింది.ఈ పరిణామాల నేపథ్యంలో, తమ వాదనలు వినిపించేందుకు కవిత ప్రతినిధుల బృందం త్వరలో ఎన్నికల సంఘాన్ని కలిసేందుకు సిద్ధమవుతోంది. ఒకే పేరుపై ఇన్ని వైపుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్న తరుణంలో కవిత తన కొత్త పార్టీకి 'టీఆర్ఎస్' పేరును దక్కించుకుంటారా లేదా అన్నది ఇప్పుడు తీవ్ర ఉత్కంఠ రేపుతోంది.

## నౌకలపై దాడులు ఆపండి

**మొదటిపేజీ తరువాయి -** ఉన్నారని అధికారులు తెలిపారు. ప్రభావిత సిబ్బందికి అవసరమైన సహాయం అందించేందుకు ఒమన్ అధికారులతో భారత ప్రభుత్వం నిరంతరం సమన్వయం చేసుకుంటోంది.

## టీఎంసీ రెబల్ ఎంపీల భవిష్యత్ ప్రశ్నార్థకం

**మొదటిపేజీ తరువాయి -** నేత భూపేందర్ యాదవ్ నివాసంలో ఈ రెబల్ ఎంపీలు సమావేశమైనట్లు తెలుస్తోంది. తమను ప్రత్యేక పార్లమెంటరీ గ్రూపుగా గుర్తించాలని కోరుతూ త్వరలోనే లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలవాలని వారు నిర్ణయించుకున్నారు.అయితే, ఈ ఎంపీల భవిష్యత్తు రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ (ఫిరాయింపుల నిరోధక చట్టం) పరిధిలో ఉండటంతో రాజకీయంగా ఉత్కంఠ నెలకొంది. చట్టం ప్రకారం అనర్హత వేటు నుంచి తప్పించుకోవాలంటే, పార్టీలోని మొత్తం సభ్యులలో కనీసం మూడింట రెండొంతుల మంది విడిపోవాల్సి ఉంటుంది. టీఎంసీకి ఉన్న 28 మంది ఎంపీలలో ఈ సంఖ్య 19 కాగా, తమకు 20 మంది బలం ఉందని రెబల్ వర్గం ధీమా వ్యక్తం చేస్తోంది. అయితే, కేవలం పార్టీ నుంచి విడిపోవడం సరిపోదని, మరో పార్టీలో విలీనం అయితేనే చట్టపరమైన రక్షణ లభిస్తుందని రాజ్యాంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలోనూ టీఎంసీ ఎమ్మెల్యేలు ఇటీవలే తిరుగుబాటు చేశారు. పార్టీలో అభిషేక్ బెనర్జీ నిరంకుశ వైఖరి, వారసత్వ రాజకీయాల వల్లే తాము ఈ నిర్ణయం తీసుకున్నామని తిరుగుబాటు నేతలు ఆరోపిస్తున్నారు. మరోవైపు, టీఎంసీ విధేయులు ఈ ఆరోపణలను ఖండిస్తున్నారు. నిజంగా బలం ఉంటే స్పీకర్‌కు లేఖ ఇవ్వాలని సవాల్ విసురుతున్నారు. ప్రస్తుతం అందరి దృష్టి స్పీకర్ ఓం బిర్లా తీసుకోబోయే నిర్ణయంపైనే ఉంది.

# రాత్రే ఇరాన్‌పై తీవ్ర దాడులు



**మొదటిపేజీ తరువాయి -** ట్రూత్ సోషల్ ఖాతా ద్వారా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. "ఈ రాత్రే అమెరికా బలగాలు ఇరాన్‌పై అత్యంత తీవ్రమైన దాడులు చేయనున్నాయి. త్వరలోనే ఖర్గ్ ద్వీపంతో పాటు ఇతర చమురు మౌలిక సదుపాయాల కేంద్రాలను స్వాధీనం చేసుకుంటాం. వారి చమురు, గ్యాస్ మార్కెట్లపై పూర్తి నియంత్రణ సాధిస్తాం" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.ఇప్పటికే ఇరు దేశాల మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. ఇటీవల ఇరాన్‌కు చెందిన గగనతల రక్షణ, నిఘా వ్యవస్థలపై అమెరికా దాడులు నిర్వహించింది. మరోవైపు, తమ అపాచీ హెలికాప్టర్‌ను ఇరాన్ కూల్చివేసిందని అమెరికా ఆరోపిస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో ట్రంప్ చేసిన తాజా హెచ్చరికలు అంతర్జాతీయంగా అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి.పర్షియన్ గల్ఫ్‌లో ఉన్న ఖర్గ్ ద్వీపం, ఇరాన్ చమురు ఎగుమతులకు ప్రధాన కేంద్రం. ఆ దేశం నుంచి జరిగే ముడి చమురు ఎగుమతుల్లో సుమారు 90 శాతం ఇక్కడి నుంచే సాగుతాయి. ఈ ద్వీపాన్ని స్వాధీనం చేసుకుంటామని ట్రంప్ ప్రకటించడం ప్రపంచ దేశాల్లో ఆందోళన కలిగిస్తోంది. సైనిక చర్యల హెచ్చరికల కొనసాగుతున్నప్పటికీ, ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన చర్చలు కూడా జరుగుతున్నాయని, అయితే అవి మందకొడిగా సాగుతున్నాయని తెలుస్తోంది.

## నీతి ఆయోగ్ భేటీలో 'స్వర్ణాంధ్ర ఏ2047' విజన్

### సీఎం చంద్రబాబు కీలక ప్రజంటేషన్



ఢిల్లీ వేదికగా జరిగిన 11వ నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర సమగ్రాభివృద్ధికి సంబంధించిన కీలక ప్రణాళికను ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వ 'వికసిత భారత్ ఏ2047' లక్ష్యానికి అనుగుణంగా 'స్వర్ణాంధ్ర ఏ2047' విజన్‌ను ఆయన సభ్యుల ముందుంచారు. ఈ విజన్ ద్వారా రాష్ట్రాన్ని సంపన్న, సమ్మిళిత, ప్రపంచ పోటీతత్వ ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యమని స్పష్టం చేశారు.మానవ వనరుల ఆధారిత అభివృద్ధి నమూనాను అమలు చేస్తామని చంద్రబాబు వివరించారు. దీని ద్వారా సంపూర్ణ పేదరిక నిర్మూలన, భారీ ఎత్తున ఉపాధి అవకాశాల కల్పన, నైపుణ్యాభివృద్ధి, జల, ఇంధన భద్రత కల్పించడం తమ ప్రభుత్వ ప్రాధాన్యతలని తెలిపారు. వ్యవసాయ-టెక్, లాజిస్టిక్స్, డీప్-టెక్ వంటి రంగాలను అనుసంధానిస్తూ అభివృద్ధిని వేగవంతం చేస్తామని అన్నారు. పాలనలో పారదర్శకత, సామర్థ్యం పెంచేందుకు రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత విశ్లేషణలు, రియల్ టైమ్ మానిటరింగ్ వ్యవస్థలు, 'అవేర్' వంటి ముందస్తు అంచనా సాధనాలను వినియోగిస్తున్నామని, ఇవి మెరుగైన పౌర సేవలకు దోహదపడుతున్నాయని పేర్కొన్నారు.తమ ప్రభుత్వం తీసుకొచ్చిన పాలనా సంస్కరణలు, పారదర్శక విధానాలు, వ్యాపార అనుకూల వాతావరణం కారణంగా గత రెండేళ్లలోనే ఆంధ్రప్రదేశ్‌కు రూ.23 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయని ముఖ్యమంత్రి సభకు తెలియజేశారు. దీనివల్ల రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఉపాధి కల్పనతో పాటు ఆర్థిక వృద్ధికి మార్గం సుగమమైందని అన్నారు.ఈ సందర్భంగా రాష్ట్రాల మధ్య పెట్టుబడుల ఆకర్షణ కోసం అనారోగ్యకరమైన పోటీ తగదని హితవు పలికారు. కేవలం ప్రోత్సాహకాలపై ఆధారపడకుండా మౌలిక సదుపాయాల బలోపేతం, విధాన స్థిరత్వం, అనుమతుల వేగవంతం వంటి సుస్థిర అభివృద్ధి మార్గాలపై దృష్టి సారించాలని రాష్ట్రాలకు సూచించారు.సమ్మిళిత అభివృద్ధి తమ ప్రభుత్వ అజెండా అని పునరుద్ఘాటించిన చంద్రబాబు, ప్రతి కుటుంబానికి ఇల్లు, పారిశుద్ధ్యం, కుళాయి నీరు, స్వచ్ఛమైన వంట ఇంధనం, విద్యుత్, డిజిటల్ కనెక్టివిటీ, ప్రత్యక్ష నగదు బదిలీ వంటి ఏడు ప్రాథమిక అవసరాలను అందిస్తామని తెలిపారు.సమాజంలోని ఉన్నత వర్గాల్లోని 10 శాతం మంది, అట్టడుగున ఉన్న 20 శాతం మందికి అండగా నిలిచేందుకు ఉద్దేశించిన వినూత్న 'పీ4-ఎంబీకే 10-20' కార్యక్రమాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. ఆరోగ్య రంగంలో 'ప్రాజెక్ట్ సంజీవని' ద్వారా నివారణ వైద్యానికి పెద్దపీట వేస్తున్నామని, ఏఐ ఆధారిత విద్యతో భవిష్యత్ అవసరాలకు యువతను తీర్చిదిద్దుతున్నామని వివరించారు.రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు 1.5 కంటే తక్కువగా ఉన్న విషయాన్ని ప్రస్తావిస్తూ, జనాభా సుస్థిరతపై జాతీయ స్థాయిలో దృష్టి సారించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. భవిష్యత్తులో శ్రామిక శక్తి కొరత, వృద్ధాప్య సంబంధిత సవాళ్లను ఎదుర్కొనేందుకు రాష్ట్ర జనాభా నిర్వహణ విధానాన్ని రూపొందించినట్లు తెలిపారు.సహకార సమాఖ్య స్ఫూర్తికి ఆంధ్రప్రదేశ్ కట్టుబడి ఉందని, 'వికసిత భారత్ 2047' అనే ఉమ్మడి లక్ష్యాన్ని సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం, నీతి ఆయోగ్‌తో కలిసి పనిచేస్తామని హామీ ఇచ్చారు.

# వామపక్షాల దారెటు...

విజయవాడ, జూన్11, తెలుగు రాష్ట్రాల్లో వామపక్ష భావజాలం కాస్తా పక్కదారి పట్టినట్టు కనిపిస్తోంది. మొన్నటి ప్రొఫెసర్ నాగేశ్వర్ ఎపిసోడ్లో కూడా ఇది స్పష్టమైంది. ఇప్పుడు తాజాగా విశాఖపట్నంలో వామపక్షాల నేతలు వ్యవహరించిన తీరు అభ్యంతరకరంగా ఉంది. రాజకీయ ప్రేరేపితం అన్నట్టు వారి ప్రవర్తన ఉంది. కూటమి వచ్చిన తర్వాత వామపక్షాలతో పాటు ప్రజా సంఘాలకు కొంత స్వేచ్ఛ వచ్చిన మాట వాస్తవం. ఐదేళ్ల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో కనీసం నోరు తెరవ లేకపోయారు వామపక్షాల నేతలు, ప్రజా సంఘాల ప్రతినిధులు. అంతలా ఉక్కు పాదం మోపారు జగన్మోహన్ రెడ్డి. అయితే ఇప్పుడు కూటమి వచ్చిన తర్వాత స్వేచ్ఛ ఇస్తే.. మరోలా మాట్లాడుతున్నారు. లేనిపోని వివాదాలు తెచ్చుకుంటున్నారు. తెలంగాణలో కేసీఆర్, ఏపీలో జగన్మోహన్ రెడ్డి వామపక్షాలను ఎంతలా చూశారో అందరికీ తెలిసిన విషయమే.. ఇప్పుడు వారిద్దరి పార్టీలకు మైలేజ్ వచ్చేందుకు ఇదే వామపక్షాల నేతలు, ప్రజా సంఘాల ప్రతినిధులు ప్రయత్నిస్తుండటం మాత్రం విమర్శలకు తావిస్తోంది.వామపక్షాలతో పాటు ప్రజా సంఘాలు అంటే ముందుగా గుర్తొచ్చేది సమస్యల పరిష్కారం. కార్మికులతో పాటు ఉద్యోగులు వామపక్షాలను ఆశ్రయిస్తారు. ఎందుకంటే వారు పోరాటం చేస్తే ఏదో ఒక సమస్యకు పరిష్కార మార్గం దొరుకుతుందన్న ఆశ. అయితే ఇప్పుడు వామపక్షాలతో పాటు ప్రజా సంఘాలు రాజకీయ ప్రేరేపితం అనే చట్రంలో చిక్కుకుంటున్నాయి. లేనిపోని వివాదాలకు అవకాశం కల్పిస్తున్నాయి. సమస్యలకు పరిష్కారం మరిచి.. మరింత జఠిలం చేస్తున్నాయి. తాజాగా విశాఖ స్టీల్ ప్లాంట్ ఘటనకు సంబంధించి.. బాధితుల పరామర్శకు వెళ్లిన.. బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చిన మంత్రి లోకేష్ పై నిలదీసినంత పని చేశారు. ఆయన సైతం తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ.. చనిపోయింది మీ కుటుంబాలు వారు కాదు కదా? బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారు అంటూ.. విరుచుకు పడే దాకా పరిస్థితి వచ్చింది.ఇప్పుడు అనవసరంగా విశాఖకు చెందిన వామపక్షాల నేతలు ట్రోల్ అవుతున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ అంశం తెరపైకి వచ్చింది. నాడు జగన్ సర్కార్ నోరు తెరవలేదు. కనీసం ప్రైవేటీకరణను నిలువరించే ప్రయత్నం చేయలేదు. ఎప్పుడైతే బిజెపితో టిడిపి, జనసేనకు పొత్తు కుదిరిందో.. నాటి నుంచి విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం యూటర్న్ తీసుకుంది. ప్రైవేటీకరణ ఆగింది. 13 వేల కోట్ల రూపాయల ప్యాకేజీ సమకూరింది. వైసీపీ హయాంలో కొందరు వామపక్షాల నేతలు చెట్టాపట్టాలు వేసుకుని తిరిగారు వైసీపీ నేతలతో. కానీ ఇప్పుడు మాత్రం బాధ్యతగా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. స్టీల్ ప్లాంట్ అనేది కేంద్ర ప్రభుత్వ పరిధిలో పనిచేస్తుంది. కేంద్ర ఉక్కు శాఖ పర్యవేక్షిస్తుంది. మానవతా దృక్పథంతో రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత కుటుంబాలను ఆదుకునేందుకు ముందుకు వచ్చింది. అయితే ఇప్పుడు వైసీపీ ట్రాప్ లో పడి వామపక్షాల నేతలు సమస్యలకు పరిష్కారం చూపించాల్సింది పోయి? తామే సమస్యలను సృష్టిస్తున్నారు. వారికి ఉన్న మంచి పేరును చెడగొట్టుకుంటున్నారు

# ఫీల్ గుడ్ తప్ప.. ఫీల్డ్ లో బ్యాడే

గుంటూరు, జూన్11, పల్నాడు జిల్లా నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు వ్యవహారం గురించి ప్రస్తుతం రకరకాల చర్చలు జరుగుతున్నాయి, కొందరికి కొత్త కొత్త డౌట్స్ వస్తున్నాయి. అసలు ఆయన్ని ఏ కోణంలో చూడాలంటూ పార్టీ వర్గాలే మాట్లాడుకుంటున్నాయి. పైకి మంచి అనిపిస్తున్నా కాస్త లోతుల్లోకి తొంగి చూస్తే ఎక్కడో ఏదో తేడా కొడుతోందని అనేవాళ్ళ సంఖ్య నియోజకవర్గంలోనే పెరిగిపోతోంది. ఈ పరిస్థితుల్లోనే తాజాగా టీడీపీ అధిష్టానం ఐవీఆర్ఎస్ సర్వే నిర్వహించి ఎంపీ పనితీరుకు సంబంధించిన ప్రశ్నలు సంధించడం కలకలం రేపుతోంది. 2019లో తొలిసారి నరసరావుపేట నుంచి వైసీపీ తరపున గెలిచారు లావు. 2024 ఎన్నికల్లో మరోసారి అక్కడి నుంచే బరిలో దిగాలని అనుకున్నా గుంటూరు పంపాలని నిర్ణయించింది అధిష్టానం. ఆ క్రమంలోనే వైసీపీకి రాజీనామా చేసి కొన్నాళ్ళ తర్వాత టీడీపీ కండువా కప్పుకున్నారాయన. రెండోసారి సైకిల్ గుర్తు మీద నరసరావుపేట ఎంపీగా పోటీ చేసి విజయం సాధించారు. ప్రస్తుతం ఈ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో అందరూ టీడీపీ ఎమ్మెల్యేలే ఉన్నారు. మొదట్లో అంతా బాగానే ఉన్నా? మెల్లిగా పదవుల పంపకాల్లో శ్రీకృష్ణదేవరాయులుతో పాటు టీడీపీలో చేరిన వారికి ప్రాధాన్యత లభిస్తోందంటూ వివాదం మొదలైంది. వినుకొండకు చెందిన మక్కెన మల్లిఖార్జునరావుకు జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ పదవి దక్కడం వెనక ఎంపీ చొరవ ఉందని పార్టీలో ప్రచారం జరిగింది. అలాగే?లావుతో పాటు టీడీపీలోకి వచ్చిన మాజీ ఎమ్మెల్యే జంగా కృష్ణమూర్తికి టీటీడీ బోర్డు మెంబర్‌గా అవకాశం లభించింది. ఎంపీ పరపతిని గట్టిగా వాడటం వల్లే వాళ్ళకు పదవులు వచ్చాయన్న టాక్ గట్టిగా నడిచింది పల్నాడు టీడీపీలో. అటు లోక్‌సభలో టీడీపీ ఫ్లోర్ లీడర్‌గా ఎంపీకి టీడీపీ అధిష్టానం కూడా ప్రాధాన్యం ఇచ్చింది.అదంతా ఒక ఎత్తయితే శ్రీకృష్ణ దేవరాయలు పార్టీలో గ్రూప్స్‌ని ప్రోత్సహిస్తున్నారన్న అభిప్రాయం బలపడుతోంది. ఇదే ఇప్పుడు సమస్యగా మారుతోందట. గతంలో వైసీపీ ఎంపీగా ఉన్నప్పుడు కూడా ఆయన గ్రూపులు ప్రోత్సహించారన్న ఆరోపణలున్నాయి. టీడీపీలో కూడా అదే ట్రెండ్ కొనసాగిస్తున్నారంటూ లోకల్‌గా పార్టీలో అసహనం వ్యక్తం అవుతోంది. పల్నాడు జిల్లా కేంద్రమైన నర్సరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబుతో ఎంపీకి పొసగడం లేదని చెప్పుకుంటున్నారు. ఎంపీతో సన్నిహితంగా ఉంటాడని పేరున్న నర్సరావుపేట జనసేన నేత తరచూ తమనేతను టార్గెట్ చేస్తూ ఆరోపణల డోస్ పెంచడమే ఇందుకు నిదర్శనం అంటున్నారు ఎమ్మెల్యే వర్గీయులు. లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని మిగతా ఎమ్మెల్యేలతో ఇప్పటికిప్పుడు విబేధాలు బయటపడకున్నా?అంతర్గతంగా ఏదో నడుస్తోందన్నది ఇంటర్నల్ టాక్. లావు తనతోపాటు వచ్చిన వారికి ప్రాధాన్యత ఇవ్వడం టీడీపీలో కొంతమంది సీనియర్లకు ఇష్టం లేదట. నియోజకవర్గాల్లో తమ ప్రాధాన్యత తగ్గకుండా చూసుకోవాలన్న టార్గెట్‌తో? ముందు జాగ్రత్తగా ఎంపీ వర్గీయులకు చెక్ పెట్టేలా ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే? తాజాగా ఎంపీ పనితీరు ఎలా ఉందంటూ నియోజకవర్గంలో చాలా మందికి ఐవీఆర్ఎస్ కాల్స్ వచ్చాయి. లావుకు పార్టీలో అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని చెప్పుకుంటున్న టైంలో? ఆయన పనితీరు గురించి టీడీపీ అధిష్టానం సర్వే నిర్వహించడం ప్రాధాన్యం సంతరించుకుంది. శ్రీకృష్ణదేవరాయలు వ్యవహారశైలి గురించి పార్టీ పెద్దలకు ఫిర్యాదులు వెళ్ళడం వల్లే ఈ సర్వే నిర్వహించారా అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఎంపీ తీరు నచ్చని కొంతమంది నేతలైతే. అవును, నిజమే?. అందుకే సర్వే చేశారంటూ బల్ల గుద్దుతున్నారు. మొత్తం మీద నరసరావుపేట టీడీపీలో ఇప్పుడు ఐవీఐర్ఎస్ ప్రకంపనలు రేగుతున్నాయి.

# కర్నూలులోనూ కుప్పం ఫార్ములా...

కర్నూలు, జూన్11, 2024 ఎన్నికల వరకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో టీడీపీ బాగా బలహీనంగా ఉండేది. అది ఎంతలా అంటే? 2019లో అసెంబ్లీకి, లోక్‌సభకు జిల్లా నుంచి అస్సలు ప్రాతినిధ్యమే లేనంత. ఇక జెడ్పీ, మున్సిపాలిటీల్లోనూ అదే పరిస్థితి. ఇక్కడ ఇంకో విచిత్రం ఏంటంటే? పార్టీ క్యాడర్ బలంగా వున్నా, కేవలం నాయకుల మధ్య విబేధాలు, వాళ్ళ మీదున్న వ్యతిరేకత లాంటి కారణాలతోనే టీడీపీ వెనుకబడింది. సుమారు రెండు దశాబ్దాల పాటు ఉమ్మడి జిల్లాలో టీడీపీ బలహీనంగానే కనిపించింది. కానీ? 2024 ఎన్నికలకు వచ్చేసరికి అనూహ్యంగా పుంజుకుంది తెలుగుదేశం. జిల్లాలోని మొత్తం 14 అసెంబ్లీ, రెండు లోక్‌సభ నియోజకవర్గాలకుగాను కూటమి12 అసెంబ్లీ, రెండు ఎంపీ సీట్లలో గెలిచింది. అందులో టీడీపీ వాటానే 11 అసెంబ్లీ , 2 ఎంపీ సీట్లు. దీంతో? ఇక పూర్వ వైభవం వచ్చినట్టేనని సంబరపడ్డారు ఇక్కడి తమ్ముళ్లు. కానీ ఇప్పుడు ఒక్కసారి రెండేళ్ళ వెనక్కి తిరిగి చూసుకుంటే? మొత్తం తేడాతేడాగానే కనిపిస్తోందట. పరిస్థితి మళ్లీ అధ్వాన్నంగానే మారుతోందన్నఅభిప్రాయం టీడీపీ వర్గాల్లోనే బలపడుతోంది. అందుకు కూటమి పార్టీల మధ్య సమన్వయ లోపం ఒక కారణం అయితే టీడీపీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో నేతల తీరు మరో కారణం అంటున్నారు. శాసనసభ్యుల తీరు పార్టీకి తీరని నష్టం కలిగించేలా ఉందన్న వాదన బలపడుతోంది.కొందరు ఎమ్మెల్యేలు నిత్యం వివాదాల్లో చిక్కుకోవడం, నియోజకవర్గాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు, భూ కబ్జా ఆరోపణలు, అక్రమ రిజిస్ట్రేషన్లతో భూములు సొంతం, దౌర్జన్యాలు, అనుచరుల ఆగడాలు వెరసి కూటమి ప్రభుత్వానికి మరకలు అంటుకునేలా చేస్తున్నాయన్నది కేడర్ వాయిస్. వీటన్నిటికీ మించి ఎమ్మెల్యేలు, ఇతర నేతలు, కార్యకర్తల మధ్య సమన్వయం లేకపోవడం, కొన్ని నియోజకవర్గాల్లో సీనియర్ నేతలు పార్టీని వీడిపోవడం, దూరంగా ఉండడం లాంటివి నష్టం కలిగిస్తున్నట్టు చెబుతున్నారు. ఆలూరు, మంత్రాలయం, ఆదోని, ఎమ్మిగనూరు, నందికొట్కూరు, డోన్, నంద్యాల, ఆళ్లగడ్డ, శ్రీశైలం నియోజకవర్గాల్లో సమస్యలు అధికంగా ఉన్నాయట. దీంతో.. ఇప్పుడు ఆయా నియోజకవర్గాల్లో కూడా కుప్పం ఫార్ములాను అప్లయ్ చేస్తారా అంటూ తాజా చర్చలు జరుగుతున్నాయి. తన సొంత నియోజకవర్గం కుప్పంలో పార్టీ నేతలు గాడి తప్పుతున్నారని గుర్తించిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నియోజకవర్గ వ్యవహారాలను చూస్తున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్‌ను ఉన్నఫళంగా బాధ్యతల నుంచి తప్పించడం హాట్ టాపిక్ అయింది. దాంతో.. గాడి తప్పుతున్న కర్నూలు వ్యవహారాలను కూడా అదే స్పీడ్‌తో, అంతే స్ఫూర్తితో సెట్ చేస్తారా అంటూ మాట్లాడుకుంటున్నాయి పార్టీ వర్గాలు. పార్టీని చక్కదిద్దేందుకు చంద్రబాబు తన నియోజకవర్గం నుంచే ఆపరేషన్ ప్రారంభించారని, జిల్లాలోనూ ఆ ఫార్ములాను అమలు చేస్తే బాగుంటుందని కొందరు అంటుంటే? అలా చేస్తారా అంటూ క్వశ్చన్ మార్క్ ఫేస్ పెట్టేవాళ్ళు మరికొందరు.ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 14 అసెంబ్లీ నియోజకవర్గాలకుగాను. 8 నుంచి 10 చోట్ల అంతర్గత సమస్యలతో సతమతం అవుతోంది టీడీపీ. ఎమ్మెల్యేల తీరుపై విమర్శలు తీవ్రస్థాయిలో ఉన్నట్టు అధిష్టానం దగ్గర కూడా నివేదికలు ఉన్నాయట. ఎమ్మెల్యేలపై ఆరోపణలు ఉన్న నియోజకవర్గాల్లోని పరిస్థితి ఇటీవల సమీక్షించిన చంద్రబాబు ఒక హెచ్చరిక కూడా పంపారట. నియోజకవర్గంలో పరిస్థితి ఎలా ఉందో నేరుగా చెప్పి స్ట్రాంగ్ వార్నింగ్ కూడా ఇచ్చినట్టు సమాచారం. అయినా సరే? కొందరి తీరు మారడం లేదనే అభిప్రాయం కూడా పెరుగుతున్నట్టు తెలిసింది. ఈ పరిస్థితుల్లో అందర్నీ సెట్ చేయాలంటే? కుప్పం తరహా ట్రీట్ మెంట్‌ను ఉమ్మడి కర్నూలు జిల్లాలో కూడా ఇస్తారనే చర్చ పార్టీ వర్గాల్లో జరుగుతోంది. అందులోనూ?. మా నియోజకవర్గంలోనే కఠిన నిర్ణయం తీసుకునే అవకాశం ఉందంటూ ఎమ్మెల్యేలపై అసంతృప్తిగా ఉన్న కొందరు ఆల్రెడీ ప్రచారం మొదలుపెట్టేశారట. అలాంటి వాళ్ళంతా స్థానిక పరిస్థితుల్ని ఎప్పటికప్పుడు అధిష్టానానికి చేరవేస్తున్నట్టు తెలుస్తోంది. కుప్పం తరహా ట్రీట్‌మెంట్ ఒక్కరికి ఇచ్చినా? మిగతా నియోజకవర్గాలన్నిటిలో ఎక్కడి వాళ్ళు అక్కడ సెట్ అవుతారన్న అభిప్రాయం పెరుగుతోంది.

# టీజీ వర్సెస్ బైరెడ్డి

## లేటెస్ట్ గా వెంకటేష్ ఎంట్రీ

కర్నూలు, జూన్ 11, కర్నూలు రాజకీయాలు వేడెక్కాయి. టీజీ భరత్, బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి మధ్య మొదలైన వివాదంలోకి టీజీ వెంకటేష్ ఎంట్రీ ఇచ్చారు. సిద్ధార్థ్ రెడ్డి నోరు జాగ్రత్తగా పెట్టుకుని మాట్లాడాలంటూ టీజీ వెంకటేష్ పరోక్షంగా హెచ్చరించారు. ఆయన తాత తనకు బాగా పరిచయమని.. ఆ పరిచయంతోనే మంచిగా మాట్లాడేది నేర్చుకోమని చెప్తున్నానని సలహా ఇచ్చారు. ఇలాగే మాట్లాడితే తాము ఊరుకున్నా.. తమ కార్యకర్తలు నాలుక కట్ చేస్తారంటూ వార్నింగ్ ఇచ్చారు.రాయలసీమ రాజకీయాలు వేడెక్కాయి. వైసీపీ నేత బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డికి, టీజీ కుటుంబానికి మధ్యన మాటల యుద్ధం నడుస్తోంది, బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి వర్సెస్ టీజీ భరత్ గా మొదలైన కర్నూలు రాజకీయం.. ఇప్పుడు మరో టర్న్ తీసుకుంది. ఇందులోకి మంత్రి టీజీ భరత్ తండ్రి టీజీ వెంకటేష్ ఎంట్రీ ఇచ్చారు. టీజీ భరత్, బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి మధ్య మొదలైన ఈ సవాళ్లు- ప్రతి సవాళ్లలోకి టీజీ వెంకటేష్ ప్రవేశించారు. బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి పేరు ప్రస్తావించకుండానే



స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఎగిరెగిరి పడినవాళ్లంతా చల్లారిపోయారని.. మాటలు జాగ్రత్తగా మాట్లాడాలని టీజీ వెంకటేష్ హెచ్చరించారు."కొంతమంది అప్పుడప్పుడూ ఎగిరిపడుతుంటారు. ఇటీవలే ఒకడు ఎగిరిపడ్డాడు. ఆ అబ్బాయికి సంవత్సరం కిందటే ఓసారి మాటల్లో చెప్పా. నీ పేరు అందరికీ తెలిసింది. భవిష్యత్తు బాగుంటుంది. జాగ్రత్తగా మాట్లాడి, నోరుపారేసుకోకుండా బాగా మాట్లాడేది నేర్చుకోమని చెప్పా. ఎక్కడో వారిపై ప్రేమ ఉండేది. ఎందుకంటే వాళ్ల తాత నాకు క్లోజ్. చాలా సంవత్సరాలు కలిసి మెలిసి ఉన్నాం. ఆ పరిచయాలతోనే చెప్పా. కుటుంబంలో నికృష్టుడు పుడుతుంటారు. మంచి కుటుంబాల్లోనూ దరిద్రులు పుడుతుంటారు. అలాంటి వారికి బుద్ధి చెప్పే విధానాలు వేరుగా ఉంటాయి. ఒకసారి, రెండుసార్లు, మూడుసార్లు ఇలా చూస్తాం."""" రాయలసీమలో మీసాలు తిప్పుకున్నోళ్లంతా, మీసాలు దింపుకుని మాతో సహకరించారు. ఏదో వందమంది రౌడీలను వేసుకుని ఎగిరిపడుతున్నారు. ఆ పిల్లోడికి చెప్పేదొక్కటే. వాళ్లు 100 మందిని తెస్తే మేము వేయిమందిని తెస్తాం. వాళ్లు వేయిమందిని తెస్తే మేము పదివేల మందిని తేగలం.. 10 వేల మందిని తెస్తే.. లక్ష మందిని తెస్తాం. వాళ్లు లక్ష రూపాయలు ఖర్చుచేస్తే.. నేను కోటి రూపాయలు ఖర్చు చేయగలను. నోరు పారేసుకుంటే మేమేమీ చేయకపోయినా.. మా కార్యకర్తలు ఎవరో ఒకరు నాలుక కట్ చేస్తారు.. జాగ్రత్తగా ఉండాలి" అంటూ బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డికి టీజీ వెంకటేష్ వార్నింగ్ ఇచ్చారు.కర్నూలు చెందిన సతీష్ అనే దళిత యువకుడు ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే సతీష్ కుటుంబానికి ఓ ఫార్మా కంపెనీ నుంచి డబ్బులు అందాయంటూ బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి ఆరోపించటంతో ఈ వ్యవహారం మొదలైంది. సతీష్ కుటుంబానికి న్యాయం చేయాలని అడుగుతున్నందుకు అధికార పార్టీ తనను బెదిరిస్తోందన్న బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి.. ఈ క్రమంలోనే టీజీ భరత్ మీద అవినీతి ఆరోపణలు చేశారు. అయితే బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి ఆరోపణలను తీవ్రంగా ఖండించిన మంత్రి టీజీ భరత్.. సిద్ధార్థ్ రెడ్డిని జోకర్ అంటూ విమర్శించారు. సిద్ధార్థ్ రెడ్డి మీద పరువు నష్టం దావా వేస్తామని హెచ్చరించారు. ఈ క్రమంలోనే ఈ వ్యవహారంలోకి ఎంట్రీ ఇచ్చిన టీజీ వెంకటేష్.. నోరు జాగ్రత్తగా పెట్టుకోవాలంటూ బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డికి పరోక్షంగా వార్నింగ్ ఇచ్చారు

# రూట్ మార్చిన కొల్లగట్ల...

విజయనగరం జూన్ 11,విజయనగరం జిల్లా రాజకీయాల్లో ఇప్పుడు మాజీ డిప్యూటీ స్పీకర్ వ్యవహారంపై హాట్ హాట్ డిస్కషన్స్ నడుస్తున్నాయి. మరీ ముఖ్యంగా కోలగట్ల వీరభద్రస్వామి సొంత పార్టీ వైసీపీ నాయకులకైతే ఆయన అంతరంగం అంతుచిక్కక గందరగోళ పడుతున్నారట. ఒకప్పుడు అందరికీ అందుబాటులో ఉంటూ, పార్టీ కార్యక్రమాల్లో యాక్టివ్‌గా కనిపించే స్వామి. ఇప్పుడు ఎందుకు గడప దాటటం లేదు? యాక్టివ్‌గా కనిపించడం లేదంటూ రకరకాలుగా మాట్లాడుకుంటున్నారు. ఆ క్రమంలోనే? కొన్ని కొత్త సంగతులు తెలుస్తున్నాయట. మాజీ డిప్యూటీ స్పీకర్ తన వారసురాలి రాజకీయ భవిష్యత్ విషయమై ఆందోళనగా ఉన్నట్టు చెప్పుకుంటున్నారు. ఆ క్రమంలోనే ఒకడుగు వెనక్కేస్తున్నారన్నది ఇంటర్నల్ టాక్. ఒకప్పుడు ఉదయం నుంచి రాత్రి వరకు పార్టీ కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారం, సమావేశాలు, నిరసనలు అంటూ నిత్యం ప్రజల మధ్యనే కనిపించేవారాయన. కానీ కొంతకాలంగా రాజకీయంగా నెమ్మదించారన్నది జిల్లాలో ఉన్న విస్తృతాభిప్రాయం. దాంతో గతంలో కనిపించినంత చురుగ్గా ఎందుకు లేరంటూ పార్టీ వర్గాలు సైతం సమాధానాలు వెదికే ప్రయత్నంలో ఉన్నాయి. తన సహజ శైలికి భిన్నంగా ప్రస్తుతం పార్టీ కార్యక్రమం ఉంటే హాజరవుతున్నారు. నాయకత్వం పిలిస్తే ముందుకొస్తున్నారు తప్ప యాక్టివ్ రోల్ తీసుకోవడం లేదు.అయితే ఈ మౌనం వెనుక ఉన్నది రాజకీయ వ్యూహమా? లేక కుటుంబ రాజకీయ భవిష్యత్తుపై ఆలోచనలా అన్న ప్రశ్నలు వస్తున్నాయి. వాటికి సమాధానంగానే వినిపిస్తోంది వారసత్వ వ్యవహారం. తన కుమార్తె శ్రావణి రాజకీయ భవిష్యత్తుపై కోలగట్ల ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్టు చెబుతున్నారు. ఆమె గతంలో డిప్యూటీ మేయర్ బాధ్యతలు కూడా నిర్వహించినందున ఇక మీదట తనకు బదులుగా కుమార్తెను పొలిటికల్‌గా ప్రమోట్ చేయాలని భావిస్తున్నారట. ఆమె రాజకీయ భవిష్యత్‌కు బాటలు వేసే క్రమంలోనే? వైసీపీ అధిష్టానం మీద వత్తిడి తెచ్చేలా వ్యూహాత్మక మౌనం పాటిస్తున్నారన్నది లోకల్ టాక్. ముఖ్యంగా విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పదవిపై కోలగట్ల కన్నుపడిందని అంటున్నారు. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో తన కుమార్తె శ్రావణిని పార్టీ తరపున మేయర్ అభ్యర్థిగా ప్రకటించాలని, ఆ మేరకు ఇప్పుడే తనకు హామీ ఇవ్వాలని వీరభద్రస్వామి పట్టుబడుతున్నట్టు తెలుస్తోంది. ఛాన్స్ దొరికినప్పుడే ఉపయోగించుకుంటూ? తాను పాలిటిక్స్‌లో యాక్టివ్‌గా ఉన్నప్పుడే కుమార్తె భవిష్యత్‌కు బాటలు వేయాలని అనుకుంటున్నారట కోలగట్ల. అందుకే పార్టీ అధిష్టానం నుంచి హామీ కోరుతూ? ఆ విషయంలో క్లారిటీ వచ్చేదాకా కామ్ ఉండాలని భావిస్తున్నట్టు సమాచారం. మరోవైపు పార్టీ నాయకత్వం మాత్రం అలాంటి హామీలకు ఇది సమయం కాదని అంటున్నట్టు తెలిసింది. మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయన్న విషయంలో క్లారిటీ లేదు. అప్పటికి రాజకీయ సమీకరణలు ఎలా మారతాయో తెలియదు.

# జగన్ కొత్త టీమ్...

నెల్లూరు, జూన్ 11, జగన్మోహన్ రెడ్డికి ఒక కోర్ టీం ఉంది. చాలా దగ్గరగా మెలిగే ఒక బృందం ఉంది. ఆయన చుట్టూ ఒక రక్షణ కవచంలా ఉంటుంది. ఆయన రాజకీయాల్లో యాక్టివ్ అయిన తర్వాత? వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన తర్వాత.. అధికారంలోకి వచ్చిన తర్వాత.. ఈ కోర్ కమిటీ లో కీలక వ్యక్తులు చేరుతూ వచ్చారు. నాగేశ్వర్ రెడ్డి వ్యక్తిగత సహాయకుడిగా ఉండేవారు. కృష్ణమోహన్ రెడ్డి ఓ ఎస్ డి గా వ్యవహరించేవారు. సీఎంగా మారిన తర్వాత ధనుంజయ రెడ్డి ఆయనకు వ్యక్తిగత కార్యదర్శిగా ఉండేవారు. సజ్జల రామకృష్ణారెడ్డి సలహాదారుడిగా మెలిగారు. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అయితే గట్టి మద్దతుదారుడిగా నిలిచారు. కానీ తాజాగా వీరందరినీ పక్కనపెట్టి కొత్త టీం ఏర్పాటు చేసుకునే పనిలో ఉన్నారట జగన్మోహన్ రెడ్డి. ఇటీవల జరిగిన పరిణామాలతో ఆయన కలత చెందారట. చుట్టూ వీరిని ఉంచుకొని రాజకీయాలు చేయలేనని భావించి.. కొత్త టీం ను రంగంలోకి దించేందుకు సిద్ధమయ్యారట.2024 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దారుణ పరాజయంతో జగన్మోహన్ రెడ్డి చుట్టూ ఉన్న కోటరీ పై అనేక రకాల ఆరోపణలు వచ్చాయి. వారి తీరుతోనే పార్టీ నేతలకు అధినేతకు మధ్య గ్యాప్ వచ్చిందని విమర్శలు వచ్చాయి. అయితే వైసిపి అధికారంలో ఉన్నప్పుడే జగన్మోహన్ రెడ్డి చుట్టూ ఉన్న కోర్ టీం పై అనేక రకాల ఫిర్యాదులు ఉన్నాయి. కానీ అధికారంలో ఉన్నప్పుడు ఇవి సహజం అని చాలా లైట్ తీసుకున్నారు జగన్మోహన్ రెడ్డి. అటు అధికారం కోల్పోయిన తర్వాత కూడా ఈ కోర్ టీం కూటమి ప్రభుత్వానికి టార్గెట్ అయింది. అయితే తనకు అండగా నిలిచినందునే ప్రభుత్వం టార్గెట్ చేసిందని భావించారు జగన్మోహన్ రెడ్డి. కానీ ఎప్పుడైతే మద్యం కుంభకోణంలో నమ్మలేని నిజాలు బయటపడ్డాయో అప్పటినుంచి ఆలోచనలో పడ్డారు.సాధారణంగా అధికార పార్టీ అంటేనే అవినీతి అనేది ఉంటుంది. ఆ ఆరోపణలు కూడా వస్తుంటాయి. అదే మాదిరిగా తన చుట్టూ ఉన్న కోర్ టీం పై అవినీతి ఆరోపణలు వచ్చి ఉంటాయని జగన్మోహన్ రెడ్డి భావించారు. కానీ ఒక్కొక్కరి అక్రమ సంపాదనను ప్రత్యేక దర్యాప్తు బృందం బయటపెడుతోంది. మరోవైపు కేంద్ర సంస్థ ఈడీ సైతం వెల్లడిస్తోంది. తన వ్యక్తిగత సహాయకుడి వద్ద వందల కోట్ల రూపాయల ఆస్తులు బయటపడేసరికి జగన్ సైతం ఆశ్చర్యపోయారట. తాను ఎంతో నమ్మిన అధికారులుగా తన వద్ద పెట్టుకున్న వారు సైతం భారీగా పోగేసుకోవడాన్ని జగన్మోహన్ రెడ్డి గుర్తించారట. అయితే అత్యంత వీర విధేయుడుగా మెలిగిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అక్రమ సంపాదన చూసి ఆశ్చర్యపోయారట. సజ్జల రామకృష్ణారెడ్డి శిబిరం చేతికి మట్టి అంటకుండా చేసిన దోపిడీ గురించి తెలుసుకొని జగన్ బాధపడ్డారట. ఇంతకాలం ఇటువంటి వారిని చుట్టూ పెట్టుకున్నానా? అని బాధపడుతున్నారట. అందుకే కోర్ టీం మార్చాలన్న నిర్ణయానికి వచ్చారట.వచ్చే ఏడాది పాదయాత్రకు సిద్ధపడుతున్నారు జగన్మోహన్ రెడ్డి. ఆ సమయానికి తన చుట్టూ ఉన్న టీం ను మార్చే పనిలో ఉన్నారట. గతంలో విజయసాయిరెడ్డి ఉండేవారు. ఆయన సైతం బయటకు వెళ్లిపోయారు. అయితే ఇప్పుడు నమ్మకస్తులుగా భావించిన కోర్ టీం నట్టేట ముంచెయ్యడంతో జగన్ ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. అయితే జగన్ కొత్త టీం లో ఎవరు చేరుతారు అనేది ఇప్పుడు ప్రశ్నార్థకం. రకరకాల పేర్లు తెరపైకి వస్తున్నాయి. కానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో జగన్ కోర్ టీంలో ఎవరు చేరుతారు? అనే సందేహాలు కూడా ఉన్నాయి. చూడాలి మరి ఏం జరుగుతుందో.






# అడ్మినిస్ట్రేటివ్ డిఎమ్ఇ డా. సత్యనారాయణ మూర్తి మెడికల్ కాలేజీ, హాస్పిటల్ సందర్శన.



కర్నూలు హాస్పిటల్ :-డైరెక్టర్ ఆఫ్ మెడికల్ఎడ్యుకేషన్ అకాడమిక్ డిఎన్ఇ డాక్టర్ సత్యనారాయణ మూర్తి గారు గురువారం కర్నూల్ మెడికల్ కాలేజీ హాస్పిటల్ సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా కాలేజీలోని ఎగ్జామినేషన్ సెక్షన్ ఆడిటోరియం పెండింగ్లో ఉన్న లెక్చరర్ గ్యాలరీ, స్కిల్ ల్యాబ్, నిర్మాణంలో ఉన్న ఐపి బ్లాక్ శానిటేషన్ సెక్యూరిటీ విభాగాలను పరిశీలించడం జరిగింది. అనంతరం కౌన్సిల్ హాల్ యందు వివిధ విభాగాధిపతులు ప్రొఫెసర్స్ సిబ్బందితో సమావేశం నిర్వహించి వారి సమస్యలను అత్యంత ముఖ్యమైనవి అత్యవసరంగా చేయవలసినవి పనుల గురించి చర్చించడం జరిగింది. ఈ సమావేశంలో లెక్చరర్ గ్యాలరీ త్వరగా అందుబాటులోకి రావాలని ఐపి బ్లాక్ కనీసం రెండు ఫ్లోర్ లు అయినా అందుబాటులోకి వస్తే అనేక విభాగాలకు మేలు చేసినట్లు అవుతుంది అని ప్రిన్సిపల్ కోరడం జరిగింది. అనంతరం స్కిల్ ల్యాబ్ వద్ద మొక్కలు నాటడం జరిగింది. పీజీలకు నిర్వహిస్తున్న జిఎల్పి, జిసిపి, ఎథిక్స్ సమావేశంలో పాల్గొని వారి నిర్దేశించి మాట్లాడడం జరిగింది. ఈ సందర్శన లో హాస్పిటల్ లో ముఖ్యమైన ఇవ్వగలన్నిటికీ హాస్పిటల్ సూపరింటెంట్ డా. కె . వెంకటేశ్వర్లు దగ్గరుండి చూపించడం సమస్యల వివరాలు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంఇ లు డాక్టర్ కే చిట్టి నరసమ్మ, డా. కే వెంకటేశ్వర్లు వివిధ విభాగాల అధిపతులు ప్రొఫెసర్ లు పాల్గొన్నారు.

# రైతులను నాసిరకం సీడ్స్, పెస్టిసైడ్ ఇచ్చి మోసం చేస్తున్న షాపులపై విజిలెన్స్ అధికారుల చేత విచారణ చేపట్టాలని ప్రజా పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కె బలరాం డిమాండ్.

కర్నూలు ఎ ప్రతినిధి :-కర్నూలు జిల్లాలో రైతులకు నాసిరకంవిత్తనాలు, పెస్టిసైడ్ అమ్ముతూ మోసం చేస్తున్నా వారిపై కేసులు నమోదుచేసి షాపు సీజ్ చేయాలని ప్రజా పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కెబలరాం డిమాండ్ చేశారు.ప్రభుత్వాలు వ్యవసాయరంగానికి రైతుల దిగుబడి కోసం కృషి చేస్తున్నారు. అయినపట్టకి రైతులకు నకిలీ విత్తనాలు ఇచ్చి, మోసం చేస్తున్న షాప్ పై విజిలెన్స్ అధికారుల చేత విచారణ చేయాలని, పోలీసులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ప్రజా పరిరక్షణ సమితి నేతలు డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని విజిలెన్స్ అధికారుల చేత



విచారణ చేపట్టి రైతులు నష్టపోకుండా చూడాలని ప్రజా పరిరక్షణ సమితి నేతలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజా పరిరక్షణ సమితి నేతలు శ్రీ పద్మా నందా యోగి గారు, డేవిడ్ రాజ్ పర్వతనేని హరి, కుమార్, చంద్ర, శ్రీరాములు, నాయుడు శివమణి,సూరి, చంద్రవంశీ, రవి కుమార్,మురళి, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శాస్త్రీయ పద్ధతుల్లోనే చెత్త నిర్వహణ చేపట్టాలి

## వర్మి కంపోస్టు తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

## జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

కర్నూలు ప్రతినిధి , జూన్ 11:- శాస్త్రీయ పద్ధతుల్లోనే చెత్తనిర్వహణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు.గురువారంగూడూరు మండలంలోని గుడిపాడు గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీకేంద్రంను కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ చెత్త నుంచిసంపద తయారీ కేంద్రం యూనిట్ ను పరిశీలిస్తూ, కేవలం పేడను తీసుకొచ్చివేయడం వర్మి కంపోస్టు తయారీ కాదని కలెక్టర్ పంచాయతీ కార్యదర్శిపని తీరు పై అసంతృప్తి వ్యక్తం చేశారు.. శాస్త్రీయ విధానాలను అనుసరించివర్మి కంపోస్టు తయారీ చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామాల్లోతడి, పొడి చెత్తను శాస్త్రీయ పద్ధతుల్లో వేరు చేసి, సక్రమంగా నిర్వహించడంద్వారా మాత్రమే మెరుగైనపారిశుధ్య ఫలితాలు సాధ్యమవుతాయని కలెక్టర్పేర్కొన్నారు. చెత్త నుంచి సేంద్రియ ఎరువులతయారీలో నిర్దేశితవిధానాలను తప్పనిసరిగా



పాటించాలని కలెక్టర్ సంబంధిత వారిని ఆదేశించారు. శాస్త్రీయ పద్ధతుల్లో వర్మి కంపోస్టు తయారీ పై అన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ డిపిఓ ను ఆదేశించారు. జూలై మొదటి నాటికి అన్ని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రలలో శాస్త్రీయ పద్ధతుల్లో వర్మి కంపోస్టు తయారీ కనపడకుంటే కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, డి పి ఓ భాస్కర్, గూడూరు తహసిల్దార్ వెంకటేశ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంతో భూమి సారవంతం

## - రైతుకు అధిక దిగుబడి సాధ్యం ప్రకృతి వ్యవసాయానికి పశుసంపదే పునాది

## జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి



కర్నూలు, ప్రతినిధి జూన్ 11:- ప్రకృతి వ్యవసాయంతోభూమి సారవంతమై రైతులకు అధిక దిగుబడి లభిస్తుందని, వ్యవసాయరంగంలో తక్కువ పెట్టుబడితో అధిక నాణ్యత కలిగిన దిగుబడులుసాధించడానికి సేంద్రియ వ్యవసాయం ఉత్తమ మార్గమని జిల్లా కలెక్టర్డా.ఏ.సిరి పేర్కొన్నారు.

గురువారం గూడూరు మండల కేంద్రానికి చెందిన రైతులు శేఖర్, రామకృష్ణ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న పొలాలను కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో మాట్లాడుతూ వ్యవసాయంలో అధికంగా రసాయన ఎరువులపై ఆధారపడటం వల్ల రైతుల ఖర్చులు పెరుగుతున్నాయని, దీనికి ప్రత్యామ్నాయంగా పశుసంపద ఆధారిత ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టాలన్నారు. ప్రకృతిలోని సమతుల్యతను కాపాడడంలో పశువుల పాత్ర అత్యంత కీలకమని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం రైతులు యూరియా వంటి రసాయన ఎరువుల కోసం ప్రతి సీజన్లో భారీగా ఖర్చు చేస్తున్నారన్నారు. ముఖ్యంగా కూరగాయల సాగులో అధిక మొత్తంలో యూరియాను వినియోగిస్తున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. రైతులు తమ వద్ద రెండు మేకలు, కొన్ని గొర్రెలు లేదా ఒక ఆవును పెంచుకున్నా, వాటి ద్వారా లభించే పేడ సహజ ఎరువుగా ఉపయోగపడుతుందని కలెక్టర్ రైతులకు అవగాహన కల్పించారు.. పశువుల పేడలో నైట్రోజన్, కార్బన్ వంటి పోషకాలు సమృద్ధిగా ఉండటంతో నేల సారవంతం అవుతుందని, పంటల పెరుగుదలకు ఇది దోహదపడుతుందన్నారు. ద్రవ జీవామృతం, ఘన జీవామృతం వంటి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించలేకపోయినా, కనీసం పశుసంపదను పెంచి వాటి పేడను వినియోగించాలని కలెక్టర్ రైతులకు సూచించారుప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతు శేఖర్ తన పొలాన్ని సందర్శించిన కలెక్టర్ గారికి ప్రకృతి వ్యవసాయం ద్వారా సాధిస్తున్న ఫలితాలను వివరించారు. ఒకే పంటపై ఆధారపడకుండా గోరుచిక్కుడు ప్రధాన పంటతో పాటు పుంటికూర (గోంగూర), మెంతికూర, కొత్తిమీర, బెండకాయ తదితర అంతర పంటలను సాగు చేస్తున్నట్లు తెలిపారు. కేవలం రూ.4 వేల పెట్టుబడితో సాగు ప్రారంభించగా, మెంతికూర మరియు కొత్తిమీర విక్రయాల ద్వారానే ఆ పెట్టుబడి తిరిగి వచ్చిందని, మిగతా పంటల ద్వారా అదనపు ఆదాయం లభిస్తోందని చెప్పారు. గోరుచిక్కుడు పంట 60 రోజుల్లోనే మొదటి కోతకు వచ్చి, వరుసగా ఏడు నుంచి ఎనిమిది కోతల ద్వారా ఖర్చులు మినహాయించి రూ.80 వేల నుంచి లక్ష రూపాయల వరకు ఆదాయం పొందవచ్చని కలెక్టర్ కు వివరించారు. అదే విధంగా ఘన జీవామృతం, సేంద్రియ ఎరువులు, ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన వివిధ జీవ పదార్థాలను స్వయంగా తయారు చేసుకుని వినియోగిస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ స్పందిస్తూ ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు తమ అనుభవాలను ఇతర రైతులతో పంచుకుని కనీసం మరో 20 మంది రైతులను ఈ విధానంలోకి తీసుకురావాలని కలెక్టర్ తెలిపారు. యూరియా, డీఏపీ వంటి రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, పశుసంపద ఆధారిత ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం ద్వారా భూసారాన్ని కాపాడటంతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని కూడా పరిరక్షించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం రైతు రామకృష్ణ సాగు చేస్తున్న పొలాన్ని పరిశీలిస్తూ, అక్కడ అమలు చేస్తున్న డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థను కలెక్టర్ పరిశీలించారు. డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటుకు చేసిన పెట్టుబడి, నీటి వినియోగ సామర్థ్యం, ప్రకృతి వ్యవసాయం ద్వారా లభిస్తున్న ప్రయోజనాలపై రైతును అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల అనుభవాలను సేకరించి వాటిని ఇతర రైతులకు చేరవేయాలని కలెక్టర్ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. రైతుల విజయగాథలను గ్రామ స్థాయిలో ప్రచారం చేసి ప్రకృతి వ్యవసాయంపై మరింత అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు..×రైతులకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా ఎరువులు సరఫరా చేయాలిగూడూరు మండల కేంద్రంలోని మన గ్రోమోర్ యూరియా షాపు ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా ఎరువులు సరఫరా చేయాలన్నారు. ఏ పి ఎం ఐ ఎస్ యాప్ ద్వారా రైతుల వివరాలను ఏ విధంగా నమోదు చేసి యూరియా సరఫరా చేస్తున్నారనే ప్రక్రియను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. నిన్న, మొన్న ఎన్ని బ్యాగ్ ల యూరియా సరఫరా చేశారని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. యాప్ లో ఈరోజు టెక్నికల్ సమస్య ఉన్నందున రైతుల వివరాలు నమోదు అవ్వడం లేదని డీలర్లు కలెక్టర్ దృష్టికి తీసుకొని రాగా, యాప్ టెక్నికల్ ఇష్యూ గురించి ఉన్నతాధికారులతో మాట్లాడడం జరిగిందని సమస్యను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారన్నారు.కార్యక్రమంలో కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, గూడూరు తహశీల్దార్ వెంకటేశ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలి

## స్వర్ణ వార్డు కార్యాలయాల ఆకస్మిక తనిఖీ

## రికార్డుల నిర్వహణ, ప్రజా సేవలపై సమీక్ష

## జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి



కర్నూలు, ప్రతినిధి జూన్ 11:×ప్రజలకు అందుబాటులోఉండి మెరుగైన సేవలు అందించాలని స్వర్ణ వార్డు కార్యాల సిబ్బందికిజిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. గురువారం గూడూరు మండల కేంద్రంలోని 4వ మరియు 6వ స్వర్ణ వార్డు కార్యాలయాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడ అందిస్తున్న సేవలు, నిర్వహణ విధానాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యాలయ పరిసరాల పరిశుభ్రత, ప్రజలకు అందిస్తున్న సేవలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలు తీరుపై సిబ్బందిని ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్... నవచేతన యాప్ ద్వారా నిర్వహిస్తున్న ఏ ఐ -ఆధారిత ఇ సి డి స్క్రీనింగ్ కార్యక్రమం అమలు 0?6 సంవత్సరాల వయస్సు గల చిన్నారులలో ఆరోగ్య మరియు అభివృద్ధి లోపాల గుర్తింపు, అండర్ వెయిట్ పిల్లల వివరాలు, గర్భిణీల నమోదు, రక్తపోటు మరియు మధుమేహ పరీక్షలు, యోగాంధ్ర నమోదు ప్రక్రియ, గృహ నిర్మాణాల పురోగతి, ఈ-కేవైసీ నిర్వహణ తదితర అంశాలపై సిబ్బందిని ప్రశ్నించి సమగ్ర సమాచారం సేకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలకు అత్యంత చేరువలో ఉండే స్వర్ణ వార్డు కార్యాలయాలు ప్రభుత్వ సేవల అందజేతలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ప్రజలు కార్యాలయాలకు వచ్చినప్పుడు ఎటువంటి ఇబ్బందులు ఎదురుకాకుండా వెంటనే స్పందించి సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. అలాగే కార్యాలయ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచడంతో పాటు రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. తనిఖీలో భాగంగా మహిళా పోలీసు నిర్వహిస్తున్న కార్యక్రమాలపై కూడా కలెక్టర్ ఆరా తీశారు. "గుడ్ టచ్ ? బ్యాడ్ టచ్" అవగాహన కార్యక్రమాల ద్వారా ఎంతమందికి అవగాహన కల్పించారో, వార్డు పరిధిలో ఉన్న టీనేజ్ బాలికల సంఖ్య ఎంత, వారికి సంబంధించిన రికార్డులు ఎందుకు నిర్వహించలేదని ప్రశ్నిస్తూ అసంతృప్తి వ్యక్తం చేశారు. టీనేజ్ బాలికలకు సంబంధించిన సమగ్ర రికార్డులను తప్పనిసరిగా నిర్వహించి, వారి విద్య, ఆరోగ్యం, భద్రత అంశాలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.బాల్య వివాహాల నివారణలో ఈ రికార్డులు కీలకంగా ఉపయోగపడతాయని పేర్కొన్న కలెక్టర్, గ్రామ మరియు వార్డు స్థాయిలో ఉన్న సిబ్బంది ఈ అంశంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. బాలికల సంక్షేమం, భద్రత మరియు వారి భవిష్యత్తు అభివృద్ధి కోసం ముందస్తు చర్యలు తీసుకోవడం అత్యంత అవసరమని తెలిపారు.అదేవిధంగా జిల్లాలో విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీసులకు ఏ ఐ -ఆధారిత ఇ సి డి స్క్రీనింగ్, చిన్నారుల ఆరోగ్య మరియు అభివృద్ధి లోపాల గుర్తింపు, బాల్య వివాహాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని స్వర్ణ గ్రామ/స్వర్ణ వార్డు అధికారి భాస్కర్ నాయుడును జిల్లా కలెక్టర్ ఆదేశించారు. గ్రామ, వార్డు స్థాయిలో పనిచేసే సిబ్బంది సమన్వయంతో పనిచేస్తే చిన్నారులు, బాలికల సంక్షేమ కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా అమలవుతాయని తెలిపారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించాల్సిన బాధ్యత ప్రతి ఉద్యోగిపై ఉందని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు ప్రత్యేక అధికారి భాస్కర్ నాయుడు, తహశీల్దార్ వెంకటేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# పి సి డపి ఎన్ డి టి చట్టం పటిష్టంగా అమలు

## గర్భస్థ శిశువుల లింగ నిర్ధారణ పై సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 1800 233 2447 కు ఫిర్యాదు చేయాలి

## జిల్లా కలెక్టర్ డా. ఎ. సిరి

కర్నూలు, జూన్ 11: పి సి డపి ఎన్ డి టి చట్టం పటిష్టంగా అమలు చేయడం లో భాగంగా గర్భస్థ శిశువుల లింగ నిర్ధారణ పై సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 1800 233 2447 కు ఫిర్యాదు చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎ. సిరి ఒక ప్రకటనలో తెలిపారు. పి సి డ పి ఎన్ డి టి చట్టం సమర్థవంతమైన అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్-ఫ్రీ హెల్ప్లైన్ నంబర్ 1800 233 2447 ను ప్రజలు విస్తృతంగా వినియోగించాలని కలెక్టర్ సూచించారు. అక్రమ లింగ నిర్ధారణ, లింగ ఎంపిక, చట్ట ఉల్లంఘనలకు సంబంధించిన సమాచారం, ఫిర్యాదులు, అభ్యంతరాలను ఈ టోల్-ఫ్రీ హెల్ప్లైన్ నంబర్ కు




తెలియచేయవచ్చని తెలిపారు.గర్భస్థ శిశువుల లింగ నిర్ధారణ, లింగ ఎంపిక వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను పూర్తిగా అరికట్టేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని, బాలికల రక్షణ, లింగ సమానత్వ పరిరక్షణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డా. ఎ. సిరి పిలుపునిచ్చారు గర్భస్థ శిశువు లింగాన్ని తెలుసుకోవడం లేదా వెల్లడించడం చట్టరీత్యా నేరమని, అలాంటి చర్యలకు పాల్పడే వ్యక్తులు, ఆసుపత్రులు, అల్ట్రాసౌండ్ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య సంస్థలు, జిల్లా ఆసుపత్రులు, ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు ,( సి హెచ్ సి ఎస్ )ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (,పి హెచ్ సి ఎస్) అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు , (యు పి హెచ్ సి ఎస్ )మెడికల్ కళాశాలలు, ప్రైవేట్ ఆసుపత్రులు, అల్ట్రాసౌండ్ స్కానింగ్ కేంద్రాలు, డయాగ్నస్టిక్ సెంటర్లు, జన్యు సలహా కేంద్రాలు, జన్యు క్లినిక్లు మరియు జన్యు ప్రయోగశాలలలో 1800 233 2447 హెల్ప్లైన్ నంబర్ను స్పష్టంగా ప్రదర్శించాలని అధికారులను ఆదేశించారు. అలాగే గ్రామ స్థాయిలో గ్రామ ఆరోగ్య, పారిశుధ్య మరియు పోషకాహార కమిటీలు (, వి హెచ్ ఎస్ ఎన్ సి ఎస్) ఆశా కార్యకర్తలు, , ఏ ఎన్ ఎం ఎస్ కమ్యూనిటీ హెల్త్ అధికారులు, అంగన్వాడీ సిబ్బంది తదితరుల ద్వారా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గర్భిణీ స్త్రీలు మరియు వారి కుటుంబ సభ్యులకు ఏ ఎన్ సి క్లినిక్లు, పి ఎం ఎస్ ఎం ఏ కార్యక్రమాలు, గ్రామ ఆరోగ్య మరియు పోషకాహార దినోత్సవాల సందర్భంగా చట్టంపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. సోషల్ మీడియా వేదికలు, జిల్లా అధికారిక వెబ్సైట్లు, వాట్సాప్ గ్రూపులు, ప్రచార వాహనాలు, కరపత్రాలు, పోస్టర్లు, ఫ్లెక్సీలు మరియు ఇతర సమాచార, విద్యా, కమ్యూనికేషన్ (ఐ ఇ సి) మెటీరియల్ ద్వారా హెల్ప్లైన్ నంబర్ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కలెక్టర్ తెలిపారు. స ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా సహకారంతో ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

# అంతర్జాతీయ యోగ కార్యక్రమానికి రిజిస్ట్రేషన్స్ త్వరగా పూర్తి చేయాలి

## ఆర్టీసీ బస్ స్టాండ్ మరియు బస్సుల ద్వారా యోగా పై విస్తృతంగా ప్రచారం , రిజిస్ట్రేషన్ జరగాలి

## జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్

కర్నూలు ప్రతినిధి , జూన్ 11:- అంతర్జాతీయ యోగా దినోత్సవంరోజున యోగా చేసే సభ్యుల రిజిస్ట్రేషన్ త్వరగా పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ యోగ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ... కర్నూలు జిల్లా కలెక్టర్ నిర్దేశించిన ప్రకారం 4 లక్షల 62 వేల మంది యోగా చేసేవారు లక్ష్యంగా ఉన్నారని , ఆ సంఖ్యకు అధికంగా రిజిస్ట్రేషన్స్ జరగాలని వారందరూ జూన్ 21 న అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజున యోగా కార్యక్రమంలో పాల్గొనే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యోగ కార్యక్రమం పై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహిస్తున్నందున అధికారులు వెంటనే చర్యలు తీసుకొని యోగాలో పాల్గొనే వారి సంఖ్యను పెంచే దిశగా కృషి చేయాలని ఆదేశించారు. జిల్లాలో జూన్ 12న పాఠశాలలు మొదలవుతాయని కావున పాఠశాలల విద్యార్థులు కాలేజీ విద్యార్థులను అధిక సంఖ్యలో క్యూఆర్ కోడ్ ద్వారా నమోదు చేయించి వారందరూ యోగా కార్యక్రమంలో పాల్గొనే చర్యలు తీసుకోవాలని డీఈవో , ఆర్ఐఓ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సమావేశమునకు హాజరైన సంబంధిత అధికారులందరిని వారికి ఇచ్చిన లక్ష్యం ప్రకారం రిజిస్ట్రేషన్లు ఎంతవరకు చేశారు అన్న వివరాలు రాబట్టి వెంటనే రిజిస్ట్రేషన్లు త్వరగా పూర్తి చేసి లక్ష్యం చేరుకోవాలని ఆదేశించారు. జిల్లాలో యోగ కార్యక్రమం పై ఆర్టీసీ ద్వారా విస్తృతంగా ప్రచారం , క్యూఆర్ కోడ్ అవగాహన ద్వారా విస్తృతంగా రిజిస్ట్రేషన్లు జరగాలని ఆదేశించారు.ప్రజలు యోగాలో పాల్గొనే దానికి గాను అన్ని ఆర్ టి సి బస్టాండ్లలో క్యూఆర్ కోడ్ తో ఉన్న ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని , ఆర్టీసీ బస్సు లోపల బయట క్యూఆర్ కోడ్ అగుపడే విధంగా పోస్టర్లు అంటించే ఏర్పాట్లు చేయాలని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ శ్రీనివాసులను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు.

# రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు

● రైతుల ఖాతాల్లో రూ.1,018 కోట్లు జమ ● ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా ఈ రబీ సీజన్ లో కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా రికార్డు స్థాయిలో ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లను పూర్తి చేసిందని ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు వెల్లడించారు. గురువారం జిల్లా కేంద్రంలోని నందన గార్డెన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందనడానికి ఈ కొనుగోళ్లే నిదర్శనమన్నారు. ఈ రబీ సీజన్ లో జిల్లా వ్యాప్తంగా మొత్తం 334 కొనుగోలు కేంద్రాల ద్వారా రికార్డు స్థాయిలో 429921. మెట్రిక్ టన్ల వరి ధాన్యాన్ని విజయవంతంగా సేకరించామని ,ఇందుకు గాను రైతులకు దాదాపు 1,018 కోట్ల 62 లక్షల రూపాయలను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకి ఎలాంటి ఆలస్యం లేకుండా చెల్లించామని స్పష్టం చేశారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి పెద్దపల్లి జిల్లాలో సుమారు 29వేల మెట్రిక్ టన్ల ధాన్యం అదనంగా సేకరించినట్లు వివరించిన ఆయన,పెద్దపల్లి నియోజకవర్గం లో మొక్కజొన్నలు 5800 రైతుల దగ్గర నుండి 26443 మెట్రిక్ టన్నుల మొక్క జొన్నను మార్కెట్ యార్డుల ద్వారా ప్రజలను కొనుగోలు చేశామని తెలిపారు. అకాల వర్షాల వల్ల ధాన్యం తడిసినా, రంగు మారినా ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకుని, రైతుల వద్ద చివరి గింజ వరకు కొనుగోలు చేసిందని స్పష్టం చేశారు. భవిష్యత్తులో రైతులు పండించిన ధాన్యాన్ని సురక్షితంగా నిల్వ ఉంచేందుకు పెద్దపల్లి నియోజకవర్గంలో 1.70 లక్షల మెట్రిక్ టన్ల సామర్థ్యం గల గోదాముల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశామని ఎమ్మెల్యే విజయ రమణారావు తెలిపారు. ఇందులో భాగంగా ఎలిగేడు మండలం లాలపల్లి గ్రామంలో గిడ్డంగుల సంస్థ ద్వారా 20వేల మెట్రిక్ టన్ల సామర్థ్యంతో గోదాము పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని, సింగిల్ విండో ఆధ్వర్యంలో మరో 14వేల మెట్రిక్ టన్ల గోదాముకు భూమి కేటాయించామని చెప్పారు. రాబోయే రోజుల్లో ఓదెల మండలంలో 20వేల మెట్రిక్ టన్నుల, శ్రీరాంపూర్‌లో 2వేల మెట్రిక్ టన్నుల,పెద్దపల్లి మండలంలో 2వేల మెట్రిక్ టన్ల సామర్థ్యం గల గోదాముల నిర్మాణానికి టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.ఎటువంటి ప్రకృతి విపత్తులు వచ్చినా రైతులు ఇబ్బంది పడకుండా ధాన్యాన్ని భద్రపరుచుకోవడానికి ఈ గోదాములు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదే సమయంలో విపక్షాల తీరుపై ప్రభుత్వ విప్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బీఆర్ఎస్, బీజేపీలు ప్రభుత్వంపై అనవసర విమర్శలు చేస్తూ రైతులను రెచ్చగొడుతున్నాయని మండిపడ్డారు. పెద్దపల్లి నియోజకవర్గానికి కాళేశ్వరం ప్రాజెక్టు నీటి వల్ల పంటలు పండలేదని, గతంలో జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ ల కాలంలో ప్రారంభమైన ఎస్ఆర్ఎస్పీ కెనాల్ నీటి ద్వారానే ఇక్కడి రైతులకు సాగునీరు అందిందని స్పష్టం చేస్తూ, కాళేశ్వరం ద్వారా ఏ ఊరికి నీళ్లొచ్చాయో సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల నిర్మాణంలో తీవ్ర లోపాలు చేసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని, అందుకే బ్యారేజీలు కుంగిపోయాయని ఆరోపించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం సెంట్రల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదికల ఆధారంగా శాస్త్రీయంగా మేడిగడ్డ బ్యారేజ్ రిపేర్ పనులను చేపడుతోందని వివరించారు. ప్రాజెక్టులపై అవగాహనతో మాట్లాడాలని, సలహాలు ఇచ్చేందుకు మాజీ సీఎం కేసీఆర్ ని అసెంబ్లీకి రావాల్సిందిగా సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ఆహ్వానించినా ప్రతిపక్షాలు ముందుకు రావడం లేదని విమర్శించారు. జిల్లాలో ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్ల ప్రక్రియను ఇంత పకడ్బందీగా విజయవంతం చేసినందుకు జిల్లా కలెక్టర్ కు, ఐకేపీ మహిళా సంఘాల ప్రతినిధులకు మరియు వివిధ శాఖల అధికారులకు ప్రభుత్వ విప్ విజయ రమణారావు ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య, పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూర మల్లారెడ్డి, మాజీ జెడ్పిటిసి సారయ్య గౌడ్, సమా రాజేశ్వర్ రెడ్డి, రాండి తిరుపతి రెడ్డి, కొమ్మ పోచాలు, శ్రీగిరి శ్రీనివాస్, అరె సంతోష్, మూల ప్రేమ్ సాగర్ రెడ్డి, నియోజకవర్గంలోని వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పెంచిన పెట్రోల్ - డీజిల్, వాణిజ్య గ్యాస్ ధరలను తక్షణమే తగ్గించాలి

● సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎరవెల్లి ముత్యంరావు




**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కేంద్ర బిజెపి ప్రభుత్వం పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు తగ్గించాలని ప్లకార్డులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సామాన్య, మధ్యతరగతి ప్రజల నడ్డి విరుస్తూ అడ్డూ అదుపూ లేకుండా పెంచుతున్న పెట్రోల్, డీజిల్ మరియు వాణిజ్య (కమర్షియల్) గ్యాస్ సిలిండర్ ధరలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు అనుకూలంగా ఉన్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం అదనపు పన్నులు, సెస్సుల రూపంలో ప్రజలపై మోయలేని భారాన్ని మోపుతోందని తీవ్రంగా మండిపడ్డారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా, ధరల మంటపై ప్రజల ఆవేదనను ప్రతిబింబించే వివిధ నినాదాలతో కూడిన ప్లకార్డులను నిరసనకారులు ప్రదర్శించారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం వల్ల రవాణా ఖర్చులు విపరీతంగా పెరిగి, మార్కెట్‌లో కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరల పెంపు వల్ల హోటల్ రంగ నిర్వాహకులు, క్యాటరింగ్ వ్యాపారులు, చిన్న తరహా వీధి వ్యాపారులు తీవ్ర నష్టాల్లో కూరుకుపోయి ఉపాధి కోల్పోయే పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలపై కేంద్ర ప్రభుత్వం విధిస్తున్న ఎక్సైజ్ సుంకం, అదనపు సెస్సులను వెంటనే రద్దు చేయాలి.వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలను భారీగా తగ్గించి, చిన్న వ్యాపారాలను, హోటల్ కార్మికులను ఆదుకోవాలి.ఇంధన ధరలను జీఎస్టీ పరిధిలోకి తీసుకువచ్చి ప్రజలకు శాశ్వత ఉపశమనం కలిగించాలి.కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా తన మొండివైఖరిని వీడి, పెంచిన ధరలను తగ్గించకపోతే ప్రజా సంక్షేమం కోసం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ప్రజలను, కార్మిక వర్గాలను సమీకరించి పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళనల కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కల్లేపల్లి అశోక్,సీపెల్లి రవీందర్, జి జ్యోతి, మండల కమిటీ సభ్యులు మోదం పల్లి శ్రావణ్, ఆది కృష్ణ, కుమ్మరి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ విద్యార్థి పర్యావరణ పోటీల పోస్టర్ ఆవిష్కరణ...



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన, బాధ్యతా భావాన్ని పెంపొందించడమే లక్ష్యంగా తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ విద్యార్థి పర్యావరణ పోటీ-విత్తనం నుండి వృద్ధి వరకు 2026 వాల్ పోస్టర్‌ను గురువారం పెద్దపల్లి బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆవిష్కరించారు. స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల ప్రత్యేక సమావేశంలో జిల్లా పరీక్షల, సైన్స్ అధికారి వి.హనుమంతు ఈ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ప్రకృతిపై ప్రేమను, పర్యావరణ చైతన్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.ఏక్ పెడ్ మా కే నామ్ అనే అద్భుతమైన సందేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆశయాలకు అనుగుణంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి కేవలం మొక్కలు నాటడమే కాకుండా, వాటిని వృక్షాలుగా మార్చే వరకు సంరక్షణ బాధ్యతను ఒక కర్తవ్యంగా స్వీకరించాలని పిలుపునిచ్చారు. అనంతరం నేషనల్ గ్రీన్ కార్ప్స్ జిల్లా కోఆర్డినేటర్ గూళ్ళ అంజన్ కుమార్ మాట్లాడుతూ నేడు నాటే చిన్న మొక్కే రేపటి భవిష్యత్తుకు భరోసా ఇస్తుందని, ప్రతి పాఠశాల ఒక పచ్చని ఉద్యానవనంగా మారాలన్నదే ఈ పోటీల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మండల విద్యాధికారి టి.సురేంద్ర కుమార్, మండల విద్యాశాఖ అధికారులు డి.లక్ష్మణ్, ఐ.విజయ్ కుమార్, వివిధ స్కూల్ కాంప్లెక్స్‌ల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పదవీ బాధ్యతలు స్వీకరించిన నాణ్యత విభాగాధిపతి



**రామగిరి, జూన్11 (ది క్రైమ్ న్యూస్):-** రామగుండం-త్రీ ఏరియా నాణ్యత విభాగాధిపతి గా నియమితులైన యం.డి.ఆసిఫ్ యాసిన్ గురువారం రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ కు రిపోర్ట్ చేసి బాధ్యతలను స్వీకరించారు. వారు ఆర్.జి.ఓసిపి-టు ఉపరితల గనిలో సేఫ్టీ ఆఫీసర్ గా విధులను నిర్వహిస్తు ఇటీవల జరిగిన బదిలీలలో ఆర్జీత్రీ ఏరియా నాణ్యత విభాగాధిపతి గా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

## గోపా ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

జూన్ 13వరకు గౌడ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి




**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన గౌడ విద్యార్థులను ప్రోత్సహించేందుకు గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) ముందుకొచ్చింది. పెద్దపల్లి జిల్లాకు చెందిన పదో తరగతి విద్యార్థుల్లో 500కు పైగా మార్కులు సాధించిన వారికి ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు అసోసియేషన్ ప్రతినిధులు వెల్లడించారు. పురస్కారాలకు అర్హులైన విద్యార్థులు తమ మార్కుల మెమోలు మరియు అవసరమైన వివరాలను జూన్ 13 మధ్యాహ్నం 12 గంటలలోపు మంద రమేష్‌గౌడ్ (9849309888), కొక్కిస దేవేందర్‌గౌడ్ (998919842)లకు పంపించాలని సూచించారు. గడువులోగా అందిన దరఖాస్తులను మాత్రమే పరిశీలించి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు జూన్ 14న ఉదయం 10 గంటలకు గోదావరిఖనిలోని సాయిలీలా రెసిడెన్సీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో పురస్కారాలు, షీల్డ్స్ ప్రదానం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, గౌడ సంఘ నాయకులు, రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విద్యార్థుల్లో విద్యాపట్ల ఆసక్తి పెంపొందించడం, ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ పేర్కొంది. ఈ సమావేశంలో గోపా జిల్లాఅధ్యక్షులు మంద రమేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి బందారపు యాదగిరిగౌడ్, కోశాధికారి కొక్కిస దేవేందర్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు అడ్డగుంట రాజేందర్ గౌడ్, కార్యనిర్వాహక కార్యదర్శి బుర్ర తిరుపతి గౌడ్, సంయుక్త కార్యదర్శి అంతటి చిరంజీవి గౌడ్, తిరుమల సురేందర్ గౌడ్, కార్యవర్గ సభ్యులు బైరగోని రవీందర్ గౌడ్, మంద శ్రీనివాస్ గౌడ్ తదితరలు పాల్గొన్నారు.

## వెంకటాపురంలో బడిబాట కార్యక్రమం



**మధిర ప్రతినిధి, జూన్ 11 (ది క్రైమ్ న్యూస్):** నియోజకవర్గ ఎర్రుపాలెం మండలం మండలం వెంకటాపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెల్లంకి నాగరాజు ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఆటో మైక్ ప్రచారం, కరపత్రాల పంపిణీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న ఉచిత సౌకర్యాలు, పాఠశాల విజయాలు, విద్యార్థుల ప్రతిభతో పాటు 2026-27 విద్యా సంవత్సరంలో ప్రారంభం కానున్న ఫ్రీ ప్రీ-ప్రైమరీ విద్యపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామ సర్పంచ్ బొగ్గుల గోవర్ధన్ రెడ్డి సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు, నూతన విద్యార్థులు విశేషంగా స్పందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్. రామారావు, గ్రామ ప్రజలు, తల్లి విద్యార్థులు పాల్గొన్నారు.

## జర్నలిస్టు అక్రిడేషన్ కార్డుల పంపిణీ వేగవంతం చేయండి

- టిడబ్ల్యూజేఎఫ్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటి - హెల్త్ కార్డులు, ఇండ్ల స్థలాలు ప్రైవేట్ స్కూళ్లలో ఫీజు రాయతీ నిర్దిష్ట అమలుకు డిమాండ్



**కుత్బుల్లాపూర్, జూన్ 11 (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ( టిడబ్ల్యూజేఎఫ్) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటి సమావేశం శుక్రవారం కాప్రా సర్కిల్ కమలానగర్ కమ్యూనిటీ భవనంలో జరిగింది. జిల్లా అధ్యక్షుడు మల్లేష్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి రాష్ట్ర నాయకులు ఎస్ కె సలీమా, గుమ్మడి హరి ప్రసాద్ హాజయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. అక్రిడేషన్ల పంపిణి కార్యక్రమం వేగవంతం చేయాలని హెల్త్ కార్డులు, జర్నలిస్టు పిల్లలకు ప్రైవేట్ స్కూళ్లలో ఫీజు రాయతీలకు సంబంధించి ప్రభుత్వ ఉతర్వులు అమలు చేయాలని కోరారు. దీర్ఘకాల ఆకాంక్షగా ఉన్న జర్నలిస్టుల ఇంటి స్థలాలపై ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని ఈ సమావేశంలో ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లాలో వందలాది సంఖ్యలో ఉన్న జర్నలిస్టులు కుటుంబాలకు ఫెడరేషన్ అన్ని విధాల అండగా ఉంటదని జిల్లా కార్యదర్శి బానోత్ రవి నాయక్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్ష్యులు గుమ్మడి రోజారాణి, సింగం రాజు, విష్ణు, సత్యనారయణ, ఉస్సేన్, సహదేవ్, దుర్గాప్రసాద్ మోహన్ రెడ్డి, రజనికాంత్, అరుణ్ కుమార్, నరసింహ, తదితరులు ఉన్నారు.

## చెర్రీ కిడ్స్ రెండో బ్రాంచ్ ప్రారంభం

ప్రారంభోత్సవంలో ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొన్నారు





**కుత్బుల్లాపూర్ జూన్ 11 (ది క్రైమ్ న్యూస్):** కొంపల్లి సమీపంలోని గజానన హోమ్స్ వద్ద ఏర్పాటు చేసిన చెర్రీ కిడ్స్ ప్లే స్కూల్ రెండో బ్రాంచ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఈటెల రాజేందర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన విద్యాసంస్థను ప్రారంభించి, నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. చిన్నారులకు నాణ్యమైన విద్య అందించే దిశగా ఈ సంస్థ కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి అధ్యక్షుడు సతీష్ సాగర్, మాజీ కౌన్సిలర్లు రాజిరెడ్డి, మల్లికార్జున్, సీనియర్ నాయకులు శివాజీ, సరిత, జోరక జగన్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అమ్మ పేరుతో మొక్క నాటి పర్యావరణ పరిరక్షణకు సంకల్పం...

'ఏక్ పెడ్ మా కే నామ్ పే' కార్యక్రమంలో కొంపల్లి బీజేపీ నాయకుల భాగస్వామ్యం...





**కొంపల్లి, జూన్ 5: (ది క్రైమ్ న్యూస్):** అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు కొంపల్లి బీజేపీ ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని అవని గార్డెన్ పార్కులో 'ఏక్ పెడ్ మా కే నామ్ పే' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటుకున్నారు. స్థానిక బీజేపీ అధ్యక్షుడు పెద్దబుద్ధుల సతీష్ సాగర్ మాట్లాడుతూ, పర్యావరణ సంరక్షణ లక్ష్యంగా ప్రధాని ఇచ్చిన పిలుపును ప్రజలు స్వాగతించి తమ తల్లి పేరుతో మొక్కలు నాటడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు ఆదిరెడ్డి రాజిరెడ్డి, కౌన్సిల్ సభ్యుడు జనార్ధన్ రెడ్డి, స్థానిక నాయకులు శివాజీ రాజు, నరసింహ, శంకర్ నాయక్, మధు, సూర్యప్రకాష్, మహేందర్, అశ్విన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణకు సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించాలి

● సి సి టి ఎన్ ఎస్ ద్వారా ప్రతి పిటిషన్, కేసు వివరాలు తప్పనిసరిగా ఆన్‌లైన్ నమోదు చేయాలి ● గంజాయి నేరస్థులు, విక్రేతలు, రవాణాదారులపై నిరంతర నిఘా కొనసాగించాలి ● జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్



**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 11(ది క్రైమ్ న్యూస్):-** మహబూబాబాద్ జిల్లా పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు, సీఐలు, డీఎస్పీలతో మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ మాసిక నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో పారదర్శకత, జవాబుదారీతనం మరియు సేవల సామర్థ్యాన్ని పెంపొందించేందుకు క్రైమ్ మరియు క్రిమినల్ ట్రాకింగ్ నెట్వర్క్ద సిస్టమ్ ను వంద శాతం సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదు కంప్లైంట్/ పిటిషన్ ప్రతి కేసుకు సంబంధించిన వివరాలను ఎఫ్ఐఆర్ నమోదు దశ నుంచి చార్జ్‌షీట్ దాఖలు వరకు తప్పనిసరిగా సి సి టి ఎన్ ఎస్ లో నమోదు చేసి, ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు. ఫిర్యాదు అందిన వెంటనే ఆలస్యం చేయకుండా ఆన్‌లైన్ ఎంట్రీ చేయాలని, దర్యాప్తు పురోగతి, నిందితుల వివరాలు, కేసు స్థితిగతులను సకాలంలో అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. సి సి టి ఎన్ ఎస్ ద్వారా పాస్‌పోర్ట్ వెరిఫికేషన్, క్యారెక్టర్ సర్టిఫికెట్లు, దొంగిలించబడిన వాహనాల ట్రాకింగ్ వంటి ప్రజా సేవలను వేగవంతంగా అందించవచ్చని పేర్కొన్నారు. ఈ వ్యవస్థ అమలులో నిర్లక్ష్యం లేదా అలసత్వం సహించబోమని హెచ్చరించారు. మహబూబాబాద్ జిల్లాను మత్తు పదార్థాల రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేయాలని ఎస్పీ సూచించారు. గంజాయి విక్రేతలు, రవాణాదారులు, పాత గంజాయి కేసుల నిందితులు మరియు మాదకద్రవ్యాలకు సంబంధించిన నేరస్థులపై నిరంతర నిఘా కొనసాగించాలని ఆదేశించారు. వారి కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట కౌన్సిలింగ్ నిర్వహించాలని, మళ్లీ నేరాలకు పాల్పడకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఆకస్మిక తనిఖీలు, వాహనాల తనిఖీలు మరియు విస్తృత నిఘా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించి, కార్డన్ అండ్ సెర్చ్,కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలు నిర్వహించి ప్రజలలో భద్రత భావం తీసుకురావాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా క్షేత్రస్థాయిలో కఠిన అమలు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డిజిటల్ సాక్ష్యాధారాలు, సీసీటీవీ ఫుటేజ్ మరియుసి సి టి ఎన్ ఎస్ లో అందుబాటులో ఉన్న నేర చరిత్ర సమాచారాన్ని సమర్థవంతంగా వినియోగించి కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని సూచించారు. కోర్టుల్లో బలమైన సాక్ష్యాధారాలను సమర్పించడం ద్వారా నిందితులకు శిక్షలు పడేలా చేసి, జిల్లా కన్విక్షన్ రేటును పెంచేందుకు ఇన్వెస్టిగేషన్ అధికారులంతా ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. "మన ఊరు -- మన బాధ్యత" కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన గ్రామసభల్లో కేవలం నిన్న ఒక్కరోజే 119 గ్రామపంచాయతీలు, 09 వార్డులలో సర్పంచులు, వార్డు కౌన్సిలర్లు, పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు మరియు గ్రామస్తులు కలిసి రోడ్డు భద్రత, మత్తు పదార్థాల నిర్మూలన, సీసీ కెమెరాల ఏర్పాటు, గంజాయి రహిత గ్రామాల నిర్మాణం తదితర అంశాలపై ప్రత్యేక తీర్మానాలను ఆమోదించడం పట్ల జిల్లా ఎస్పీ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో తమ వంతు కృషి చేసిన ప్రతి పోలీస్ అధికారి, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ప్రజల భాగస్వామ్యంతోనే సురక్షిత, మత్తు రహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అనంతరం జిల్లాలో పలు కేసుల్లో నిందితులకు శిక్షలు పడేందుకు సమర్థవంతంగా పనిచేసిన కోర్టు డ్యూటీ అధికారులను జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ అభినందించి ప్రోత్సాహకాలను అందజేశారు.

## అమరవీరుల స్ఫూర్తితో ప్రజా పోరాటాలు నిర్వహించాలి: సిపిఐ ఎంఎల్ మాస్ లైన్




**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్ ):** దేశంలో పాలకులు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల పైన ప్రజలు సంఘటితమై అమరవీరుల స్ఫూర్తితో పోరాటాల నిర్వహించినప్పుడు మాత్రమే వారికి నిజమైన నివాళులర్పించినట్లు అవుతుందని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఖమ్మం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి రామయ్య, ఆవుల అశోకు అన్నారు. గురువారం ఖమ్మం నగరంలోని ఒకటవ డివిజన్ కైకొండయిగూడెం గ్రామంలో పార్టీ శాఖ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించుకున్న సిపిఐ( ఎంఎల్ )మాస్ లైన్ జెండా గద్దెను పార్టీ సీనియర్ నాయకులు యాకూబ్ జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది. అనంతరం రామయ్య, అశోక్ మాట్లాడుతూ ఖమ్మం నగరంలోని కైకొండయ్యగూడెం గ్రామంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఆధ్వర్యంలో అనేక ప్రజా పోరాటాలు నిర్వహించి కూలిపోరాటాలు జీతగాళ్ల సమస్యల పైన అనేక పోరాటాలను కొనసాగిస్తూనే ఇక్కడున్న పేదలకు భూమి పంచిన చరిత్ర సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ది అన్నారు. పార్టీకి జాలాది జోగయ్య, కొండ సత్యం, కొండ నారాయణ,చింరల నాగయ్య, లింగన్న, జాలాది నరసయ్య అనేకమంది పార్టీకి నాయకత్వం వహించి ప్రజా సమస్యల పైన ఉద్యమాలు నిర్వహించిన చరిత్ర ఈ గ్రామానికి ఉంది. వారు చనిపోయేనాటికి ఎర్రజెండా నీడలో ఉంటూ అమరత్వం పొందడం జరిగింది. వారి ఆశయాల లక్ష్యాల కోసం నేటి యువత ఈ గ్రామంలో నెలకొన్న సమస్యల పైన పోరాట నిర్వహించాలని అదేవిధంగా కేంద్రంలో రాష్ట్రంలో అధికారులు ఉన్నటువంటి పాలకవర్గాలు తమ ప్రయోజనాల కోసం పెట్టుబడి దారి వర్గానికి అనుకూలంగా తమ విధానాలని కొనసాగిస్తున్నారు. తప్ప పేద ప్రజలకు కార్మిక వర్గానికి ఉపయోగపడే విధంగా వారి పరిపాలన లేదని గురువారం దేశంలో నిత్యవసర వస్తువు ధరలు విపరీతంగా పెరిగినవి మరియు ముఖ్యంగా గ్యాస్, పెట్రోల్, డీజిల్ రేట్లు రోజురోజుకు ఆకాశాన్ని అంటుతున్నటువంటి స్థితి ఉన్నది. యువతకు ఉపాధి అవకాశాలు లేక మద్యానికి బానిసై రోడ్లో పక్కన తిరుగుతున్నటువంటి పరిస్థితి ఉన్నప్పటికీ మనం ఎన్నుకున్నటువంటి ప్రభుత్వాలు వారి గురించి ఆలోచించే పరిస్థితులు లేదు కాబట్టి ప్రజలు ప్రజాస్వామ్యవాదులు కార్మికులు కర్షకులు విద్యార్థి యువకులు అందరు ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపైన పోరాటాల నిర్వహించాలని వారు పిలుపునివ్వడం జరిగింది. అనంతరం గ్రామంలో పార్టీ శాఖ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ ఖమ్మం డివిజన్ కార్యదర్శి టి ఝాన్సీ, ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యు) రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ శిరోమణి, పార్టీ నగర కార్యదర్శి శోభ, పార్టీ జిల్లా నాయకులు కే శ్రీనివాస్, పార్టీ టౌన్ కార్యదర్శి లెనిన్, పార్టీ గ్రామ కార్యదర్శి బొమ్మకంటి రమేష్, మరియు రామనాథం, మాధవరావు, వెంకటనారాయణ, వెంకన్న, యాకోబ్, ప్రసాదు, రవి, మల్సూరు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే..



**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్11(ది క్రైమ్ న్యూస్):** మహబూబాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహబూబాబాద్ మున్సిపాలిటీకి చెందిన మున్సిపల్ శాఖ అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళి నాయక్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల పట్ల ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీ నాయక్ ప్రత్యేక శ్రద్ధ తో పట్టణ సుందరీకరణ పట్టణంలోని ప్రధాన రహదారులు, సెంట్రల్ లైటింగ్ మరియు పార్కుల అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు మున్సిపల్ చైర్మన్‌కి ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణ వర్షాకాలం దృష్ట్యా పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం, వ్యర్థాల సేకరణ, మరియు దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. మౌలిక సదుపాయాలు ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, నిలిచిపోయిన సిసి రోడ్లు మరియు ఇతర సివిల్ పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారం వార్డుల వారీగా ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించేలా మున్సిపల్ సిబ్బంది సమర్థవంతంగా పనిచేయాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రభుత్వ నిధులు సద్వినియోగం అయ్యేలా పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని అన్నారు. ఈ సమీక్ష సమావేశం లో ఎమ్మెల్యే వెంట మహబూబాబాద్ మున్సిపల్ చైర్మన్ గూగులోత్ జ్యోతి రమేష్ మున్సిపల్ శాఖ అధికారులు పాల్గొన్నారు...

# ఇందిరమ్మ ఇళ్ల సమస్యల పై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే మురళి నాయక్...



**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జూన్11 (ది క్రైమ్ న్యూస్):** స్థానిక ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో జిల్లా జెడ్పీ సీఈవో పురుషోత్తం తో పాటు అన్ని మండలల ఎంపిడిఓ లు మరియు హౌసింగ్ ఏఈ లతో ఇందిరమ్మ ఇళ్ల కు సంబంధించి సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళి నాయక్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పథకం పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తుందని అన్నారు. మొదటి విడతలో ఇందిరమ్మ ఇళ్లు కొంత మంది లబ్ధిదారులకు సాంకేతిక కారణాల కారణంగా మరియు లబ్ధిదారుల జెండర్ మార్పుల కారణంగా కొంత మంది లబ్ధిదారులకు పేమెంట్ సమస్య ఎదురవుతుంది కావున ఆ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు.... మొదటి విడతలో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులకుఆదేశించారు.....అంతేకాకుండా 2వ విడత ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో ఎలాంటి అవినీతికి తావు లేకుండా, అర్హులైన పేదలకు మాత్రమే ఇళ్లు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో నిర్మాణ పనుల పురోగతిని పర్యవేక్షించాలని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అధికారులపై చర్యలు తప్పవని ఎమ్మెల్యే తెలియజేశారు. ప్రభుత్వం నిర్ణయించిన లక్ష్యం ప్రకారం అర్హులైన ప్రతి పేదవాడికి ఇల్లు అందించడమే లక్ష్యంగా మనం పని చేయాలని అధికారులకు ఆదేశించారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇంటికి మూడు రంగులు తప్పని సరిగా వేయాలని లబ్ధిదారులకు తెలియజేసే బాధ్యత మీదే అని అధికారులకు ఆదేశించారు.

## ప్రజావాణిలో ప్రజల వినతులు స్వీకరించిన డిప్యూటీ కమిషనర్ డి. లావణ్య...




**కుత్బుల్లాపూర్, జూన్ 11 (ది క్రైమ్ న్యూస్):** ప్రజావాణి కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ డి. లావణ్య ప్రజల నుండి వివిధ సమస్యలపై వినతులను స్వీకరించారు. ప్రజావాణిలో సాయిబాబా నగర్ ప్రాంతంలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరుతూ ఒక వినతి అందింది. అలాగే దూలపల్లి ఇండస్ట్రియల్ ఏరియా -సుభాష్ నగర్ పరిధిలోని 100 అడుగుల రహదారిపై ఉన్న ప్రభుత్వ, ప్రజా భూములకు సంబంధించి జాయింట్ సర్వే నిర్వహించి, సరిహద్దుల నిర్ధారణ (డీమార్కేషన్) చేపట్టి, భూముల రక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు ఆక్రమణలను తొలగించాలని కోరుతూ మరో వినతి అందింది. ప్రజావాణిలో అందిన వినతులను సంబంధిత శాఖలకు పంపించి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కమిషనర్ డి. లావణ్య అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఓడీ తిరుపతి, డీఈఈ (ఎస్‌డబ్ల్యూఎం) విరాట్ రాజ్‌కుమార్, డీఈఈ (మెయింటెనెన్స్) సీహెచ్. వేణు, ఏఎంసీ ఎ. రవికుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## 'గో టు విలేజ్' కార్యక్రమం విద్య ప్రాధాన్యతపై నేతల పిలుపు

- ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పౌలు ఆధ్వర్యంలో జెండా గద్దె పరిశీలన - ముఖ్య అతిథిగా హాజరైన మహిళా ఎమ్మార్పీఎస్ కన్వీనర్ దండు వరలక్ష్మి మాదిగ





**కరీంనగర్ టౌన్, జూన్11(ది క్రైమ్ న్యూస్):** పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం వెల్ది,లింగాపూర్, జగయ్య పల్లి,శ్రీనివాస్ నగర్, గ్రామల లో గురువారం ఉదయం 'గో టు విలేజ్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. గ్రామంలోని ప్రతి విద్యార్థి తప్పనిసరిగా పాఠశాలకు వెళ్లేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. చదువే పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాది అని, విద్యతోనే సమాజ వికాసం సాధ్యమని నేతలు స్పష్టం చేశారు.గ్రామంలో పౌలు, పరశురాములు, గాలిపెల్లి పరిశయ్యల ఆధ్వర్యంలో చేపట్టబోయే జెండా గద్దె నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తామని నేతలు ప్రకటించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మహిళా ఎమ్మార్పీఎస్ కరీంనగర్ జిల్లా కన్వీనర్ దండు వరలక్ష్మి మాదిగ 7396493572 మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో, విద్యా రంగంలో మహిళలు, యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.పాల్గొన్న ప్రముఖులు, విద్యార్థులు:ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలతో పాటు హర్షత్ జైవర్ధన్ (ఇంటర్ పూర్తి), ఆయన్ జైవర్ధన్ (7వ తరగతి పూర్తి), శశి కుమార్ (ఎంటెక్ పూర్తి), లలిత్ కుమార్ (9వ తరగతి), జ్యోతి (6వ తరగతి), ఉమాదేవి (8వ తరగతి) తదితర విద్యార్థులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల భాగస్వామ్యం ఎంతో అవసరం

ప్రాంతీయ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అసిస్టెంట్ సైంటిస్ట్ ఇ.కనక జ్యోతి




**గోదావరిఖని టౌన్ (ది క్రైమ్ న్యూస్):** 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా, తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ప్రాంతీయ కార్యాలయం, రామగుండం ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలనపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రాంతీయ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అసిస్టెంట్ సైంటిస్ట్ ఇ.కనక జ్యోతి తెలిపారు. గురువారం గోదావరిఖనిలోని జ్యోతినగర్ జెడ్.పి.హెచ్.ఎస్ పాఠశాల వేదికగా ఎన్.సి.సి విద్యార్థులకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి కలిగే హానికారక ప్రభావాలు, భూమి, నీరు, జీవ వ్యవస్థలకు వాటి వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ సైంటిస్ట్ ఇ.కనకజ్యోతి మాట్లాడుతూ, నిత్యజీవితంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడానికి పాటించాల్సిన నియమాలు, అనుసరించాల్సిన ప్రత్యామ్నాయ మార్గాలను విద్యార్థులకు వివరించారు, విద్యార్థులచే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై ప్రతిజ్ఞ చేయించారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిలిపివేసి, బయో-డిగ్రేడబుల్ వస్తువులను వినియోగించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. విద్యార్థులు ఈ కార్యక్రమంపై తమ అభిప్రాయాలను పంచుకుంటూ, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్.పి.హెచ్.ఎస్ పాఠశాల ఎన్.సి.సి కో-ఆర్డినేటర్ తిరుపతి, ఎన్.జి.సి కో-ఆర్డినేటర్ అంజన్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు, ఎన్.సి.సి విద్యార్థులు పాల్గొన్నారు.

# సింగరేణిలో రాజకీయ జోక్యం వల్ల కార్మికులకు తిప్పలు: ఏఐటీయూసీ



**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** గురువారం సాయంత్రం శేషగిరిభవన్ లో ఏర్పాటుచేసిన సమావేశం కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్, కేంద్ర ప్రచార కార్యదర్శి వీరస్వామి, మాట్లాడుతూ సింగరేణి సంస్థలో కార్మికులు, వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు పరిష్కారం కాకపోవడానికి రాష్ట్ర ప్రభుత్వ రాజకీయ జోక్యమే ప్రధాన కారణమని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటీయూసీ) నాయకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల సంక్షేమం, సంస్థ అభివృద్ధి, భవిష్యత్ ఉద్యోగ అవకాశాల కంటే రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇవ్వడం వల్ల సింగరేణి తీవ్ర నష్టాలను ఎదుర్కొంటోందని విమర్శించింది మరియు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న మెడికల్ బోర్డు కేసులు, అలియాస్ పేర్ల మార్పు, పెర్క్స్‌పై ఇన్‌కమ్ ట్యాక్స్ తొలగింపు, సొంత ఇంటి స్థలాల కేటాయింపు వంటి సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం, యాజమాన్యం నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తున్నాయని పేర్కొన్నారు. అదేవిధంగా ఈ సమస్యలపై ఎన్నిసార్లు చర్చలు జరిగినప్పటికీ ఆచరణలో మాత్రం ఎలాంటి పురోగతి కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. ప్రత్యేకంగా మెడికల్ ఫిట్ అయిన డిపెండెంట్లకు వెంటనే నియామక ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉండగా, రాజకీయ జోక్యం కారణంగా ఆ ప్రక్రియను ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తున్నారని ఆరోపించారు. ఫలితంగా వందలాది మంది డిపెండెంట్లు ఉద్యోగాల్లో చేరకుండా నిరీక్షించాల్సి వస్తోందని, రిటైర్డ్ కార్మిక కుటుంబాలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని తెలిపారు, ఉద్యోగంలో చేరాల్సిన సమయాన్ని కోల్పోవడంతో డిపెండెంట్లు విలువైన సర్వీస్‌తో పాటు నెలల తరబడి వేతనాలను కూడా కోల్పోతన్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన సుమారు రూ.56 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎఐటీయూసీ డిమాండ్ చేసింది. ఈ నిధులు అందకపోవడం వల్ల సంస్థ అభివృద్ధి కార్యక్రమాలు, ఆధునీకరణ పనులు, కొత్త పెట్టుబడులు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని తెలిపింది. ఒకవైపు బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను పెంచాలని ఒత్తిడి తెస్తూ, మరోవైపు సంస్థ అభివృద్ధికి అవసరమైన సహకారం అందించకపోవడం ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని వర్ణించారు అదేవిధంగా సింగరేణి భవిష్యత్‌కు అత్యంత కీలకమైన కొత్త కోల్ బ్లాకుల కేటాయింపు, కొత్త బొగ్గు గనుల ప్రారంభం, ఉద్యోగ అవకాశాల విస్తరణ వంటి అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం మౌనం పాటిస్తోందని ఎఐటీయూసీ ఆందోళన వ్యక్తం చేసింది. సంస్థ విస్తరణ లేకుంటే భవిష్యత్ తరాలకు ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతాయని హెచ్చరించారు. యూనియన్‌తో జరిగిన అధికారిక నిర్మాణాత్మక సమావేశాల్లో అంగీకరించిన అనేక డిమాండ్లను కూడా రాష్ట్ర ప్రభుత్వ జోక్యం కారణంగా యాజమాన్యం అమలు చేయడం లేదని తీవ్రంగా మండిపడ్డారు. సింగరేణిలో నెలకొన్న దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం కార్మిక వర్గం ఇక మౌనంగా ఉండబోదని స్పష్టం చేసిన ఎఐటీయూసీ, అవసరమైతే నిరవధిక సమ్మెకు సిద్ధమవుతామని హెచ్చరించింది. కార్మికుల హక్కులు, సింగరేణి భవిష్యత్ పరిరక్షణ కోసం జరుగుతున్న ఈ పోరాటానికి అన్ని కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు, కార్మికులు మద్దతు తెలపాలని పిలుపునిచ్చింది. సింగరేణిలో రాజకీయ జోక్యాన్ని నివారించి, పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలినీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్, కేంద్ర ప్రచార కార్యదర్శి వీరస్వామి, కొత్తగూడెం ఏరియా బ్రాంచ్ కార్యదర్శి వి.మల్లికార్జున్ రావు, కార్పొరేట్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్.వి.రమణమూర్తి, వైస్ ప్రెసిడెంట్లు క్రిస్టోఫర్, సహాయ కార్యదర్శులు గట్టయ్య, రాము, ఆఫీస్ బ్యారర్స్ సందబోయిన శ్రీనివాస్, నాగయ్యా, నితిన్, పిట్ కార్యదర్శిలు ఏం ఆర్ కే ప్రసాద్, కమల్, రమేష్, సీనియర్ నాయకులు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పుట్ట మధు పై అర్ధ రహిత విమర్శలు చేస్తే సహించేది లేదు

- పూదరి సత్యనారాయణ పై కేసు కుట్ర పూరితమే..! - ఆరు గ్యారంటీలు అటకెక్కించినట్లే
- రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మంథనిలో పుట్ట మధు విజయం తథ్యం



**రామగిరి, జూన్ 11(ది క్రైమ్ న్యూస్):** మంథని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జి పుట్ట మధు పై అర్ధ రహిత విమర్శలు చేస్తే సహించేది లేదని. బీ ఆర్ ఎస్ మండల అధ్యక్షులు ఏగోళం శంకర్ గౌడ్.రచ్చపల్లి మాజీ సర్పంచ్ కనవేన శ్రీనివాస్. జంజర్ల శేఖర్. మాజీ ఎంపీటీసీ. పెగడ శ్రీనివాస్. మంథని లక్ష్మణ్ హెచ్చరించారు. మంథని రాజా గృహ వద్ద గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ముత్తారం మండలంలో ఓ వ్యక్తి ఆత్మహత్య కేసులో ఎలాంటి ప్రమేయం లేని బీఆర్ఎస్ నాయకులు పూదరి సత్యనారాయణ గౌడ్ పై కేసు అక్రమైనదాని ఇందులో నూటికి నూరు పాళ్ళు రాజకీయ కుట్ర దాగివుందని ఆరోపించారు. ఏది వాస్తవమో... ఏది అవాస్తవమో.. కండ్లున్న చూడలేని కబోదుల్లా కాంగ్రెస్ నాయకులు వ్యవహారిస్తున్నారని ఏద్దెవా చేశారు. మంథని నియోజకవర్గంలో అధికార పార్టీని ప్రశ్నిస్తే చాలు ఆ ప్రశ్నించే గొంతుకులను నొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.అధికార పార్టీ నేతల మెప్పు కోసం పోలీసులు అత్యుత్సాహం చూపిస్తుండడం శోచనీయమన్నారు.రాష్ట్రంలో మాయ మాటలతో గారడీ గ్యారింటీలతో అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారింటీలను అటకెక్కించినట్లే మంథని సెగ్మెంట్ లో కూడా మాయ మాటలతో ప్రజలను మభ్యపెడుతూ కాలం వెళ్ళదీస్తుందన్నారు.దాదాపు 40 ఏళ్ల పాటు మంథనిలో అధికారంలో ఉన్న తండ్రి కొడుకుల కాలంలో చేయలేనటువంటి రింగు రోడ్డును పుట్ట మధు హయాంలో పూర్తి చేయడం జరిగిందన్నారు. తాము చేయలేని రింగు రోడ్డును కూడా తామే చేసినట్లు ప్రగల్బాలు పలకడం చూసి జనాలు విస్తూపోతున్నారన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా మంథని నియోజకవర్గం నుండి గెలుపొంది నలుగున్నారేండ్ల కాలంలోనే ఎంతో అభివృద్ధి చేసినారని తాము చేసిన అభివృద్ధి పై బహిరంగ చర్చకుయైన సంసిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. మంథని మట్టి బిడ్డ పుట్ట మధు అధికారంలో ఉన్న ప్రతి పక్షంలో ఉన్నా ఎప్పుడు ఈ ప్రాంత ప్రజల కష్ట సుఖాల్లో తోడుండే నాయకుడని అలాంటి నాయకుడిని రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బడుగు, బలహీన వర్గాల ప్రజల పెన్నిధి పుట్ట మధును గెలిపించుకోవాలనే సంకల్పంతో ప్రజలు ఉన్నారన్నారు. ఏది ఏమైనా పుట్ట మధు విజయాన్ని ఎవ్వరు అడ్డుకోలేరని స్పష్టం చేశారు.

# 12 ఏళ్ల మోదీ పాలన దేశ అభివృద్ధికి నాంది: రవికుమార్ యాదవ్



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** శేరిలింగంపల్లి భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ 12 సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం హఫీజ్‌పేట్ బీఎల్‌వై హోమ్స్ వద్ద పాత్రికేయులు, మీడియా ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి రవికుమార్ యాదవ్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం విశ్వాసం, అభివృద్ధి, ప్రజా సంక్షేమం అనే మూడు ప్రధాన లక్ష్యాలతో ముందుకు సాగిందన్నారు. వికసిత్ భారత్ లక్ష్యంగా 4,399 రోజులు నిరంతరంగా కృషి చేసి దేశాన్ని ప్రపంచ వేదికపై మరింత బలంగా నిలబెట్టారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం విశేష ప్రాధాన్యం ఇచ్చిందని, గ్రాంట్లు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, రైల్వేలు, జాతీయ రహదారుల విస్తరణ, రైతు సంక్షేమ కార్యక్రమాల ద్వారా భారీ స్థాయిలో నిధులు కేటాయించిందన్నారు. రాష్ట్రంలో 40 అమృత్ రైల్వే స్టేషన్ల అభివృద్ధి, వేల కిలోమీటర్ల జాతీయ రహదారుల నిర్మాణం, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగాయని తెలిపారు. దేశవ్యాప్తంగా పీఎం కిసాన్ పథకం ద్వారా కోట్లాది మంది రైతుల ఖాతాల్లో నేరుగా నిధులు జమ చేశారని, వ్యవసాయ ఉత్పత్తి, పాల ఉత్పత్తి గణనీయంగా పెరిగాయని వివరించారు. కోవిడ్ సమయంలో ప్రపంచంలోని అనేక దేశాలకు వ్యాక్సిన్లు పంపిణీ చేయడం, జీ-20 సదస్సును విజయవంతంగా నిర్వహించడం, విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం వంటి అంశాలు భారత ప్రతిష్ఠను పెంచాయని అన్నారు. దేశ భద్రత విషయంలో సర్జికల్ స్ట్రైక్స్, ఎయిర్ స్ట్రైక్స్ ద్వారా కేంద్ర ప్రభుత్వం రాజీపడని వైఖరిని ప్రదర్శించిందని చెప్పారు. స్వచ్ఛ భారత్, ఫిట్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్, వోకల్ ఫర్ లోకల్ వంటి కార్యక్రమాలు ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చాయని తెలిపారు. గ్రామీణ రహదారులు, జాతీయ రహదారులు, వందే భారత్ రైళ్లు, విమానాశ్రయాల విస్తరణ, డిజిటల్ లావాదేవీలు, స్టార్టప్‌ల అభివృద్ధి వంటి రంగాల్లో దేశం విశేష పురోగతి సాధించిందని పేర్కొన్నారు. 2047 వికసిత్ భారత్ లక్ష్య సాధనలో తెలంగాణ కూడా ముందంజలో ఉండాలని, రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఏర్పడితే అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, డివిజన్ స్థాయి నాయకులు, వివిధ మోర్చాల పదాధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పార్కు స్థలం కబ్జాపై హైడ్రాకు ఫిర్యాదు



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** దీప్తి శ్రీనగర్ కాలనీలోని లేఅవుట్ పార్కు స్థలంలో అక్రమ ఆక్రమణలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ "జనం కోసం" స్వచ్ఛంద సంస్థ హైడ్రా ప్రధాన కార్యాలయానికి ఫిర్యాదు చేసింది. కాలనీలోని పార్కు స్థలం మొత్తం 9,752 గజాలు ఉండగా, అందులో సుమారు 1,000 గజాలను కొందరు వ్యక్తులు క్రికెట్ నెట్ కోర్టు పేరుతో ఆక్రమిస్తున్నారని సంస్థ ప్రతినిధులు ఆరోపించారు. దాదాపు రూ.15 కోట్ల విలువైన పార్కు స్థలం కబ్జాకు గురవుతోందని పేర్కొన్నారు. ఈ మేరకు "జనం కోసం" సంస్థ అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కరరెడ్డి, ప్రధాన కార్యదర్శి నాగం రాజశేఖర్ బుధవారం సాయంత్రం హైడ్రా ప్రధాన కార్యాలయంలో ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్కు స్థలాల్లో పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన వాటిని మినహాయించి ఇతర నిర్మాణాలు చేపట్టడం చట్టవిరుద్ధమని తెలిపారు. పార్కుల్లో నిర్మాణాలు చేపట్టడం అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలను ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. పార్కు స్థలంపై జరుగుతున్న ఆక్రమణలను వెంటనే తొలగించి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని "జనం కోసం" సంస్థ హైడ్రా అధికారులను డిమాండ్ చేసింది.

# అనుమతి లేని నిర్మాణాలు చేపట్టవద్దు ఎంపీడీవో సాదినేని ప్రియాంక



**రామగిరి, జూన్ 11(ది క్రైమ్ న్యూస్):** గ్రామాల్లో ఎటువంటి అనుమతి లేని నిర్మాణాలు చేపట్టవద్దని ఎంపీడీవో సాదినేని ప్రియాంక అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శిలచే ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో గృహాలు గాని ప్రహరీ గోడలు గాని ఇతరత్రా వాటికి ముందుగా ఆయా యజమాను అనుమతి తీసుకుని అనుమతి వచ్చిన తర్వాతనే గృహ నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ఎవరైనా అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే వాటికి నోటీసులు జారీ చేయాలని కోరారు. ఎప్పటికప్పుడు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను, నర్సరీలను పరిశీలించే బాధ్యత గ్రామ కార్యదర్శి అని అన్నారు. పెన్షన్దారుల అప్డేట్ పూర్తి చేయాలని రాని వారిని గుర్తించి వారికి సమాచారం ఇవ్వాలని కోరారు. నర్సరీలో పెరుగుతున్న మొక్కలు వనమహోత్సవం అందేలా వాటిని పెంచాలని సూచించారు. గ్రామాల్లో త్రాగునీటి నీటి ఎద్దడి లేకుండా చూడాలని సూచించారు. ఇంటి పనులు 100 శాతం అయ్యేలా ప్రతి కార్యదర్శి బాధ్యత తీసుకోవాలని అలాగే కారోబార్లకు కూడా తెలిపి 100% పన్నులు వసూలు అయ్యేలా చూడాలని వారికి ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో ఎంపీ ఓ సౌమ్య, గ్రామ కార్యదర్శులు బచ్చల ప్రసాద్, రాము, గుమ్మడి సదయ్య, సూది రెడ్డి ప్రవళిక, సాయి శ్రీ తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం ఘటనపై రజక సంఘం ఆగ్రహం

## నిందితుడిని కఠినంగా శిక్షించాలని రాచకొండ నరేష్ డిమాండ్



**కరీంనగర్ టౌన్, జూన్ 11(ది క్రైమ్ న్యూస్):** ఖమ్మం నగరంలో 12 ఏళ్ల మైనర్ బాలికపై జరిగిన లైంగిక దాడి యత్నం, హత్యాయత్న ఘోర సంఘటన ను కరీంనగర్ రాచకొండ నరేష్ రజక సంఘం అధ్యక్షులు తీవ్రంగా ఖండించారు. ఈ అమానుషానికి పాల్పడిన నిందితుడిని చట్టపరంగా అత్యంత కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో ఇలాంటి దారుణాలు మళ్లీ పునరావృతం కాకుండా ఉండాలంటే, నిందితుడిని తక్షణమే ఎన్‌కౌంటర్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అప్పుడే ఇలాంటి మృగాళ్లకు భయం పుడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన సదరు మైనర్ బాలిక త్వరగా కోలుకోవాలని, ఆమెకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు రాచకొండ నరేష్ పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలవాలని ఆయన డిమాండ్ చేశారు.

# ప్రశ్నించినందుకు దాడికి దిగిన దెందుకూరు సర్పంచ్

- దెందుకూరు గ్రామంలో సర్పంచ్ అరాచకం
- ఆర్టిఐ సమాచారం అడిగినందుకు భౌతిక దాడి చేసిన సర్పంచ్



**మధిర ప్రతినిధి, జూన్ 11 (ది క్రైమ్ న్యూస్):** మధిర మండలం దెందుకూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిన్న (జూన్ 9న మంగళవారం ఒక ఘోరమైన ఉదంతం సంఘటన దెందుకూరు గ్రామంబిజెపి పంచాయతీ అభ్యర్థి కాండేట్ దోర్నాల దినకర బాబు తండ్రి మల్లయ్య దెందుకూరు గ్రామ పంచాయతీ ఆఫీస్‌కు వెళ్లి, విధుల్లో ఉన్న పంచాయతీ సెక్రటరీ ని సమాచార హక్కు చట్టం (ఆర్టిఐ) ప్రకారం గ్రామ నిధుల వివరాలు అడిగారు. చట్టప్రకారం సమాచారం అడగడం పౌరుడిగా ఆయనకున్న హక్కు కానీ, సమాచారం అడుగుతున్నారనే కోపంతో దెందుకూరు సర్పంచ్ పగిడిపల్లి శ్రీనివాసరావు అనవసరంగా జోక్యం చేసుకుని, ప్రభుత్వ అధికారి ముందే నలుగురిలో ఆర్టిఐ అడగటానికి నువ్వు ఎవడవురా? బ్రోకర్ నా కొడుకా!అంటూ అత్యంత దారుణంగా బూతులు తిట్టారు. అంతటితో ఆగకుండా, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని దోర్నాల దినకర బాబు కాలర్ పట్టుకుని చెంప మీద గట్టిగా కొట్టి భౌతిక దాడికి దిగారు. ఒక బాధ్యతాయుతమైన ప్రజాప్రతినిధి స్థానంలో ఉండి, ప్రభుత్వ కార్యాలయంలోనే సామాన్యుడిపై ఇలా చెంపదెబ్బతో దౌర్జన్యం కి దిగడం ప్రజాస్వామ్యాన్ని, చట్టాన్ని అవమానించడమే! ఒక సామాన్య పౌరుడు హక్కుల కోసం అడిగితే చెంప పగలగొడతారా? సర్పంచ్ చేసిన ఈ దౌర్జన్యాన్ని తీవ్రంగా ఖండిస్తూ ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధితుడికి న్యాయం జరగాలని కోరుతున్నారు.

# సాగులో ఆధునిక సాంకేతిక యాంత్రికరణను ప్రోత్సహించాలి

## నకిలీ విత్తన పంపిణీ దారులపై కఠిన చర్యలు తీసుకోవాలి

## జిల్లా వ్యవసాయ అధికారికి ఆత్మ కమిటి వినతి...



**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జూన్11 (ది క్రైమ్ న్యూస్):** సాగులో ఆధునిక సాంకేతిక యాంత్రీకరణ ప్రో త్సహించే విధంగా చర్యలు తీసుకోవాలని నూతన జిల్లా వ్యవసాయ అధికారి విజయ చంద్ర ని ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి కోరారు. మహబూబాబాద్ జిల్లా వ్యవసాయ అధికారిగా నూతనంగా బాధ్యతలు చేపట్టి కురవికి వచ్చిన విజయచంద్ర ని ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానం చేసి అభినందనలు తెలియజేశారు ఈ సందర్భంగా జిల్లా అధికారితో మాట్లాడుతూ రైతులు నకిలీ విత్తనాల బారిన పడకుండా కఠినమైన విధానాలను పాటించాలని, సాగులో ఆధునిక, సాంకేతిక పద్ధతుల అవలంబించే విధంగా, పంట మార్పిడి విధానం, ఉద్యానవన పంటల సాగుపై రైతులను మళ్లించి అధిక ఆదాయం పొందే విధంగా విధానాలను రూపొందించి జిల్లాను అగ్రగామిగా ఉండేటట్టుగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నరసింహారావు,ఏఏఓలు రాజేశ్వరి, విజేయేందర్, జితేందర్ పాల్గొన్నారు.

# ముువ్వ ముత్తయ్య దశదినకర్మలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



**మధిర ప్రతినిధి, జూన్ 11 (ది క్రైమ్ న్యూస్):** మండలం ఖమ్మంపాడు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ ముువ్వ వెంకయ్య బాబు సోదరుడు ముువ్వ ముత్తయ్య దశదినకర్మకు శుక్రవారం మధిర పట్టణం రిక్రియేషన్ క్లబ్ నందు హాజరై వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించిన మాజీ మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ జిల్లా అధికార ప్రతినిధి కర్నాటి రామారావు మధిర మార్కెట్ కమిటీ డైరెక్టర్ అద్దంకి రవికుమార్ తొండల గోపవరం గ్రామ సర్పంచ్ షేక్ ఖన్నశీ సాహెబ్ జింకల కోటేశ్వరరావు అంగడాల భాస్కర్ రావు తదితులు పాల్గొని నివాళులర్పించారు.

# హిల్‌రిడ్జ్ విల్లాస్ భారీ చోరీ కేసు ఛేదన.. 7.8 కిలోల బంగారం స్వాధీనం

**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** గచ్చిబౌలిలోని హిల్‌రిడ్జ్ విల్లాస్‌లో జరిగిన భారీ చోరీ కేసును సైబరాబాద్ పోలీసులు అత్యంత వేగంగా ఛేదించి, దాదాపు రూ. కోట్ల విలువైన బంగారం, వెండి ఆభరణాలను పూర్తిగా స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ముగ్గురు నేపాలీ నిందితులను ఉత్తరప్రదేశ్‌లో అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జూన్ 6న హిల్‌రిడ్జ్ విల్లాస్‌లోని ఓ విల్లాలో యజమానులు లేని సమయంలో నేపాలీ దంపతులు చోరీకి పాల్పడ్డారు. జూన్ 7న ఇంటికి తిరిగి వచ్చిన వృద్ధ దంపతులు ఇంట్లోని దేవుడి విగ్రహానికి ఉన్న బంగారు గొలుసు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం జూన్ 8న వారి కుమారుడు ఇంటికి వచ్చి లాకర్‌ను తనిఖీ చేయగా, అందులోని సుమారు 7 నుంచి 8 కిలోల బంగారు ఆభరణాలు, 1.5 కిలోల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న వెంటనే సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ ఆదేశాలతో ఎస్‌వోటీ, క్రైమ్ టీమ్‌లు, గచ్చిబౌలి పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. నిందితుల ఆచూకీ కోసం ఉత్తరప్రదేశ్, బీహార్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలకు ఆరు ప్రత్యేక బృందాలను పంపించారు. దర్యాప్తులో భాగంగా ఉత్తరప్రదేశ్‌లోని రాంపూర్ జిల్లా బిలాస్‌పూర్ రోడ్డులో ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్టైన వారిలో కమల్ షాహీ, విమలా షాహీ, కల్పనా షాహీలు ఉన్నారు. వీరంతా నేపాల్‌కు చెందినవారని పోలీసులు తెలిపారు.

నిందితుల నుంచి సుమారు 7 కిలోల 837 గ్రాముల బంగారు ఆభరణాలు, 1,361 గ్రాముల వెండి వస్తువులు, రూ. 33,170 నగదు, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల విచారణలో సురేష్ అలియాస్ సూరజ్ అనే నేపాలీ వ్యక్తి ఖరీదైన విల్లాలు, ఇళ్లలో నేపాల్‌కు చెందిన వారిని గృహ సహాయకులుగా నియమించి, యజమానులు ఇంట్లో లేని సమయాలపై సమాచారం సేకరించి చోరీలకు పాల్పడుతున్నట్లు వెల్లడైంది. హిల్‌రిడ్జ్ విల్లాస్‌లో కూడా ఇదే తరహాలో గృహ సహాయకులను నియమించి చోరీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. నిందితులు లాకర్ పక్కనే ఉంచిన తాళాన్ని గుర్తించి, లాకర్ తెరిచి ఆభరణాలు తీసుకుని తిరిగి లాక్ చేసి, తాళాన్ని కూడా తీసుకుని పరారైనట్లు విచారణలో ఒప్పుకున్నారని పోలీసులు తెలిపారు. ఈ భారీ చోరీ కేసును స్వల్ప వ్యవధిలో ఛేదించి, మొత్తం సొత్తును రికవరీ చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ అభినందించారు. కేసు ఛేదనలో కీలకంగా పనిచేసిన బృందాలకు నగదు బహుమతులు ప్రకటించారు. ఈ కేసు






దర్యాప్తును శేరిలింగంపల్లి డీసీపీ చి. శ్రీనివాస్ పర్యవేక్షణలో అదనపు డీసీపీ ఎన్. ఉదయ్ రెడ్డి, ఏసీపీ కలింగరావు, గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ పి. నరేష్, క్రైమ్ టీమ్ సభ్యులు సమన్వయంతో విజయవంతంగా పూర్తి చేశారు.

# పుట్ట మధు పై అర్ద రహిత విమర్శలు చేస్తే సహించేది లేదు

## ● బీఆర్ఎస్ మండల అధ్యక్షులు తాటికొండ శంకర్

రామగిరి, జూన్ 11(ది క్రైమ్ న్యూస్):- మంథని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జి పుట్ట మధు పై అర్ద రహిత విమర్శలు చేస్తే సహించేది లేదని కమాన్ పూర్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాటికొండ శంకర్, యూత్ మండల అధ్యక్షులు బొమ్మగాని అనిల్ గౌడ్ హెచ్చరించారు. కమాన్ పూర్ మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ముత్తారం మండలంలో ఓ వ్యక్తి ఆత్మహత్య కేసులో ఎలాంటి ప్రమేయం లేని బీఆర్ఎస్ నాయకులు పూదరి సత్యనారాయణ గౌడ్ పై కేసు అక్రమైనదాని ఇందులో నూటికి నూరు పాళ్ళు రాజకీయ కుట్ర దాగివుందని ఆరోపించారు. ఏది వాస్తవమో... ఏది అవాస్తవమో.. కండ్లున్న చూడలేని కబోదుల్లా కాంగ్రెస్ నాయకులు వ్యవహారిస్తున్నారని ఏద్దెవా చేశారు. మంథని నియోజకవర్గంలో అధికార పార్టీని ప్రశ్నిస్తే చాలు ఆ ప్రశ్నించే గొంతుకులను నొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో మాయ మాటలతో గారడీ గ్యారింటీలతో అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారింటీలను అటకెక్కించినట్లే మాయ మాటలతో ప్రజలను మభ్యపెడుతూ కాలం వెళ్ళదీస్తుందన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా మంథని నియోజకవర్గం నుండి గెలుపొంది నలుగున్నారేండ్ల కాలంలోనే ఎంతో అభివృద్ధి చేసినారని తాము చేసిన అభివృద్ధి పై బహిరంగ చర్చకుయైన సంసిద్దంగా ఉన్నట్లు వెల్లడించారు. పుట్ట మధు అధికారంలో ఉన్న



ప్రతి పక్షంలో ఉన్నా ఎప్పుడు ఈ ప్రాంత ప్రజల కష్ట సుఖాల్లో తోడుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కమాన్ పూర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం లక్ష్మీమల్లు, పెంచికల్ పేట్ సర్పంచ్ పల్లె మాధవి - నాయరాయణ, కమాన్ పూర్ మాజీ వైస్ ఎంపిపి కొట్టె భూమయ్య, నాయకులు రాచకొండ రవి, గాదె సది, జాబు సతీష్, ఆకుల రమేష్, కొండి అనిల్, కొయ్యడ కుమార్, బొడ్డు రవి, అజిత్ రావు, పంతకాని రవి, నడిగొట్టు సంపత్, మేకల ఎల్లయ్య, మహమ్మద్ మొకిద్, ఆకుల కుమార్, దండే రమేష్ ఠాగూర్, ఎలాబోయిన రాంమూర్తి, కమ్మగోని భాస్కర్, సిరవేణి వేణు, తోడేటి రాజిరు, మట్ట శంకర్, బోయిని బాలకృష్ణ, దండే తిరుపతి, చొప్పరి శ్రీనివాస్, రాంపెల్లి రవి, తోట రాజ్ కుమార్, మానుక ఓదెలు లు పాల్గొన్నారు...

# పుట్ట మధు అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం

## ● అభివృద్ధి గురించి మాట్లాడండి వ్యక్తిగత దూషణలు కాదు ● ఐఎన్టీయూసీ అర్జీ- త్రీ వైస్ ప్రెసిడెంట్ కోట రవీందర్ రెడ్డి

**రామగిరి, జూన్ 11(ది క్రైమ్ న్యూస్):-** మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పై చేసిన అనుచిత, అవమానకర వ్యాఖ్యలను ఐఎన్టీయూసీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామని ఐఎన్టియుసి వైస్ ప్రెసిడెంట్ కోట రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. ఉద్యమ సమయంలో ప్రజల మధ్య కనిపించని వ్యక్తికి ఉద్యమ పార్టీ ఒకసారి అవకాశం ఇస్తే, ఆ అవకాశాన్ని ప్రజల అభివృద్ధికి కాకుండా వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగించారని అన్నారు. అందుకే మంథని ప్రజలు వరుసగా తిరస్కరిస్తూ వస్తున్నారని పేర్కొన్నారు. కులం కన్నా గుణం ముఖ్యం. బహుజన బిడ్డల పేరుతో కపట రాజకీయాలు, సానుభూతి నాటకాలు చేస్తే ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. అభివృద్ధి, అందుబాటు, ప్రజాసేవను చూసే మంథని ప్రజలు శ్రీధర్ బాబు ని ఐదుసార్లు గెలిపించారు. అని అన్నారు. సింగరేణి బకాయిలు, ఆర్థిక సమస్యలకు కారణం గత బీఆర్ఎస్ ప్రభుత్వ విధానాలేనని పేర్కొన్నారు. అధికారం ఉన్నప్పుడు సింగరేణిని నిర్వీర్యం చేసి, ఇప్పుడు సింగరేణి పరిరక్షణ పేరుతో ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. అధికారం కోల్పోయిన తర్వాత సింగరేణి కార్యాలయాలను తగలబెట్టాలని బహిరంగ సభల్లో మాట్లాడిన వారు, నేడు సింగరేణి రక్షకులమంటూ మాట్లాడటం హాస్యాస్పదం. ప్రజలు ఇవన్నీ గమనిస్తున్నారు అని అన్నారు. రాబోయే ఎన్నికల్లో గెలిచే పరిస్థితి లేకపోవడంతోనే చౌకబారు ఆరోపణలు, రాజకీయ డ్రామాలు చేస్తున్నారని ప్రజలు గుర్తించారని చెప్పారు. ప్రజాస్వామ్యంలో



ప్రజలే అంతిమ న్యాయనిర్ణేతలని, తగిన సమయంలో ఓట్ల రూపంలో సమాధానం చెబుతారని హెచ్చరించారు. గౌరవప్రదమైన పదవులు చేపట్టిన వ్యక్తులు హుందాగా మాట్లాడాలి. వ్యక్తిగత దూషణలు, చిల్లర రాజకీయాలు, అనుచిత భాషను ఇప్పటికైనా మానుకోవాలి. మాట్లాడే మాటల్లో, ప్రవర్తనలో మార్పు తీసుకురావాలి. లేకపోతే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారు అని కోట రవీందర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈకార్యకంలో ఐఎన్టీయూసీ సెంట్రల్ కమిటీ నాయకులు, బ్రాంచ్ కమిటీ, పిట్ సెక్రెటరీ లు, వివిధ ఏరియా, మైన్స్, డిపార్ట్మెంట్ కమిటీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మిర్యాలగూడలో ఘనంగా “లిటిల్ కిడ్స్ వ్యాలీ స్కూల్” ప్రారంభోత్సవం





**నల్గొండ ప్రతినిధి, జూన్ 11 (ది క్రైమ్ న్యూస్):** మిర్యాలగూడ పట్టణంలోని హౌజింగ్ బోర్డు కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన “లిటిల్ కిడ్స్ వ్యాలీ స్కూల్” ప్రారంభోత్సవ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి , ఎమ్మెల్సీ శంకర్ నాయక్ , మున్సిపల్ చైర్‌పర్సన్ చిలుకూరి సుధ--బాలకృష్ణ వైస్ చైర్‌పర్సన్ గుడిపాటి శిరీష - నవీన్ , జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు ముదిరెడ్డి నర్సిరెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి పాఠశాలను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి గారు మాట్లాడుతూ, నేటి ఆధునిక కాలంలో చిన్నారులకు చిన్నతనం నుంచే నాణ్యమైన విద్యతో పాటు నైతిక విలువలను అందించడం అత్యంత అవసరమన్నారు. హౌజింగ్ బోర్డు పరిసర ప్రాంత ప్రజలకు అందుబాటులో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ప్లే స్కూల్‌ను ఏర్పాటు చేయడం అభినందనీ యమని పాఠశాల యాజమాన్యాన్ని ప్రశంసించారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించేలా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్ గారు మాట్లాడుతూ, మారుతున్న కాలానికి అనుగుణంగా పిల్లల్లో సృజనాత్మకతను










పెంపొందించేలా, వారి దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేలా విద్యాబోధన సాగాలని సూచించారు. చిన్నారులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యను అందించేందుకు ముందుకు వచ్చిన పాఠశాల నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, పాఠశాల నిర్వాహకులు, ఉపాధ్యాయ బృందం, ప్రముఖ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

# నిమ్స్‌లో చికిత్స పొందుతున్న మైనర్ బాలికను పరామర్శించించిన మంత్రి తుమ్మల



**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్ ):** ఖమ్మం నగరంలో లైంగికదాడి గురై తీవ్ర గాయాలతో హైదరాబాద్ నిమ్స్ లో చికిత్స పొందుతున్న మైనర్ బాలికను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరామర్శించారు. నిమ్స్ లో చికిత్స పొందుతున్న బాలిక పరిస్థితిని చూసి తుమ్మల చలించిపోయారు. నిమ్స్ డైరెక్టర్ రాహుల్ తో తుమ్మల మాట్లాడారు. బాలికకు అందుతున్న వైద్య చికిత్సల వివరాలను తెలుసుకున్నారు మెరుగైన వైద్యం అందించాలని ఎటువంటి పరిస్థితి ఎదురైనా ముందు తనకు తెలియజేయాలని తుమ్మల నిమ్స్ డైరెక్టర్ కు సూచించారు. బాలిక తల్లిదండ్రులతో తుమ్మల మాట్లాడి ధైర్యం చెప్పారు తాను అండగా ఉంటానని ప్రభుత్వం తరఫున అందాల్సిన అన్ని రకాల సహాయం అందిస్తానని తెలిపారు. ఐసిడిఎస్ అధికారులతో మాట్లాడిన తుమ్మల బాలికతో పాటు బాలిక తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకోవాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు తనకు తెలియజేయాలని తుమ్మల నిమ్స్ ఆధికారులకు తెలిపారు.

# రైతులకు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలి

## ఫెర్టిలైజర్ షాపులను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి పట్టణ కేంద్రంలోని పలు ఫెర్టిలైజర్ షాపులలో గురువారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్ తనిఖీ చేపట్టి షాపులలో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎప్పటికప్పుడు రికార్డు మైంటైన్ చేయాలని ఫెర్టిలైజర్ షాప్ యజమానులకు సూచించారు. రాబోయేది వర్షాకాల సీజన్ కు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలని అన్నారు. మనకు వర్షపాతం తక్కువ ఉంటే దానికి అనుగుణంగా సాగు చేసుకుంటే మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందని రైతులకు కావలసిన యూరియా సరఫరా చేసే దిశలో ప్రభుత్వ సిద్ధంగా ఉందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రైతులకు వ్యవసాయ శాఖ తరపున పలు సూచనలు చేశారు. ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మినట్లయితే డీలర్లపై షాపు లైసెన్స్ రద్దుచేసి క్రిమినల్ కేసులు నమోదు చేయబడుతుందని హెచ్చరించారు.

# ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శిగా విజయ్ కుమార్



**రామగిరి,జూన్ 11(ది క్రైమ్ న్యూస్):-** ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శిగా మందనికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, సామాజిక, ఆధ్యాత్మిక సేవా తత్పరులు కొమరవెల్లి విజయకుమార్ నియమించినట్లు మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ గురువారం వెల్లడించారు. మంథని ప్రాంతంలో, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో, రాష్ట్రంలో ఆర్యవైశ్య మహాసభ బలోపేతం కోసం, మంథనిలో పలు సామాజిక, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలను కొనసాగించడానికి కృషి చేసిన విజయ్ కుమార్ సేవలను గుర్తించి రాష్ట్ర కార్యదర్శి అనియమించినట్లు ఆయన వెల్లడించారు. ఈ మేరకు నియామకపు పత్రాన్ని అందజేశారు. అనంతరం విజయకుమార్ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనారాయణ శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్యవైశ్య మహాసభ బలోపేతం కోసం, సభ్యుల సంక్షేమం, అభివృద్ధి కోసం తన వంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శిగా విజయ్ కుమార్ నియామకం పట్ల మంథని మున్సిపల్ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు నల్మాసు ప్రభాకర్, పట్టణ అధ్యక్షుడు ఎల్లంకి వంశీధర్, శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ కమిటీ అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్, మహిళా విభాగం అధ్యక్షురాలు రాచర్ల తిరుమల, నేతలు కేశెట్టి అశోక్ కుమార్, ఓల్లాల సత్యనారాయణ, నాగరాజు తోపాటు పలువురు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

# దాహార్తి తీర్చడమే ప్రథమ ధ్యేయం




**రామగిరి,జూన్ 11(ది క్రైమ్ న్యూస్):** ప్రజల దాహార్తి తీర్చడమే తమ ప్రథమ కర్తవ్యమని గుండారం సర్పంచ్ జంగిలిపోచాలు అన్నారు. గురువారం మండలంలోని గుండారం రిజర్వాయర్కు వెళ్లే రహదారి లోని హనుమాన్ దేవాలయం వద్ద గల చేతి పంపును సర్పంచ్ జంగిలిపోచాల ఆధ్వర్యంలో మరమ్మతులు చేశారు. కాగా ఈ బోర్ నుండి గుండారం ప్రజలు త్రాగునీటికి వాడుకుంటారు. దీంతో అవస్థలు పడ్డ గ్రామస్తులు సర్పంచ్ జంగిలిపోచాలకు తెలుపగా వెంటనే స్పందించి ఈ చేతి పంపును మరమ్మతులు చేయించారు. మరమ్మతులు చేయించిన సర్పంచ్కు ప్రజలు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కారోబార్ రాచకొండ భీమరాజు ఉన్నారు.

# ప్రజలు బుద్ధి చేపి ఓడిచిన.. పుట్టకు బుద్ధి మారలేదు

- బురద జల్లడం ఆపి ప్రజల తీర్పు చూసిన రియలైజ్ కా
- పుట్ట మధు నీ అహంకారం తగ్గించుకో
- అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ నేతల వైఖరి మారలేదు
- మంథనిలో అలజడి సృష్టించి లబ్ధిపొందాలనే నీ కుట్రలు సాగనివ్వం
- మంత్రి శ్రీధర్‌బాబుపై విమర్శలు సరికాదు
- మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తోట్ల తిరుపతి యాదవ్



**రామగిరి, జూన్ 10(ది క్రైమ్ న్యూస్):-** అధికారం కోల్పోయిన బిఆర్ఎస్ నేతల వైఖరి మారలేదని ప్రజలలోకి అసత్యాలు అబద్ధాలు తీసుకెళ్లే పనిలో పుట్ట మధు ఉన్నాడని రాజకీయం లబ్ధి కోసం ఇప్పటికీ భ్రమలలోకం నుంచి బయటకు రాలేకపోతున్నారని కాంగ్రెస్ పార్టీని ఏదో రకంగా బలహీనపరచాలని బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ప్రయత్నిస్తున్నారని మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ విమర్శించారు.మంత్రి శ్రీధర్‌బాబుపై పుట్ట మధు అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. మంథని నియోజకవర్గంలో పుట్ట మధు ప్రోత్సాహంతో రాజకీయ కక్ష సాధింపు చర్యలు కొనసాగుతున్నాయని మంత్రి శ్రీధర్ బాబు పై బురద జల్లడం పైనే దృష్టి పెట్టారని మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ ధ్వజమెత్తారు. రామగిరి మండలం సెంటినరి కాలనీ టౌన్‌లోని శ్రీపాద ఐఎన్టీయూసీ భవనంలో రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రొడ్డ బాపన్న ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తోట్ల తిరుపతి యాదవ్ మాట్లాడుతూ నిరు పేదల కోసం నిత్యం తప్పించే మంత్రి శ్రీధర్ బాబును విమర్శిస్తే ఊరుకునేది లేదని తోట్ల తిరుపతి యాదవ్ అన్నారు. ప్రజాక్షేత్రంలోకి వెళ్లి ప్రభుత్వ లోటుపాట్లను ఎత్తిచూపితే స్వాగతిస్తాం నిస్పృహతో కూడిన ప్రకటనలతో గందరగోళాన్ని సృష్టిస్తే ప్రజాప్రయోజనం ఉండదన్నారు. రాజకీయ పార్టీల గెలుపు ఓటములను ప్రజలే నిర్ణయిస్తారు వారి అభిమానం ఉన్నంతకాలమే ఏ రాజకీయ పక్షమైన కొనసాగుతుంది. మంథని ప్రజలు ఆదరించడం వల్లనే శ్రీధర్‌బాబు ఐదుసార్లు ఎమ్మెల్యేగా, రెండు సార్లు ఎమ్మెల్యే, విప్‌గా పని చేశారని, రాష్ట్ర ప్రభుత్వంలో కీల కంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. శ్రీనుబాబు ప్రతి గ్రామంలో ప్రజలకు సేవ చేయడంతో పాటు వారికి ఏ సమస్య వచ్చినా వెంట నిల బడుతున్నాడన్నారు. పుట్ట మధుకు రాజకీయ బిక్ష పెట్టింది శ్రీపాదరావు అనే విషయం మరిచి పోవద్దన్నారు.నిన్న మంథని మాజీ శాసనసభ్యుడు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పుట్ట మధుకర్. మా నాయకులు శ్రీధర్ బాబు మంథని నియోజకవర్గంలో శాసనసభ్యుడిగా, తెలంగాణ రాష్ట్ర మంత్రిగా రాష్ట్రానికి సంబంధించిన పనుల నిమిత్తం దేశంలోనే కాకుండా విదేశాల్లో కూడా తెలంగాణ రాష్ట్రానికి ఘనత తెచ్చే విధంగా, పేరు తెచ్చే విధంగా పని చేస్తూ ఉంటే, వారు చేస్తున్న పనిని జీర్ణించుకోలేక పుట్ట మధు నిన్న మాట్లాడిన తీరు యావత్ పెద్దపల్లి జిల్లాతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ కుటుంబ శ్రేణులందరినీ కలిచివేసింది.మేము చాలా సందర్భాల్లో "ఖబర్దార్ పుట్ట మధు" అని చెప్పాం. ఈ రోజు ఈ పత్రికా మిత్రుల సమావేశంలో కూడా చాలా మంది నాయకులు ఖబర్దార్ అని హెచ్చరించారు. "అరే", "ఒరే" అని అన్నారు. మేమే ఆ భాష వాడొద్దని, వాడకూడదని చాలా సందర్భాల్లో నేనే చెప్పడం జరిగింది. కానీ అది తప్పడం లేదు.మా వాళ్లు ఇంకా ఓపికతో మాట్లాడుతున్నట్టే. నేనైతే రెండు, మూడు సందర్భాల్లో చెప్పినా, నువ్వు "అరే" అంటే మేము కూడా అదే విధంగా మాట్లాడగలమని చెప్పాను. కానీ ఆ సంస్కృతి, ఆ సంస్కారం మాది కాదు. నీ పద్ధతి మార్చుకో అని నేనే స్వయంగా చెప్పాను. ఇంకా మా వాళ్లు ఓపికతో ఉండగా నువ్వు అంత పెద్ద నాయకులను "వాడు", "వీడు" అని సంబోధిస్తూ మాట్లాడుతావుంటే...మరో నాయకుడు, దేశ నాయకుడు రాహుల్ గాంధీ ని కూడా నువ్వు "వాడు" అని సంబోధిస్తే మంథని నియోజకవర్గ ప్రజలందరూ ఒక్కసారి ఆలోచన చేయాలి. అంటే శ్రీధర్ బాబు తో పాటు రాహుల్ గాంధీ ని కూడా "వాడు", "వీడు" అని అంటావంటే, మా నాయకులకు, మా కార్యకర్తలకు కూడా అదే భాష నేర్పిస్తున్నావు. ఆ భాషను మేము వాడొద్దని చాలా సందర్భాల్లో చెప్పాం.రాష్ట్ర ప్రజలందరూ చూస్తూనే ఉన్నారు.నువ్వు చేసిన పనులు, ఒకసారి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత నీ కుటుంబం చుట్టూ వచ్చిన అవినీతి, హత్యల ఆరోపణలతో ఈ ప్రాంతమంతా దద్దరిల్లిపోయింది. ఇసుక మాఫియా, మట్టి మాఫియా, హత్యలు ఇవన్నీ కూడా మంథని నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసు. స్వయంగా నీ మేనల్లుడే రిమాండ్‌లో పడ్డాడు. నీ కుటుంబానికి ఆ జంట హత్యలకు సంబంధించిన సంబంధం ఏదైతే ఉందో రాష్ట్ర ప్రజలందరూ గమనించారు. అలా నువ్వు చేసుకుంటూ పోయిన పనులు ఏవైతే ఉన్నాయో, నీ వెంట ఉన్న నాయకుడు, ఈ ప్రాంతానికి సంబంధించిన నాయకుడు అని చెప్పుకునే వ్యక్తి ఏదైతే ఉన్నాడో, పత్రికా మిత్రులందరూ కూడా ఆలోచించాలి.పత్రికా ముసుగులో చట్టం ఏదైతే పని చేస్తుందో, చట్టం ఎవరికీ చుట్టం కాదు. వారి పని వారు చేసుకుంటూ పోతా ఉన్నారు. దానిని మా నాయకుడికి అంటగట్టి, పోలీసు వాళ్లను కూడా ఇష్టమైన పదజాలంతో మాట్లాడుతున్నావు. నీ ఇంట్లో కూడా ఒక పోలీసు అధికారి ఉన్నాడు. ఆ పోలీసు అధికారిని కూడా అలాగే మాట్లాడితే నీకు ఏమనిపిస్తుంది? మధు శ్రీధర్ బాబుని, వారి కుటుంబ సభ్యులను, వారి సోదరుడు మా నాయకులు శ్రీను బాబు ని కూడా "జోకర్" అని మాట్లాడుతున్నావు. ఇందాక మా మిత్రులు సమ్మయ్య చెప్పినట్టుగా, జోకర్ అని నువ్వంటే, బ్రోకర్ అని విశ్లేషణ చేయాలని చెప్పిన విషయం ఏదైతే ఉందో, రాబోయే రోజుల్లో అది జరిగి తీరుతుంది.పైన కూడా "తథాస్తు" దేవతలు ఉంటారు. తథాస్తు అంటే అది జరిగి తీరుతుంది అని కూడా నువ్వు గమనించాలి.ముత్తారం మండలానికి సంబంధించిన కేసు విషయంలో పోలీసులు కావచ్చు, వారి కుటుంబ సభ్యులు కావచ్చు, ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు సమగ్ర విచారణ చేసి నిందితులను శిక్షించాలనే ఉద్దేశ్యంతో చట్టం ప్రకారం వారిని అరెస్ట్ చేసి కోర్టుకు తీసుకెళ్తే నీకంత ఉలుకు ఎందుకు వచ్చింది? న్యాయస్థానం బెయిల్ ఇచ్చింది కదా. బెయిల్ ఎందుకు ఇచ్చింది అని ప్రభుత్వం గానీ, మీరు ప్రతిపక్షంలో ఉన్నారని, మేము అధికార పక్షంలో ఉన్నామని చెప్పి మేమెక్కడా దాని గురించి ప్రస్తావించలేదు. చట్టం గానీ, న్యాయం గానీ, కోర్టులు గానీ వాటి పని అవి చేసుకుంటూ పోతాయి.ఆ సందర్భానికి సంబంధించిన విషయాన్ని మా నాయకులు శ్రీధర్ బాబు కి అంటగట్టి నువ్వు రాజకీయ లబ్ధి పొందే విధంగా ప్రయత్నం చేస్తున్నావు. నీకు రాజకీయాలు తప్ప ఇంకేమీ కనిపించడం లేదా? మంథనిని అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నారు శ్రీధర్ బాబు మంథని నియోజకవర్గంలో ఇంతకుముందు వచ్చిన మెజారిటీ కంటే రెండింతల మెజారిటీ వచ్చే పరిస్థితి ఉంది.దానిని నువ్వు జీర్ణించుకోలేక ఎక్కడ నాకు సమయం దొరుకుతుంది? ఎక్కడ నాకు శ్రీధర్ బాబుని తిట్టాలి? అని ఆలోచిస్తున్నావు. శ్రీధర్ బాబు ని తిట్టుకోవడం ఒక జపంలా మారిపోయింది.నీకు రేపు మాల తీసుకో, జపమాల తీసుకుని భగవంతుని సన్నిధిలో కూర్చొని జపం చేస్తే ప్రయోజనం కలుగుతుంది. ఇంకోసారి మా నాయకుడిని తిట్టే పరిస్థితి రాకూడదని మేమందరం ఆ భగవంతుడిని కోరుకుంటున్నాం. కాబట్టి రాబోయే రోజుల్లో కూడా మరెప్పుడైనా శ్రీధర్ బాబు జోలికి గానీ, మా శ్రీను బాబు జోలికి గానీ వస్తే ఖబర్దార్ పుట్ట మధు అని హెచ్చరిస్తున్నాం.ఈ రోజు మా మిత్రులందరూ కూడా సహనంతో, ఓపికతో ఉన్నారు. ఆ ఓపిక, సహనం కోల్పోయినట్లయితే నీ పుట్ట పగలడం ఖాయం. పుట్టలో చీమలు ఎలా బయటకు వస్తాయో, అలాగే మంథని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కుటుంబ శ్రేణులందరూ చీమల దండులా వచ్చి ఏమి చేస్తారో రాబోయే రోజుల్లో తెలుస్తుంది.కాబట్టి ఖబర్దార్ పుట్ట మధు అని హెచ్చరిస్తునాం ఇదేం పద్ధతి? ఇదేం రాజకీయం? మేం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇలానే చేశామా? అని బీఆర్ఎస్ నేతలను ఆయన ప్రశ్నించారు.ఈ కార్యక్రమంలో పన్నూర్ సర్పంచ్ చిందం మహేష్,సెంటినరి కాలనీ టౌన్ అధ్యక్షులు పెద్ది సమ్మయ్యమాజీ జడ్పీటీసీ ఎల్లే రామ్మూర్తి, మాజీ జడ్పీటీసీ మైదం వరప్రసాద్, మాజీ ఎంపీపీ ఆరెల్లి దేవక్క కొమురయ్య, సుందిళ్ల లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థాన చైర్మన్ కోర్ కొప్పుల సత్యనారాయణ గౌడ్,ధర్మకర్తల మండలి సభ్యుడు రేకుంట్ల రవి, నాగేపెల్లి మాజీ సర్పంచ్ తీగల సమ్మయ్య, కాలేశ్వరం దేవస్థానం డైరెక్టర్ కాటం సత్యం,రామగిరి మండల బీసీ సెల్ అధ్యక్షులు బండారి సదానందం,లద్నాపూర్ సర్పంచ్ వనం రామచంద్రావు, రాజాపూర్ సర్పంచ్ పుల్లల భాగ్యలక్ష్మి, కొమురయ్య, సుంద్గిల్ల సర్పంచ్ ముస్కుల నరేందర్ రెడ్డి, ఆదివారం పేట సర్పంచ్ ఇల్లందుల సంజీవ్, కొండవేన దివ్య సుధాకర్, కొలిపాక సారయ్య, గొల్లపల్లి రాయమల్లు, నాగపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు తీగల సదానందం, శ్రీరాముల కుమార్, గ్రామ శాఖ అధ్యక్షులు ఉప సర్పంచ్, లు మాజీ ప్రజాప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు అన్ని విభాగాల నాయకులు కార్యకర్తలు, పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

- రోడ్డున పడ్డ వ్యాపారులకు సింగరేణి షాపింగ్ కాంప్లెక్స్ లలో శాశ్వతంగా గదులు కేటాయించాలి
- స్వచ్ఛమైన తాగునీరు, ఉద్యోగాలు, మెడికల్ బోర్డు నిర్వహణపై కోరుకంటి చందర్ డిమాండ్

**గోదావరిఖని ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** సింగరేణి కార్మికులు, వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న తాగునీటి, ఉద్యోగ, వైద్య సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు కోరుకంటి చందర్ సింగరేణి ఆర్జీ-1 ఎస్ఓటు జిఎం కు వినతిపత్రం సమర్పించారు. కార్మికుల సంక్షేమాన్ని విస్మరిస్తూ సింగరేణి యాజమాన్యం వ్యవహరిస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కోరుకంటి చందర్ మాట్లాడుతూ, గోదావరిఖని పట్టణం లో హనుమాన్‌నగర్, శివాజీ నగర్ ప్రాంతాల్లో చిరు వ్యాపారస్తులు ఎంతోమంది జీవనం సాగిస్తుండగా వారిని కూల్చివేతల పేరిట అభివృద్ధి అనే అంశంపై రోడ్డుపాలు చేశారని ధ్వజమెత్తారు. దీంతో వీధిన పడ్డ వారికి స్థలంలో నిర్మాణాలు చేపట్టేందుకు అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూల్చివేసిన స్థలంలో సింగరేణి ఆధ్వర్యంలో నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ లో నిరాశ్రయులైన ఆ వ్యాపారులకు శాశ్వతంగా రూములు కేటాయించాలని డిమాండ్ చేశారు. సింగరేణి కార్మిక కాలనీలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులు రెండున్నర సంవత్సరాలుగా నత్తనడకన సాగుతున్నాయని విమర్శించారు. పనుల ఆలస్యం కారణంగా వేలాది కార్మిక కుటుంబాలకు నాణ్యమైన తాగునీరు అందకుండా పోతోందని అన్నారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి ప్రాజెక్టుల నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల ఆరోగ్యం, సంక్షేమం కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అలాగే గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో 10 ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేస్తామని గతంలో సింగరేణి యాజమాన్యం హామీ ఇచ్చిందని, అయితే కేవలం ఐదు ఆర్వో ప్లాంట్లతోనే సరిపెట్టిందని తెలిపారు. వాటిలో కూడా కొన్ని ప్లాంట్లు ప్రస్తుతం పనిచేయడం లేదని పేర్కొన్నారు. పని చేయని ఆర్వో ప్లాంట్లను వెంటనే మరమ్మతులు చేయించి తిరిగి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, ఇచ్చిన హామీ ప్రకారం మిగిలిన ఆర్వో ప్లాంట్లను కూడా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గోదావరి నది కాలుష్య నియంత్రణకు అత్యంత కీలకమైన సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మాణ పనులు కూడా ఆశించిన స్థాయిలో సాగడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గోదావరి నదిని పరిరక్షించేందుకు, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన నీటిని అందించేందుకు ఎస్టీపీ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కోరారు. ఇక కార్మికుల ఉద్యోగ సమస్యలపై మాట్లాడుతూ, మారుపేర్లతో ఉద్యోగాలు రాకపోవడం వల్ల అనేక కుటుంబాలు తీవ్ర ఆందోళనలో ఉన్నాయని చెప్పారు. విజిలెన్స్ విచారణల పేరిట కార్మిక కుటుంబాలను వేధించడం సరైన పద్ధతి కాదన్నారు. అర్హులైన వారందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుని ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న మెడికల్ బోర్డు సమావేశాలను వెంటనే నిర్వహించాలని, ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న కార్మికులకు ఉపశమనం కల్పించాలని కోరారు. సింగరేణి కార్మికులను గౌరవించి వారి కుటుంబాలకు భరోసా కల్పించే నిర్ణయాలు తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ తరఫున విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సింగరేణి యాజమాన్యం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల కారణంగా మొత్తం కోల్‌బెల్ట్ ప్రాంతంలో తీవ్ర అసంతృప్తి, అశాంతి నెలకొంటోందని కోరుకంటి చందర్ ఆరోపించారు. ఉద్యోగాల కల్పన, సంక్షేమ పథకాల అమలు, మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్య వైఖరి కారణంగా కార్మికుల్లో ఆగ్రహం పెరుగుతోందని అన్నారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం పరిస్థితి తీవ్రతను గుర్తించి ఉద్యోగాల కల్పనకు వేగంగా చర్యలు చేపట్టాలని, కార్మికుల్లో చెలరేగుతున్న అసంతృప్తిని తగ్గించేలా నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి యాజమాన్యం, ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సింగరేణి కార్మిక కాలనీల్లో నీటి సరఫరా వ్యవస్థ బలోపేతం, ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు, ఎస్టీపీ నిర్మాణాల వేగవంతం, ఉద్యోగాల కల్పన, మెడికల్ బోర్డు నిర్వహణ వంటి అంశాలపై సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుకంటి చందర్ స్పష్టం చేశారు.కార్యక్రమంలో నడిపెల్లి మురళీధర్ రావు.మేకల సమ్మయ్య.తోకల రమేష్.సారయ్య నాయక్.మహేష్.మెతుకు దేవరాజ్.బొడ్డుపెల్లి శ్రీనివాస్.నూతి తిరుపతి.చింటూ.శ్రవణ్. దొమ్మేటి వాసు.కిరణ్ జి.బాను ప్రసాద్.కవిత సరోజిని పాల్గొన్నారు.





# ఉద్యోగం ఇప్పిస్తానని ఘరానా మోసం



**భూపాలపల్లి, జూన్ - 11:(ది క్రైమ్ న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహా ముత్తారం మండలానికి చెందిన మేకల కాపరికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే మహాముత్తారం మండలం వజినపల్లి గ్రామానికి చెందిన ఆకుదారి అన్నపూర్ణ మేకల కాపరి (38) పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం పెద్దాపూర్ గ్రామానికి చెందిన పులి నరసయ్య అనే వ్యక్తి నాకు పరిచయం కాగా, మేకలను మేపుతే వచ్చే ఆదాయం సరిపోదని, నీకు ప్రభుత్వ పాఠశాలలో అటెండర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి, అమాయక రాలైన మేకల కాపరి కి మాయ మాటలు చెప్పి ఆమె నుండి 2 లక్షల 50 వేల రూపాయలను తీసుకోని మోసం చేసినట్లుగా బాధను వ్యక్తం చేసింది. గత 2023వ సంవత్సరములో తనకున్న 60 మేకలను మేపుతూ జీవిస్తూ కుటుంబ పోషణ చేసుకుంటున్న నేను మోసపోయానని తన ఆవేదన వ్యక్తం చేసింది.గత సంవత్సరం 2025 మే నెలలో కూడా కొంతమంది ప్రజా ప్రతినిధుల సమక్షంలో నీ డబ్బులు నీకు ఇస్తానని బాండు కాగితం రాసిచ్చినట్లుగా పేర్కొన్నది. డబ్బులు ఇస్తానని చెప్పి ఫోన్లు లిఫ్ట్ చేయకపోవడంతో ఆందోళన చెందుతున్నది. ప్రభుత్వం మరియు న్యాయవ్యవస్థ తనను ఆదుకోవాలని బాధితురాలు వేడుకుంది.

# కేంద్ర పథకాలు అమలు చేసేలా.. రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించండి

**గవర్నర్‌ను కోరిన ఎమ్మెల్సీ మల్క కొమరయ్య**

**22 కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రస్థావిస్తూ ప్రత్యేక విజ్ఞప్తి**



**హైదరాబాద్ (ది క్రైమ్ న్యూస్):** కేంద్రంలోని ప్రధాని మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలు తెలంగాణలో అమలు కావడం లేదని, వాటిని అమలు చేసేలా రాష్ట్ర సర్కారును ఆదేశించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాను కోరారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్సీ లోక్ భవన్ లో రాష్ట్ర గవర్నర్ ను కలిసి ప్రత్యేక విజ్ఞప్తి చేశారు. జల్ జీవన్ మిషన్, పీఎం సురక్షా బీమా యోజన, ఫసల్ బీమా, సాయిల్ హెల్త్ కార్డు సహా కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న దాదాపు 22 పథకాలను సీఎం రేవంత్ సర్కారు రాష్ట్ర స్థాయిలో సరిగా అమలు చేయడం లేదని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య గవర్నర్ దృష్టికి తీసుకువెళ్లారు. అతివృష్టి, అనావృష్టి సహా ప్రకృతి వైపరిత్యాలకు పంట నాశనమైతే.. రైతులకు పరిహారం అందేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఫసల్ బీమా యోజనను కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేయడం లేదని, తద్వారా అన్నదాతలకు నష్టం జరుగుతోందని ఎమ్మెల్సీ గవర్నర్ కు వివరించారు. ఈ సందర్భంగా కేంద్రం అమలు చేస్తున్న పథకాలన్నీ రాష్ట్రంలో పకడ్బందీగా అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని ఎమ్మెల్సీ గవర్నర్ కు రిప్రజెంటేషన్ ఇచ్చారు.

# ప్రైవేట్ స్కూళ్లలో ఐఐటి, జేఈఈ, నీట్, సివిల్స్ కోర్సులు బూటకం

**ఐసా విద్యార్థిసంఘం జిల్లాఅధ్యక్షురాలు బుర్ర స్వాతి**




**భూపాలపల్లి, జూన్ 11:(ది క్రైమ్ న్యూస్):** జిల్లాలో ప్రైవేట్ స్కూళ్లలో ఐఐటి జేఈఈ నీట్ సివిల్స్ లాంటి విద్య నేర్పిస్తామని చెప్పి గ్రామాలలో తిరుగుతూ పేద విద్యార్థుల తల్లిదండ్రుల అమాయకత్వాలను చూసి మాయ మాటలు చెప్పి, అధిక ఫీజులను దండుకునే ప్రైవేట్ స్కూల్స్ యజమానులపై చర్యలు తీసుకోవాలని, మోసపూరితమైన ఫ్లెక్సీలను తొలగించకపోతే పాఠశాలల ముందు పెద్ద ఎత్తున ఆందోళనకుదిగుతామని ఐసా విద్యార్థి సంఘంగ జిల్లా అధ్యక్షురాలు బుర్ర స్వాతి డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే ప్రైవేట్ స్కూల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని అనుమతులు ఉంటేనే వాడికి సంబంధించిన గుర్తింపు నెంబర్లను ఫ్లెక్సీ లలో పాంప్లెట్లలో పెట్టాలని అన్నారు. పేద విద్యార్థుల నుండి అధిక ఫీజులు వసూలు చేస్తామంటే సహించేదే లేదన్నారు. మాయ మాటలు చెప్పే ప్రైవేట్ స్కూల్స్ యజమాన్యాలపై విద్యాశాఖ అధికారి చర్యలు తీసుకోకపోతే ప్రత్యేక కమిటీలను వేసి అన్ని విద్యాసంఘాలను కూడగట్టుకొని పాఠశాలల ముందు ఆందోళన కార్యక్రమాలను చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో అక్షర జెస్సీ, అలేఖ్య మరియు తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాల సన్నద్ధత, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

## ● నగర మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్ టౌన్, జూన్11(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో శానిటేషన్ వింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొని వర్షాకాల ముందస్తు సన్నద్ధత, పారిశుధ్య నిర్వహణ, ప్రజారోగ్య పరిరక్షణకు సంబంధించి పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలోని ప్రధాన నాలాలు, అంతర్గత మురుగు కాలువలలో పూడికతీత పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. గతంలో వర్షాలకు నీరు నిలిచిన లోతట్టు ప్రాంతాలను గుర్తించి, అవసరమైన చోట శాశ్వత లేదా తాత్కాలిక మోటార్ పంపులను సిద్ధంగా ఉంచాలని సూచించారు. జేసీబీలు, పూడికతీత యంత్రాల లభ్యతపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలన్నారు.నగరంలో ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను విడివిడిగా సేకరించే విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని, స్వచ్ఛ ఆటోల పనితీరు మరియు రూట్ మ్యాపులను క్రమం తప్పకుండా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. సేకరించిన చెత్తను సకాలంలో డంపింగ్ యార్డుకు తరలించి, బయో మైనింగ్, కంపోస్టింగ్ పనులను వేగవంతం చేయాలని పేర్కొన్నారు.మార్కెట్లు, ప్రధాన కూడళ్లు, వాణిజ్య ప్రాంతాల్లో రాత్రి వేళల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పారిశుధ్య కార్మికులు, జవాన్లు, సూపర్‌వైజర్ల బయోమెట్రిక్ హాజరును కచ్చితంగా అమలు చేయాలని, వారికి గ్లోవ్స్, మాస్కులు, బూట్లు, రెయిన్‌కోట్లు వంటి రక్షణ పరికరాలను సకాలంలో అందజేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల నివారణకు యాంటీ లార్వా ఆపరేషన్లను మరింత విస్తృతంగా నిర్వహించాలని, నిల్వ నీటి ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయడం, గంబూసియా చేపలను వదలడం వంటి చర్యలను చేపట్టాలని సూచించారు. నగరంలోని అన్ని డివిజన్లలో వారానికొకసారి ఫాగింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తూ, వ్యాధి ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు.భారీ వర్షాలు, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు వార్డు, సర్కిల్ స్థాయిలో 'మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్స్' ఏర్పాటు చేయాలని, మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో 24 గంటలు పనిచేసే ప్రత్యేక కంట్రోల్ రూమ్, హెల్ప్‌లైన్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ప్రజల్లో స్వచ్ఛతపై మరింత అవగాహన పెంచేందుకు స్వయం సహాయక బృందాలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో మైక్ అనౌన్స్‌మెంట్లు నిర్వహించాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం, తడి-పొడి చెత్త వేరు చేయడం వంటి అంశాలపై విస్తృత ప్రచారం చేపట్టాలని పేర్కొన్నారు. రోడ్లపై, ఖాళీ స్థలాల్లో చెత్త వేస్తున్న వ్యాపార సంస్థలు, నివాసితులపై నిబంధనల ప్రకారం జరిమానాలు విధించి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.అదేవిధంగా శానిటేషన్ విభాగం ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఐదు డివిజన్లలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి డివిజన్‌లో పారిశుధ్య పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. నగరాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా ఉంచేందుకు ప్రతి అధికారి, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని మేయర్ కొలగాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ అధికారులు, శానిటేషన్ వింగ్ సిబ్బంది, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.



# 49 వ డివిజన్ కురుమవాడలో ఓపెన్ జిమ్ ప్రారంభించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్ టౌన్, జూన్11(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలోని 49వ డివిజన్ కురుమవాడ ప్రభుత్వ పాఠశాల సమీపంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సహకారంతో, సీఎస్ఆర్ నిధుల ద్వారా మలయప్ప ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రారంభించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు, యువతలో ఫిట్‌నెస్ పట్ల అవగాహన పెంపొందించేందుకు ఓపెన్ జిమ్‌లు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఆధునిక జీవనశైలిలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అత్యంత అవసరమని, అందుకోసం ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ వ్యాయామం చేయాలని సూచించారు.ప్రధానమంత్రి మోదీ "ఫిట్ ఇండియా" పిలుపుకు అనుగుణంగా ప్రజల్లో ఆరోగ్య చైతన్యం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ క్రీడలు, వ్యాయామంపై దృష్టి సారించాలని కోరారు.కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సహకారంతో నగరంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా కొనసాగుతున్నాయని మేయర్ పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతి డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనతో పాటు ఆరోగ్య, క్రీడా సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.సీఎస్ఆర్ నిధులను ప్రజా ప్రయోజనాలకు వినియోగిస్తూ సామాజిక బాధ్యతను నిర్వర్తిస్తున్న మలయప్ప ఫౌండేషన్ ప్రతినిధులను ఆయన అభినందించారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటు చేసిన ఈ ఓపెన్ జిమ్‌ను మహిళలు, యువకులు, వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ప్రజా ఆస్తులను పరిరక్షిస్తూ వాటిని సమర్థవంతంగా



వినియోగించుకోవాలని మేయర్ సూచించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు , స్థానిక కార్పొరేటర్ ఎన్నం లక్ష్మి ప్రకాష్ , కార్పొరేటర్లు కర్రె పద్మ అనిల్, గాజె రమ శివరామ్ , అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, డివిజన్ ప్రజలుపాల్గొన్నారు.

# గిరిజన అధికారులపై కక్షపూరిత దాడులు చేస్తే సహించం

● లంబాడీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే కుట్రలను తిప్పికొడతాం: డా. కరాటే రాజు నాయక్ ● తెలంగాణ లంబాడీల ఆత్మగౌరవ వేదిక ● ఓయూ జేఏసీ చైర్మన్

**హైదరాబాద్ (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత లంబాడీ సమాజానికి చెందిన ఉన్నతాధికారులు, ఉద్యోగులు, రైతులు, యువత పట్ల వివక్షపూరిత వైఖరి ప్రదర్శిస్తోందని తెలంగాణ లంబాడీల ఆత్మగౌరవ వేదిక, ఓయూ జేఏసీ చైర్మన్ డా. కరాటే రాజు నాయక్ ఆరోపించారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల వద్ద వివిధ గిరిజన, లంబాడీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ, లంబాడీ అధికారులపై వరుసగా ఏసీబీ దాడులు జరగడం గిరిజన సమాజంలో తీవ్ర ఆందోళనకు కారణమవుతోందన్నారు. అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవడాన్ని తాము వ్యతిరేకించడం లేదని, అయితే ఒకే వర్గానికి చెందిన అధికారులపై వరుస చర్యలు జరుగుతున్నాయనే భావన ప్రజల్లో బలపడుతోందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో లంబాడీ సమాజం ముందుండి పోరాడిందన్నారు. విద్యార్థులు, యువత, ఉద్యోగులు, రైతులు తమ వంతు త్యాగాలు చేసి తెలంగాణ ఆకాంక్షను సాకారం చేయడంలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. రాష్ట్ర ఏర్పాటుకు ముందు నుండి నేటి వరకు పరిపాలన, విద్య, వైద్యం, ఇంజనీరింగ్, పోలీస్, రెవెన్యూ తదితర రంగాల్లో వేలాది మంది లంబాడీ అధికారులు, ఉద్యోగులు రాష్ట్ర అభివృద్ధికి విశేష సేవలు అందించారని తెలిపారు. అలాంటి సమాజానికి ఈరోజు దక్కాల్సింది గౌరవం, గుర్తింపు, ప్రాధాన్యం. కానీ జరుగుతున్నది మాత్రం అవమానం, అనుమానం, వివక్ష అనే భావన గిరిజన సమాజంలో బలపడుతోందన్నారు. తెలంగాణ నిర్మాణంలో భాగస్వాములైన లంబాడీలను అనుమానితులుగా చిత్రీకరించే పరిస్థితులు రావడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం అధికారంలోకి రావడంలో లంబాడీ సమాజం కీలక పాత్ర పోషించిందన్నారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత అత్యధిక జనాభా కలిగిన లంబాడీ సమాజానికి మంత్రి పదవి ఇవ్వకపోవడం, గిరిజన సంక్షేమానికి తగిన ప్రాధాన్యం కల్పించకపోవడం, లంబాడీల సమస్యలను నిర్లక్ష్యం చేయడం బాధాకరమన్నారు. లాగచర్ల ప్రాంతంలో లంబాడీ రైతుల భూముల సమస్యల నుండి ప్రారంభమైన వివాదాలు నేటికీ కొనసాగుతున్నాయని, లంబాడీ సమాజానికి చెందిన పలువురు ఉన్నతాధికారులు వరుస విచారణలు, దాడులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. దీనివల్ల లంబాడీల ఆత్మగౌరవం దెబ్బతింటోందనే ఆందోళన సమాజంలో వ్యక్తమవుతోందన్నారు. లంబాడీ సమాజానికి తగిన బడ్జెట్ కేటాయింపులు లేకపోవడం, కార్పొరేషన్‌లలో ఖాళీలను భర్తీ చేయకపోవడం, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో నిర్లక్ష్యం, రైతులకు ఇచ్చిన హామీల అమలులో వైఫల్యం, ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి సంబంధించిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడం వంటి అంశాలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంలో ఉన్న గిరిజన ప్రజాప్రతినిధులు, లంబాడీ నాయకులు కూడా తమ మౌనం వీడాలని ఆయన కోరారు. సమాజం ఆత్మగౌరవం దెబ్బతింటున్న సమయంలో పదవుల కోసం మౌనం పాటించడం నాయకత్వ లక్షణం కాదన్నారు. గిరిజన ప్రజల ఓట్లతో గెలిచిన నాయకులు తమ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలపై స్పష్టమైన వైఖరి ప్రకటించాలని డిమాండ్ చేశారు. మేము మరోసారి స్పష్టం చేస్తున్నాము. అవినీతి చేసిన వారిపై చర్యలు తీసుకోవడాన్ని మేము వ్యతిరేకించడం లేదు. కానీ చట్ట అమలు పేరుతో ఒక వర్గాన్ని మాత్రమే లక్ష్యంగా చేసుకున్నారనే భావన కలిగించే చర్యలు ప్రభుత్వ విశ్వసనీయతను దెబ్బతీస్తాయి. గిరిజన అధికారులు, ఉద్యోగులపై జరుగుతున్న దాడులపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాము. లంబాడీలు ఈ రాష్ట్రానికి భారం కాదు. తెలంగాణ నిర్మాణంలో భాగస్వాములు. ఈ రాష్ట్ర అభివృద్ధికి తమ చెమట, శ్రమ, ప్రతిభతో తోడ్పడ్డారు. అలాంటి సమాజ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ఏ ప్రయత్నాన్నైనా ప్రజాస్వామ్య పద్ధతుల్లో బలంగా ఎదుర్కొంటామని హెచ్చరిస్తున్నాము. గిరిజనులు, లంబాడీల హక్కులు, గౌరవం, రాజకీయ ప్రాతినిధ్యం కోసం తమ పోరాటం కొనసాగుతుందని, అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణ చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన చైతన్య వేదిక ఓయూ జేఏసీ నాయకులు నెహ్రూ నాయక్, అల్ ఇండియా ట్రైబల్ జేఏసీ నాయకుడు రవీందర్ నాయక్, గిరిజన శక్తి అధ్యక్షుడు సుబ్బు నాయక్, విజయ్ నాయక్, సురేష్ నాయక్, ధారావత్ నాయక్, నరేష్ నాయక్, భాస్కర్ నాయక్, గోపి నాయక్ తదితర గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# మీకు డయాబెటిస్ ఉందా..? రోజుకు రెండుసార్లు ఇలాంటి టీ తాగండి చాలు..!

పాలు, చక్కెర కలిపి తయారు చేసిన టీ తాగటం మానేస్తే మంచిదని ఆరోగ్య నిపుణులు చెబుతున్న మాట. కానీ, దయాబెటిక్ పేషెంట్లు టీ ఎలా తాగాలో ప్రత్యేకించి చెబుతున్నారు. మధుమేహ వ్యాధిగ్రస్తులు తమ డైట్ విషయంలో ఎల్లప్పుడూ జాగ్రత్తగా ఉండాలని చెబుతున్నారు. షుగర్ లెవల్స్ మెయింటెయిన్ చేయడం తప్పనిసరి అంటున్నారు. షుగర్ బాధితులు దూరంగా ఉండాల్సిన ఆహారాల్లో టీ కూడా ఒకటి. ఇందులో పాలు, పంచదార ఉన్నందున దీనిని నివారించడం మంచిదని చెబుతున్నారు.. కానీ, దయాబెటిక్ పేషెంట్లు ఎలాంటి టీ తాగితే మేలు చేస్తుందో ఇక్కడ తెలుసుకుందాం..

1. గ్రీన్ టీ మధుమేహ వ్యాధిగ్రస్తులకు అత్యంత ఆరోగ్యకరమైన టీలలో గ్రీన్ టీ ఒకటి. గ్రీన్ టీలోనిపాలీఫెనాల్స్ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడతాయి. అంతే కాదు, గ్రీన్ టీలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి మేలు చేస్తాయి.

2.దాల్చిన చెక్క టీ దాల్చిన చెక్క టీ మధుమేహాన్ని నియంత్రించడంలో ఉత్తమమైనది. దాల్చినచెక్క రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడానికి, ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. దాల్చిన చెక్క టీ చేయడానికి, ఒక కప్పు నీటిలో దాల్చిన చెక్క చిన్న ముక్క వేసి



కాసేపు మరగనివ్వాలి. ఆ తర్వాత టీకి బదులుగా తాగేయాలి.

3. మెంతి టీ డయాబెటిక్ బాధితులకు మెంతి టీ మరొక గొప్ప ఎంపిక. మెంతులలో ఫైబర్ ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర శోషణను తగ్గిస్తుంది. మెంతి టీ చేయడానికి, ఒక కప్పు వేడి నీటిలో ఒక చెంచా మెంతులు వేసి 10 నిమిషాలు అలాగే పక్కన పెట్టి తాగేయండి. రుచి కోసం కావాలంటే మీరు నిమ్మరసం కూడా యాడ్ చేసుకోవచ్చు.

4. వాముతో తయారు చేసిన టీ వాము జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. వాము టీ తయారు చేయడానికి ఒక గ్లాస్ నీటిలో పావు చెంచా వాము వేసి 5 నిమిషాలు మరిగించండి. కాస్త ఆ తర్వాత వడకట్టి తాగాలి.

5. తులసి టీ తులసి టీలో యాంటీఆక్సిడెంట్లు కూడా పుష్కలంగా ఉంటాయి. రోగనిరోధక శక్తిని పెంచే గుణాలు కూడా ఇందులో ఉన్నాయి. తులసి ఆకులు హైపోగ్లైసీమిక్ ప్రభావాలను కలిగి ఉన్నాయని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గిస్తుంది. దీని కోసం, ఒక కప్పు వేడి నీటిలో కొన్ని తులసి ఆకులను వేసి 5 నిమిషాలు మూత పెట్టి పక్కన పెట్టుకోవాలి. ఆ తర్వాత రుచి కోసం కొంచెం తేనె కలుపుకుని తాగేయొచ్చు. చివరగా, మధుమేహులు ఇలాంటి టీ తాగుతున్నప్పుడు దానికి చక్కెర, లేదా తేనె కలుపుకోవడం మంచిదికాదు. రుచి కోసం కావాలంటే మీరు దాల్చినచెక్క పొడి లేదా ఏలకుల పొడి వేసుకుని తాగొచ్చు. మరీ ముఖ్యంగా ఇలాంటి ఇంటి చిట్కాలు, ఆయుర్వేద మందులు వాడే ముందు..మీరు మీ వైద్యుడిని సంప్రదించండి. దీనితో పాటు, ఆరోగ్యకరమైన ఆహారం, క్రమం తప్పకుండా వ్యాయామం, వైద్యుల సలహాలను అనుసరించడం చాలా ముఖ్యం.

# ఇలాంటి ఛాతీ నొప్పిని నమ్మితే డేంజర్..!

## అది ప్రాణాంతక గుండె జబ్బులకు సంకేతం కావొచ్చు..!



హార్ట్ ఎటాక్, గుండెపోటు ప్రస్తుతం ఇలాంటి ప్రజల్ని ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఈ రోజుల్లో చాలా మంది గుండె సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారు. కానీ, మన శరీరంలో ఈ గుండె సంబంధిత వ్యాధులకు సంబంధించిన కొన్ని సంకేతాలు ముందుగానే కనిపిస్తాయని, వాటిని మనం పెద్దగా పట్టించుకోకపోవటం వల్లే గుండెపోటు, స్ట్రోక్ ప్రమాదాలు, మరణాలు సంభవిస్తున్నాయంటున్నారు ఆరోగ్య నిపుణులు. కానీ, గుండెపోటు, స్ట్రోక్ ప్రమాదాలకు ముందు కనిపించే లక్షణాలు, సంకేతాలలో ఛాతీ నొప్పి ఒకటి. అయితే, మనలో చాలా మందికి ఛాతీ నొప్పి అనిపిస్తుంది.. కానీ, కొన్ని రకాల చాతీ నొప్పి ప్రమాదం అంటున్నారు నిపుణులు. ఇలాంటి చాతి నొప్పి కొన్నిసార్లు అకస్మాత్తుగా చాలా తీవ్రంగా మారుతుంది. ఆ తర్వాత తగ్గిపోతుంది. అలాగే, కొన్నిసార్లు ఇది తక్కువ వ్యవధిలో జరుగుతుంది. తేలికపాటిగా వచ్చిపోతుంది.. నొప్పితో పాటు, కొందరికీ ఛాతీలో మంటగా అనిపిస్తుంది. అయితే, కొన్ని రకాల ఛాతీ నొప్పి గుండె జబ్బులకు సంకేతం కావచ్చు.. దానిని విస్మరిస్తే అది ప్రాణాలకే ప్రమాదం అవుతుంది. ప్రస్తుతం గుండె సంబంధిత వ్యాధుల కేసులు వేగంగా పెరుగుతున్నాయి. గుండె జబ్బుల విషయంలో శరీరంలో కొన్ని సంకేతాలు కనిపిస్తాయి. ఈ సంకేతాలను గుర్తించడం ద్వారా సమయానికి మిమ్మల్ని మీరు రక్షించుకోవచ్చునని నిపుణులు చెబుతున్నారు.. అందులో భరించలేనంతగా వచ్చే ఛాతీ నొప్పి చిన్నదే. దీంతో పెద్దగా ముప్పు ఏమీ ఉండదు. కానీ కొన్ని సందర్భాల్లో నొప్పి మెడ, దవడకు, తరువాత వెనుకకు లేదా కిందకి, ఒకటి లేదా రెండు చేతులకు వ్యాపిస్తుంది. మీరు ఈ రకమైన నొప్పిని అనుభవిస్తున్నట్లయితే, దానిని అస్సలు విస్మరించకూడదని వైద్య ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ఎందుకంటే ఈ నొప్పి గుండె సంబంధిత సమస్యలకు ప్రత్యక్ష కారణం కావచ్చునని చెబుతున్నారు. వీటిని నిర్లక్ష్యం చేయడం వల్ల గుండెపోటు, పక్షవాతం వచ్చే ప్రమాదం ఉంది. అటువంటి పరిస్థితిలో, వివిధ రకాల ఛాతీ నొప్పి, దానితో సంబంధం ఉన్న వ్యాధుల గురించి తెలుసుకోవడం చాలా ముఖ్యం. గుండె సంబంధిత ఛాతీ నొప్పి.. నిపుణుల ప్రకారం.. ఛాతీ నొప్పి సాధారణంగా గుండె జబ్బులతో ముడిపడి ఉంటుంది. అయితే గుండె జబ్బులు ఉన్న చాలా మంది వ్యక్తులు తేలికపాటి అసౌకర్యాన్ని అనుభవిస్తుంటారు. వారు వాస్తవానికి నొప్పిని వర్ణించలేరు. అటువంటి పరిస్థితిలో గుండెపోటు లేదా ఏదైనా ఇతర గుండె సమస్య కారణంగా ఛాతీ అసౌకర్యానికి గురవుతుంటారు. ఈ క్రింది లక్షణాలు ఉంటే విస్మరించకండి.. వికారం లేదా వాంతులు చల్లని చెమట శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది. గుండె వేగంగా కొట్టుకుంటుంది మైకము లేదా బలహీనత ఛాతీలో ఒత్తిడి, భారం, దహనం లేదా బిగుతు వెన్ను, మెడ, దవడ, భుజాలు, ఒకటి లేదా రెండు చేతులను నలిపివేస్తున్నట్టుగా, కత్తితో పొడిచేస్తున్నట్టుగా నొప్పి నొప్పి కొన్ని నిమిషాల కంటే ఎక్కువ ఉంటుంది. చర్యతో మరింత తీవ్రమవుతుంది, కొంతకాలం తర్వాత వెళ్లి తిరిగి వస్తుంది. ఇతర రకాల ఛాతీ నొప్పి.. ఛాతీలో నొప్పి గుండెకు సంబంధించినదా లేక మరేదైనా కారణమా అని చెప్పడం కష్టం. అటువంటి పరిస్థితిలో మీరు దానిని గుర్తించడం ద్వారా నొప్పిని గుర్తించవచ్చు. సాధారణంగా, మీరు ఈ క్రింది లక్షణాలను అనుభవిస్తే గుండె సమస్య కారణంగా ఛాతీ నొప్పి వచ్చే అవకాశం తక్కువగా ఉంటుంది. మింగడానికి ఇబ్బందిగా ఉంటుంది. నొప్పి ఎక్కువ సమయం ఉంటుంది. మీరు మీ శరీర స్థితిని మార్చినప్పుడు తగ్గిపోవటం గానీ, లేదంటే మరింత తీవ్రంగా గానీ, మారుతుంది. పుల్లని రుచి లేదా ఆహారం నోటిలోకి తిరిగి రావడం గుండెల్లో మంట క్లాసిక్ లక్షణాలు రొమ్ము ఎముక వెనుక బాధాకరమైన, మండే అనుభూతి కలుగుతుంది. గుండె లేదా కడుపు సమస్యల వల్ల సంభవించవచ్చు.

# మాంసాహారం ఎక్కువగా తినేవారిలో ఈ క్యాన్సర్ ముప్పు ఎక్కువ!



మాంసం తినేవారికి కొలొరెక్టల్ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉందని తాజా అధ్యయనంలో వెల్లడైంది. కొలొరెక్టల్ క్యాన్సర్ ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మంది ప్రజలను ప్రభావితం చేసే ఒక ముఖ్యమైన సవాలు, వైద్య పరిశోధకులు ఆందోళన చెందుతున్నారు. పెద్దప్రేగు క్యాన్సర్ జీర్ణవ్యవస్థలోని ప్రధాన అవయవాలను ప్రభావితం చేస్తుంది. ఇది పోషకాలను గ్రహించడంలో, కడుపు నుండి వ్యర్థాలను తొలగించడంలో జోక్యం చేసుకుంటుంది. కొన్ని ప్రమాద కారకాలు ఈ క్యాన్సర్‌తో సంబంధం కలిగి ఉంటాయి. మాంసాహారం ఎక్కువగా తినడం వల్ల పెద్దపేగు క్యాన్సర్ కూడా వస్తుంది. తగినంత వ్యాయామం చేయకపోవడం, స్థూలకాయంగా ఉండటం, ఆల్కహాల్ లేదా పొగాకు తాగడం, పండ్లు, కూరగాయలు తక్కువగా ఉన్న ఆహారం తీసుకోవడం, ఫైబర్, కొవ్వు అధికంగా ఉన్న ఆహారం తీసుకోవడం వంటివి పెద్దప్రేగు క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతాయి. ముఖ్యంగా రెడ్ మీట్ లేదా ప్రాసెస్ చేసిన మాంసాన్ని దీర్ఘకాలికంగా తీసుకోవడం వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. మాంసాలను అధిక ఉష్ణోగ్రతల వద్ద వండినప్పుడు, అవి క్యాన్సర్ కారక రసాయనాలను ఉత్పత్తి చేస్తాయి. సమతుల్య ఆహారం, వ్యాయామం, ఆరోగ్యకరమైన శరీర బరువును నిర్వహించడం, ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండటం వంటి ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించడం ద్వారా పెద్దప్రేగు క్యాన్సర్‌ను నివారించవచ్చు. పెద్దప్రేగు క్యాన్సర్ లక్షణాలు: మలబద్ధకం, విరేచనాలు, మలంలో రక్తం, మలవిసర్జన సమయంలో కడుపునొప్పి, రక్తహీనత, అలసట, బరువు తగ్గడం వంటివి పట్టించుకోవద్దని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పెద్దప్రేగు క్యాన్సర్ లక్షణాలను అర్థం చేసుకోవడం ద్వారా, వ్యాధిని ముందస్తుగా గుర్తించి చికిత్స చేయడం ద్వారా ప్రమాద తీవ్రతను తగ్గించవచ్చు.

# పుచ్చగింజల్ని వృద్ధాగా పారేస్తున్నారా? ఈ విషయం తెలిస్తే భద్రంగా దాచేస్తారు..

వేసవిలో పుచ్చకాయలు పుష్కలంగా అందుబాటులో ఉంటాయి. రుచితోపాటు వేసవి తాపాన్ని నివారించడంలో పుచ్చకాయలు ఉపయోగపడతాయి. అయితే పుచ్చ కాయ విత్తనాలు వృద్ధాగా పారేస్తున్నారా? ఇకపై అలా చేయకండి. ఎందుకంటే పుచ్చకాయ మాదిరిగానే దాని గింజల్లో కూడా ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. పుచ్చకాయ గింజలను బయటకు తీసి నీటితో బాగా శుభ్రం చేయాలి. తర్వాత వీటిని పొట్టు తీసి ఎండలో బాగా ఆరబెట్టాలి. ఒలిచిన పుచ్చకాయ గింజలు కూడా మార్కెట్‌లో దొరుకుతాయి. జర్నల్ ఆఫ్ ఫార్మాకోగ్నోసి అండ్ ఫైటోకెమిస్ట్రీలో ప్రచురించబడిన పరిశోధన ప్రకారం.. పుచ్చకాయ విత్తనాలను (క్షయవ్యాధి) చికిత్సలో ఉపయోగిస్తారు. ఊపిరితిత్తులలో బ్యాక్టీరియా చేరడం వల్ల దగ్గు సంభవిస్తుంది. మీకు కూడా దగ్గు ఉంటే ఈ గింజలు తీసుకోవచ్చు. మధుమేహ వ్యాధిగ్రస్తులకు కూడా పుచ్చ విత్తనాలు ఎంతో మేలు చేస్తాయి. పుచ్చకాయ గింజలు మూత్రపిండాలను ఆరోగ్యంగా ఉంచడంలోనూ సహాయపడతాయని అధ్యయనాలు చెబుతున్నాయి. కిడ్నీలలో ఏర్పడే రాళ్లను నియంత్రిస్తుంది. మూత్రపిండాలపై ఒత్తిడిని నివారిస్తుంది. పుచ్చకాయ గింజల్లో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. ఈ పండు గింజలు గుండెను ఆరోగ్యంగా ఉంచడానికి కూడా సహాయపడతాయి.

# రైల్వే శాఖ షాకింగ్ నిర్ణయం..

## రూ. 30వేల కోట్ల వందేభారత్ రైళ్ల టెండర్ రద్దు..



దేశంలో ప్రముఖ రవాణా సాధనమైన రైల్వేను మరింత అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దానిలో భాగంగా నూతనంగా వందేభారత్ రైళ్లను నడుపుతోంది. వీటిని మరింత గా ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రణాళిక రూపొందించింది. దీనిలో భాగంగా వంద వందే భారత్ రైళ్ల తయారీకి ఆల్‌స్టోమ్ ఇండియా కంపెనీతో గతంలో ఒప్పదం కుదుర్చుకుంది. కానీ ఈ 30 వేల కోట్ల టెండర్ ను ఇటీవల భారతీయ రైల్వే రద్దు చేసుకుంది. ఈ నిర్ణయం వెనుక అనేక కారణాలు ఉన్నాయి. ఒక్కో రైలుకు రూ.150.9 కోట్ల బిడ్.. వందే భారత్ రైళ్ల కోసం 2023 మే 30వ తేదీన తెరిచిన టెండర్లలో ఆల్‌స్టోమ్ కంపెనీ అత్యల్ప బిడ్డర్ గా నిలిచింది. ఈ కంపెనీ ఒక్కో రైలు తయారీకి రూ.150.9 కోట్ల బిడ్ వేసింది. అయితే ఈ ధర ఎక్కువగా ఉందని రూ.140 కోట్లకు తగ్గించుకోవాలని రైల్వే కోరింది. కానీ రూ.145 కోట్లకు ఒప్పందం కుదుర్చుకోవాలని ఆ కంపెనీ భావిస్తోంది. ఈ నేపథ్యంలో ధర ఎక్కువగా ఉండడంతో రైల్వే ఈ రూ. 30 వేల కోట్ల టెండర్ ను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. వంద వందే భారత్ అల్యూమినియం బాడీ రైళ్ల తయారీతో పాటు నిర్వహణ కోసం ఈ టెండర్ ను వేశారు. రద్దు విషయం నిజమే.. భారతీయ రైల్వే టెండర్ ను రద్దు చేసుకున్న విషయాన్ని ఆల్‌స్టోమ్ ఎండీ ఒలివియర్ లోయిసన్ ధ్రువీకరించారు. ఆర్డర్‌ను రద్దు చేసినప్పటికీ భవిష్యత్తులో అవసరమైతే మద్దతు ఇవ్వడానికి తమ కంపెనీ సిద్ధంగా ఉందని తెలిపారు. ఒక్కో రైలుకు ఈ కంపెనీ వేసిన రూ.150.9 కోట్ల ధర ఎక్కువగా ఉందని రైల్వే టెండర్ ప్యానెల్ గుర్తించింది. దాన్ని రూ. 140 కోట్లకు పరిమితం చేయాలని కోరింది. అయితే ఒక్కో రైలు సెట్‌కు రూ.145 కోట్లతో ఒప్పందం కుదుర్చుకోవాలని ఆల్ స్టోమ్ భావించింది. రైల్వే తెరిచిన రూ. 30వేల కోట్ల టెండర్‌కు వీరిదే అత్యల్ప బిడ్. మరో బిడ్ అయిన స్విస్ తయారీదారు స్టాడ్లర్ రైల్, హైదరాబాద్‌కు చెందిన మేధా సర్వో డ్రైవ్‌లతో కూడిన కన్సార్టియం ఒక్కో రైలు సెట్‌కు రూ. 170 కోట్ల బిడ్ వేసింది. గతంలో ఇలా.. గతంలో 200 వందే భారత్ స్లీపర్ ట్రైన్ సెట్‌ల తయారీకి ఒక రేక్‌కు రూ. 120 చొప్పున గతంలో కాంట్రాక్ట్ మంజూరు చేసినట్లు రైల్వే అధికారి తెలిపారు. ప్రస్తుతం ఉన్న బిడ్ లో ఈ ధర ఎక్కువగా ఉందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో మరోసారి టెండర్ వేయాలని నిర్ణయం తీసుకున్నారు. దీని కోసం కొన్ని నిబంధనలను సవరించనున్నారు. గతంలో మాదిరిగా కేవలం రెండు కంపెనీలే కాకుండా ఈసారి ఎక్కువ కంపెనీలు పాల్గొనేలా చర్యలు తీసుకుంటారని సమాచారం. అర్హతలు.. టెండర్ కు వచ్చే కంపెనీలకు కొన్ని అర్హతలు ఉండాలి. అవి ఏడాదికి కనీసం ఐదు రైలుసెట్లను తయారు చేయగలిగే సామర్థ్యం కలిగి ఉండాలి. ఇందుకోసం వాటికి పరిశోధన మరియు అభివృద్ధి సౌకర్యం అవసరం. రైల్వే క్లాంట్రాక్ట్ ప్రకారం.. ఏడు సంవత్సరాలలోపు వంద రైలు సెట్టు డెలివరీ చేయాలి. గెలిచిన బిడ్డర్ డెలివరీ తర్వాత రూ.13 వేల కోట్లు అందుకుంటారు. ఆ తర్వాత 35 ఏళ్ల పాటు నిర్వహణ కోసం అదనపు రూ.17 వేల కోట్లు అందిస్తారు. హర్యానాలోని సోనేపట్ లో ఈ రైళ్లను తయారు చేయాలి.

# ఆ బ్యాంకుల్లో లోన్లు తీసుకున్న వారికి షాక్!



మరింత భారం కానున్న ఈఎంఐ.. పూర్తి వివరాలు.. మన దేశంలో వివిధ రుణాలపై వడ్డీ రేట్లు పెరగనున్నాయి. బ్యాంకులు ఈ మేరకు తమ రేట్లను సవరించాయి. దేశంలోని ప్రముఖ బ్యాంకులు అయిన బ్యాంక్ ఆఫ్ బరోడా, యూకో బ్యాక్, కెనరా బ్యాంక్ వంటివి ఇప్పటికే తమ బ్యాంకుల్లో మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్లు(ఎంసీఎల్ఆర్)ను పెంచుతున్నట్లు ప్రకటించాయి. ఆగస్టు 12 నుంచి ఈ సవరించిన రేట్లు అమలులోకి వచ్చాయి. ఇప్పటికే ప్రముఖ బ్యాంకింగ్ దిగ్గజమైన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ)తో పాటు పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా వంటి సంస్థలు ఎంసీఎల్ఆర్ ను పెంచాయి. ఈ క్రమంలో రుణ గ్రహీతలపై భారం ఎలా ఉంటుంది? ఏ బ్యాంకు ఎంత మేర ఎంసీఎల్ఆర్‌ను పెంచింది? తెలుసుకుందాం రండి.. కారణం ఇదే.. ఆగస్టు 8న జరిగిన సమావేశంలో ఆర్‌బీఐ మానిటరీ పాలసీ నేపథ్యంలో రెపో రేటును 6.50 శాతం వద్ద కొనసాగించింది. దానిలో ఎటువంటి మార్పు చేయలేదు. దీంతో బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) , కెనరా బ్యాంక్, యూకో బ్యాంక్లు ఎంసీఎల్ఆర్ ను పెంచుతున్నట్లు గత శుక్రవారం ప్రకటించాయి. బ్యాంక్ ఆఫ్ బరోడా.. ఆగస్టు 12 నుంచి అమలులోకి వచ్చేటటువంటి నిర్దిష్ట అవధులపై 5 బేసిస్ పాయింట్ల మేర ఎంసీఎల్ఆర్ పెంచాలని బీఓబీ నిర్ణయించింది. ఈ పెరుగుదల తర్వాత ఎంసీఎల్ఆర్ రేటు ఆరునెలలకు 8.75 శాతం, ఒక సంవత్సరానికి 8.95 శాతం ఉంటుంది. కెనరా బ్యాంక్.. ఈ బ్యాంక్ కూడా తన ఎంసీఎల్ఆర్ ను ఆగస్టు 12 నుంచి 5 బేసిస్ పాయింట్లు పెంచాలని నిర్ణయించింది. ఈ పెరుగుదల తరువాత.. ఆరు నెలల ఎంసీఎల్ఆర్ 8.80, ఒక సంవత్సరానికి 9 శాతం అవుతుంది. యూకో బ్యాంక్.. దీనిలో కొత్త రేట్లు ఆగస్టు 10 నుంచి అమలులోకి వచ్చాయి. నిర్దిష్ట కాలపరిమితిపై 5 బేసిస్ పాయింట్ల మేర ఎంసీఎల్ఆర్ ను పెంచాలని బ్యాంక్ నిర్ణయించింది. సవరించిన ఆరు నెలల, ఒక సంవత్సరం ఎంసీఎల్ఆర్ వరుసగా 8.80 శాతం, 8.95 శాతంగా ఉంది. ఫ్లోటింగ్ రేట్ ఉన్న వారికి.. ఇప్పటికే రుణాలు కలిగి ఉన్న వారిపై ఈ చర్య కారణంగా ఈఎంఐ భారం పెరగనుంది. అయితే ఫిక్స్ డ్ వడ్డీ ఉంటే ఎలాంటి ఇబ్బంది లేదు. అయితే ఫ్లోటింగ్ రేట్ ఆఫ్ ఇంటరెస్ట్ పై లోన్ తీసుకున్న వారిపై ఈ భారం పడనుంది. ఈ బ్యాంకులు ఇప్పటికే.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గత నెలలోనే ఎంసీఎల్ఆర్ రేటును 5–10 బేసిస్ పాయింట్లు పెంచింది. దీనిలో ప్రస్తుతం ఆరు నెలల ఎంసీఎల్ఆర్ 8.75 శాతం, ఏడాదికి 8.85 శాతం వద్ద ఉన్నాయి. ఈ నెల ప్రారంభంలో, పంజాబ్ నేషనల్ బ్యాంక్ కూడా తన ఎంసీఎల్ఆర్ 5 బేసిస్ పాయింట్లు పెంచింది. ప్రస్తుతం ఆరు నెలల ఎంసీఎల్ఆర్ 8.75 శాతం, ఏడాదికి 8.90 శాతంగా ఉంది. అలాగే బ్యాంక్ ఆఫ్ ఇండియా తన ఒక సంవత్సరం ఎంసీఎల్ఆర్ ని ఆగస్టు 1 నుంచి 5 బేసిస్ పాయింట్లు పెంచి 8.95 శాతానికి పెంచింది. ఇండియన్ బ్యాంక్ తన ఓవర్‌నైట్ తో పాటు ఒక నెల ఎంసీఎల్ఆర్ ని ఒక్కొక్కటి 5 బేసిస్ పాయింట్లు పెంచి వరుసగా 8.20 శాతం, 8.45 శాతానికి పెంచింది. ఇవి ఆగస్ట్ 3 నుంచి అమలులోకి వచ్చాయి.

## నెలకు రూ. 1లక్ష పెన్షన్ కావాలా? ఇలా చేస్తే.. సాధ్యమే..



మన దేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన పెన్షన్ పథకాలలో నేషనల్ పెన్షన్ సిస్టమ్(ఎన్‌పీఎస్) ఒకటి. దీనిలోని ఫీచర్లు, ప్రయోజనాలు అందరినీ ఆకర్షిస్తాయి. వాస్తవానికి ఇది ప్రభుత్వ ఉద్యోగుల కోసం ప్రారంభించిన పథకం. అయితే ఆ తర్వాత ఇది వేగంగా అప్ డేట్ అవుతూ విస్తరించింది. ఈ పథకాన్ని 2004లో ప్రవేశపెట్టారు. ఎస్పీఎస్ సాయిధ దళాల్లోని వారిని మినహాయించి, మిగిలిన ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే వర్తిస్తుంది. ఆ తర్వాత 2009 మేలో భారత పౌరులందరికీ అందుబాటులోకి వచ్చింది. ఈ పథకంలో 18ఏళ్లు నిండి 70 ఏళ్ల మధ్య ఉన్న వారు ఎవరైనా పెట్టుబడులు పెట్టొచ్చు. భవిష్యత్తును సురక్షితంగా ఉంచుకునేందుకు ఇది విలువైన ఎంపికగా పనిచేస్తుంది. పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్మెంట్ అథారిటీ (పీఎఫ్ఆర్డీఏ) నియంత్రణలో ఈ ఎన్‌పీఎస్ పనిచేస్తుంది. ఇది మార్కెట్–లింక్డ్ డిఫైన్డ్ కాంట్రిబ్యూషన్ స్కీమ్. పదవీ విరమణ తర్వాత సాధారణ ఆదాయాన్ని అందించే కార్పస్ ను నిర్మిస్తుంది. ఇప్పుడు ఈ పథకంలో పెట్టుబడులు పెట్టడం ద్వారా రూ. లక్ష నెలవారీ పెన్షన్ పొందే అవకాశం కూడా ఉంది. అది సాధ్యమా అంటే.. అవుననే చెబుతున్నారు నిపుణులు. ఈ నేపథ్యంలో ఎన్‌పీఎస్ ద్వారా నెలకు రూ. లక్ష పెన్షన్ రావాలంటే ఎంత పెట్టుబడి పెట్టాలి? ఎన్ని సంవత్సరాలు పెట్టాలి? వంటి పూర్తి వివరాలు ఇప్పుడు చూద్దాం.. రూ. 1 లక్ష నెలవారీ పెన్షన్ రావాలంటే.. మీరు పదవీ విరమణ చేసిన తర్వాత మీ ఎన్‌పీఎస్ పెట్టుబడుల నుంచి నెలవారీ రూ. 1 లక్ష పెన్షన్ పొందాలనుకుంటే కొన్ని అంశాలు ప్రాథమికంగా గుర్తుంచుకోవాలి. అవేంటంటే.. మీరు పెట్టుబడి ప్రారంభించే వయసు, ప్రతి ఏటా పెట్టుబడి పెంచుకుంటూ వెళ్లే ప్రణాళిక ఉండాలి. అప్పుడే మీకు అంది సాధ్యమవుతుంది. ఉదాహరణకు 35 ఏళ్ల వయస్సులో ఎన్‌పీఎస్ ప్రారంభించి, 60 ఏళ్ల వయసులో పదవీ విరమణ పొందుతారు అనుకుందాం.. ఆ సమయానికి మీకు రూ. లక్ష పెన్షన్ రావాలంటే.. మీ పెట్టుబడులు వార్షికంగా 10 శాతం పెంచుకుంటూ వెళ్లాల్సి ఉంటుంది. అప్పుడే మీ లక్ష్యాలను చేరుకోగలుగుతారు. మీరు 6 శాతం వార్షిక రాబడితో యాన్యుటీని కొనుగోలు చేయడానికి మీ మొత్తం కార్పస్లో 60 శాతాన్ని ఉపయోగిస్తే, మీరు నెలకు రూ. 17,000 కంట్రిబ్యూషన్ ఇవ్వాల్సి ఉంటుంది. అదే సమయంలో మీరు యాన్యుటీ కోసం మీ కార్పస్లో 40 శాతాన్ని ఉపయోగిస్తే, మీరు నెలకు రూ. 34,000 విరాళంగా ఇవ్వాలి. ఈ రెండు రెండు సందర్భాల్లోనూ మీరు పదవీ విరమణ తర్వాత నెలవారీ రూ. 1 లక్ష పెన్షన్ పొందుతారు. నేషనల్ పెన్షన్ సిస్టమ్ వల్ల ప్రయోజనాలు.. నేషనల్ పెన్షన్ సిస్టమ్(ఎన్‌పీఎస్) అనేక ప్రయోజనాలను అందిస్తుంది. ఇందులో ప్రధానమైనది పన్ను ప్రయోజనాలు. అలాగే పదవీ విరమణ కోసం క్రమపద్ధతిలో ఆదా చేసే సామర్థ్యం. క్రమశిక్షణతో కూడిన పొదుపులను ప్రోత్సహించడం ద్వారా, ఇది వ్యక్తులు ఆర్థికంగా సురక్షితమైన పదవీ విరమణ కోసం ప్లాన్ చేయడంలో సహాయపడుతుంది.

## పదిన్నర నిమిషాల్లోనే 80శాతం చార్జింగ్.. టెస్లాను బీట్ చేసిన చైనా ఎలక్ట్రిక్ కార్ల కంపెనీ..




విద్యుత్ శ్రేణి వాహనాల వల్ల వినియోగదారులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య చార్జింగ్ సమయం. ఇదే చాలా మందిని వాటివైపు చూడకుండా చేస్తోంది. సాధారణ పెట్రోల్, డీజిల్ ఇంజిన్ కార్లు ఎక్కడైనా నిమిషాల్లో రీఫ్యూలింగ్ చేసుకునే వెసులుబాటు ఉంటుంది. అయితే ఎలక్ట్రిక్ వాహనాలకు మాత్రం కొన్ని గంటల సమయం రీచార్జ్ కోసం తీసుకుంటాయి. దీనివల్ల వాటిని ఎక్కువ దూరాలకు వినియోగించలేని పరిస్థితి ఏర్పడుతోంది. దీనిపైనే ఫోకస్ పెట్టిన ప్రధాన ఎలక్ట్రిక్ వాహన తయారీ దారులు పలు వినూత్న ఆవిష్కరణలను పరిచయం చేస్తున్నాయి. వీటిల్లో ప్రపంచ ఎలక్ట్రిక్ వాహన దిగ్గజం టెస్లాతో పాటు చైనాకు చెందిన బీవైడీ కూడా ఉన్నాయి. ఇప్పుడు ఈ రెండింటినీ కూడా తలదన్నే రీతిలో ఓ కొత్త బ్యాటరీని ఆవిష్కరించింది చైనాకు చెందిన జీక్ర్ సంస్థ. తాము తీసుకొచ్చిన ఈ బ్యాటరీలు 10శాతం నుంచి 80శాతం చార్జింగ్ కావడానికి కేవలం పదిన్నర నిమిషాలే తీసుకుంటుందని వెల్లడించింది. ఇదే సమయంలో ప్రపంచ ఎలక్ట్రిక్ వాహన దిగ్గజం టెస్లాకు చెందిన లేటెస్ట్ ఇన్వెన్షన్ మోడల్–3లో వినియోగంచే బ్యాటరీ ఇదే చార్జింగ్ చేయడానికి 15 నిమిషాలు పడుతుందని వివరించింది. ఈ బ్యాటరీ రేంజ్ 282 కిలోమీటర్లు ఉంటుందని పేర్కొంది. మైనస్ 10 డిగ్రీల ఉష్ణోగ్రతలోనూ ఈ బ్యాటరీలు మంచి పనితీరును అందిస్తాయని వివరించింది. దీనిని బట్టి తమ బ్యాటరీని ఎలాన్ మస్క్ టెస్లా కన్నా మెరుగైనదిగా కంపెనీ క్లయిమ్ చేసుకుందది. వచ్చే వారం కొత్త కారు.. చైనాకు చెందిన జీక్ర్ నుంచి కొత్త సెడాన్ వచ్చే వారం లాంచ్ కానుంది. 2025 జీక్ర్ 007 పేరుతో అందుబాటులోకి రానుంది. ఈ సెడాన్ లోనే జీక్ర్ రూపొందించిన అడ్వాన్స్ డ్ బ్యాటరీని అమర్చినట్లు చెబుతున్నారు. ఈ సందర్భంగా సినో ఆటో ఇన్ సైట్స్ డైరెక్టర్ టూ లీ మాట్లాడుతూ విద్యుత్ శ్రేణి వాహనాల మార్కెట్లో ఇక టెస్లా చార్జింగ్ టెక్నాలజీ బీట్ చేస్తూ కొత్త సాంకేతికతను జీక్ర్ రూపొందించిందన్నారు. జీక్ర్ క్లయిమ్ చేస్తున్న విషయాలు అద్భుతమనే చెప్పాలి. ఇది తప్పనిసరిగా ప్రపంచంలోనే వేగవంతమైన చార్జింగ్ టెక్నాలజీల్లో ఒకటిగా నిలుస్తుందని చెప్పుకొచ్చారు. జీక్ర్ సంస్థ ప్రస్థానం.. చైనా కార్ల తయారీలో దిగ్గజంగా పేరున్న గీలీకి చెందిన సంస్థే ఈ జీక్ర్ ఇంటెలిజెంట్ టెక్నాలజీ హోల్డింగ్ లిమిటెడ్, యూకేకు చెందిన లోటస్, స్వీడన్ కుచెందిన వోల్వో కూడా ఈ గ్రూపులోని సంస్థలే. దీనిని బట్టి జీక్ర్ రేంజ్ ఏంటో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం ఈ జీక్ర్ సంస్థకు చైనాలోనే 500 అల్ట్రా ఫాస్ట్ చార్జింగ్ స్టేషన్లు ఉన్నాయి. ఈ సంఖ్యను ఏడాది చివరి నాటికి రెట్టింపు చేసే లక్ష్యంతో జీక్ర్ పనిచేస్తోంది. 2026 నాటికి చైనా మొత్తంలో 10,000 చార్జింగ్ స్టేషన్లు అందుబబాటులో ఉంచుకునేలా కార్యాచరణను రూపొందించింది.

# వ్యాపారం



## ఒక్క రూపాయి కట్టకుండానే రూ.7 లక్షల వరకు ఇన్సూరెన్స్ ..



భారతదేశంలోని ప్రతి ఉద్యోగికి ఉద్యోగుల భవిష్య నిధి పథకం కింద నెలవారీ జీతం నుండి కొంత మొత్తం తీసివేయబడుతుంది. నెలవారీ తగ్గింపులు ఉద్యోగి పీఎఫ్ ఖాతాకు జమ అవుతుంది. ఈ డబ్బును ఉద్యోగులు తమ అవసరాలకు వినియోగించుకోవచ్చు. బహుశా ఉద్యోగి తన పని జీవితమంతా పీఎఫ్ ఖాతా నుండి డబ్బు తీసుకోకపోతే అతను పదవీ విరమణ తర్వాత కూడా పెన్షన్ పొందవచ్చు. ఉద్యోగుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఇందులో అత్యంత ముఖ్యమైన పథకం ఎంప్లాయిస్ డిపాజిట్ లింక్డ్ ఇన్సూరెన్స్. ఎంత బీమా కవరేజీ అందించబడింది. ఈ ప్లాన్ ప్రత్యేకతలు ఏమిటి? పూర్తి వివరాలు తెలుసుకుందాం. ఈపీఎఫ్‌వో ఈడీఎల్ఐ బీమా పథకం ప్రత్యేకతలు: ఉద్యోగుల భవిష్య నిధి పథకంలో సభ్యులకు రూ.7 లక్షల వరకు బీమా వర్తిస్తుంది. దీని ప్రకారం, ఈ పథకం కింద సభ్యులు బీమాను పొందేందుకు ఎలాంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదు. ప్రాథమిక వేతనం రూ.15,000 కంటే ఎక్కువ ఉన్న వారికి గరిష్టంగా రూ.6 లక్షల వరకు బీమా వర్తిస్తుంది. గత 12 నెలల ఈపీఎఫ్ సభ్యుల సగటు నెలసరి జీతం కంటే బీమా మొత్తం 35 రెట్లు ఎక్కువ. అంటే గరిష్టంగా రూ.7 లక్షల వరకు బీమా అందుతుంది. ఈ పథకంలో రూ.1,15,000గా ఉన్న బోనస్ మొత్తాన్ని గత ఏప్రిల్ నుంచి రూ.1,75,000కు పెంచడం గమనార్హం. బీమాను ఎలా క్లెయిమ్ చేయాలి? సభ్యుడు అకాల మరణం సంభవించినట్లయితే, అతని నామినీ లేదా చట్టపరమైన వారసుడు బీమా మొత్తాన్ని క్లెయిమ్ చేయవచ్చు. దీని ప్రకారం, సభ్యుని నామినీ వయస్సు తప్పనిసరిగా 18 సంవత్సరాలు. బహుశా నామినీ వయస్సు 18 కంటే తక్కువ ఉంటే, అతని తల్లిదండ్రులు డబ్బును క్లెయిమ్ చేయవచ్చు. ఈ మొత్తాన్ని పొందడానికి డెత్ సర్టిఫికేట్, వారసత్వ ధృవీకరణ పత్రం వంటి పత్రాలు తప్పనిసరి.

## విజయ్ సేల్స్ ఫ్రీడమ్ సేల్‌లో కళ్లుచెదిరే ఆఫర్లు.. ఆ ఫోన్లపై భారీ డిస్కౌంట్లు



స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా చాలా కంపెనీలు ఫ్రీడమ్ సేల్స్ ద్వారా వినియోగదారులకు ప్రత్యేక తగ్గింపులను అందిస్తున్నాయి. ఇప్పటికే ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ వంటి ఈ–కామర్స్ సైట్స్‌లో ఫ్రీడమ్ సేల్స్ ముగియగా ప్రస్తుతం ఆఫ్‌లైన్ స్టోర్స్‌లో ఫ్రీడమ్ సేల్స్ ఊపందుకున్నాయి. తాజాగా ప్రముఖ కంపెనీ విజయ్ సేల్స్ తన మెగా ఫ్రీడమ్ సేల్‌ను ప్రారంభించింది, ఆడియో పెరిఫెరల్స్, ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్‌లు, టాబ్లెట్‌లపై డిస్కౌంట్లను అందిస్తోంది. విజయ్ సేల్స్‌లో ఉన్న ప్రతి ఉత్పత్తిపై ప్రత్యేక తగ్గింపు అందిస్తామని కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు. ముఖ్యంగా స్మార్ట్ ఫోన్స్ ప్రత్యేక ఆఫర్లను విజయ్ సేల్స్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో విజయ్ సేల్స్ ఫీడమ్ సేల్ గురించి వివరాలను తెలుసుకుందాం. సీఎంఎఫ్ ఫోన్ 1 లండన్ ఆధారిత ఫోన్ తయారీ సంస్థ నథింగ్ ఇటీవల సీఎంఎఫ్ ఫోన్ 1 పేరుతో కొత్త ఫోన్‌ను విడుదల చేసింది. మీడియా టెక్ డైమెన్సిటీ 2500 చిప్‌సెట్ ద్వారా పని చేసే ఈ ఫోన్‌పై ఫ్రీడమ్ సేల్ ప్రత్యేక తగ్గింపులను అందిస్తుంది. సీఎంఎఫ్ ఫోన్ 1 6.7–అంగుళాల 120 హెచ్‌జెడ్ ఎమోఎల్ఈడీ స్క్రీన్‌తో వస్తుంది. ఆండ్రాయిడ్ 14 ఆధారంగా పనిచేసే ఈ ఫోన్ ప్రస్తుతం విజయ్ సేల్స్‌లో రూ. 15,999కి అందుబాటులో ఉంది. అయితే మీరు వన్ కార్డు ఈఎంఐ ద్వారా కొనుగోలు చేస్తే రూ. 1,000 తగ్గింపును పొందవచ్చు. అలాగే యస్ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్, ఫెడరల్ కార్డ్ హోల్డర్‌లు 5 శాతం వరకు తగ్గింపు పొందవచ్చు. ఈ–కామర్స్ ప్లాట్‌ఫారమ్ ఆర్‌బీ కార్డ్ హోల్డర్‌లకు 7.5 శాతం తగ్గింపును కూడా అందిస్తుంది. వన్ ప్లస్ 12 ఆర్ ఈ ఫోన్‌ను 2024 జనవరిలో వన్ ప్లస్ ప్రారంభించింది. స్నాప్ డ్రాగ్ జెన్ 2 చిప్‌సెట్ ఆధారంగా పని చేసే ఈ ఫోన్ 6.78–అంగుళాల ఫుల్ హెచ్‌డీ ఎమోఎల్ఈడీ స్క్రీన్‌తో పని చేస్తుంది. ఈ ఫోన్ 8 జీబీ ం 256 జీబీ వేరియంట్‌ను రూ. 41,999కి కొనుగోలు చేయవచ్చు. అయితే ఐసీఐసీ కార్డ్ హోల్డర్లు ఈఎంఐ లావాదేవీలపై రూ. 2,000 తగ్గింపును పొందవచ్చు. విజయ్ సేల్స్ కూడా వన్ ప్లస్ ఈఎంఐ, హెచ్ఎస్‌బీసీ క్రెడిట్ కార్డ్ ఈఎంఐ లావాదేవీలపై 5 శాతం మరియు 7.5 శాతం తగ్గింపును అందిస్తోంది. ఐఫోన్15 ఫ్లిప్ కార్ట్ మాదిరిగానే విజయ్ సేల్స్ కూడా ఐఫోన్ 15ని తగ్గింపు ధరకు అందిస్తోంది. ఐఫోన్ 15 బేస్ వేరియంట్ 128 జీబీ ర్యామ్‌తో వచ్చే 6.1–అంగుళాల ఓఎల్ఈడీ స్క్రీన్‌తో వస్తుంది. 48 ఎంపీ ప్రైమరీ కెమెరాతో వచ్చే ఈ ఫోన్‌ను ఐసీఐసీఐ బ్యాంక్, క్రెడిట్ కార్డ్‌తో కొనుగోలు చేస్తే రూ. 4,000 తగ్గింపు పొందవచ్చు. అలాగే హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్ఎస్‌బీసీ బ్యాంక్, ఆర్‌బీఎల్ కార్డ్ వినియోగదారులు ఈఎంఐ లావాదేవీలపై 7.5 శాతం తగ్గింపును పొందవచ్చు. అలాగే వన్ కార్డు, యస్ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్, ఫెడరల్ కార్డ్ హోల్డర్‌లు 5 శాతం తగ్గింపును పొందవచ్చు.

# ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఇది తాగితే

# ఆ సమస్యలన్నీ మటాష్



రోజూ మన డైట్‌లో అల్లం భాగం చేసుకోవడం వల్ల ఎన్నో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. అల్లం మీ టీతో పాటు ఆహారం రుచిని పెంచుతుంది. అయితే మీరు ఎప్పుడైనా అల్లం నీళ్లు తాగారా? ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఆరోగ్య ప్రయోజనాలను పొందడానికి అల్లం నీరు తాగడం సులభమైన మార్గం. ఆయుర్వేదంలో అల్లం ఔషధ గుణాలకు ప్రసిద్ధి. పురాతన వైద్యంలో అల్లం అనేక వ్యాధులను నయం చేయడానికి ఒక మూలికగా ఉపయోగించారన్న విషయం తెలిసిందే కదా..! అల్లంలో శరీరానికి అవసరమైన విటమిన్ సి, కాల్షియం, ఫాస్పరస్, ఐరన్, జింక్, కాపర్, మాంగనీస్, క్రోమియం వంటి పోషకాలు ఉన్నాయి. ముఖ్యంగా



ఉదయాన్నే ఖాళీ కడుపుతో అల్లం నీటిని తాగితే అల్లం వల్ల కలిగే ప్రయోజనాలన్నీ శరీరానికి అందుతాయి. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం 1. బరువు తగ్గుతారు ఖాళీ కడుపుతో అల్లం నీటిని తాగడం వల్ల జీవక్రియ వేగవంతం అవుతుంది. ఇది కొవ్వును వేగంగా కరిగించడంలో సహాయపడుతుంది. మీ శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపడానికి ఉపయోగపడుతుంది 2. షుగర్ బాధితులకు ప్రయోజనకరం: ఖాళీ కడుపుతో అల్లం నీరు తాగితే రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. అలాగే, రక్తంలో చక్కెర స్థాయి పెరగకుండా ఉంటుంది. ఇది మధుమేహం వల్ల వచ్చే సమస్యల నుండి బయటపడటానికి సహాయపడుతుంది. 3. చర్మానికి మేలు చేస్తుంది: అల్లం నీరు శరీరంలో పేరుకుపోయిన మురికి, టాక్సిన్స్ ను తొలగించడంలో సహాయపడుతుంది. అలాగే ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధులకు కారణమయ్యే ఫ్రీ రాడికల్స్‌తో పోరాడుతాయి. చర్మంపై దద్దుర్లు, మొటిమలు, ముడతలు వంటి వృద్ధాప్య సంకేతాలను తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది మీ రక్తాన్ని సహజంగా శుద్ధి చేయడంలో యూజ్ అవుతుంది 4. ఇన్‌ఫ్లమేటరీ సమస్యలు దూరం : అల్లం శరీరంలోని ఇన్‌ఫ్లమేటరీ సమస్యలను దూరం చేయడంలో సహాయపడుతుంది. అల్లం వాపును కలిగించే సూక్ష్మజీవులు, హానికరమైన బ్యాక్టీరియాతో పోరాడటానికి సహాయపడుతుంది. 5. పొట్టకు మేలు చేస్తుంది: ఖాళీ కడుపుతో అల్లం నీటిని తాగడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. దీని కారణంగా, అజీర్ణం, మలబద్ధకం, ఉబ్బరం, వాంతులు, విరేచనాలు, వికారం వంటి సమస్యలను తొలగించడంలో ఇది చాలా ప్రభావవంతంగా ఉంటుంది. అదనంగా, అల్లం చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. దీని వల్ల గుండెపోటు, పక్షవాతం వంటి వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించి గుండె ఆరోగ్యంగా ఉంచుతుంది.

## ఇదేం చేస్తుందిలే అని చీప్‌గా చూడకండి..

### ఆ సమస్యలకు పవర్‌ఫుల్ వెపన్.. డైలీ జ్యూస్ తాగితే..



ఉరుకులు పరుగుల జీవితంలో ఎన్నో అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. అందుకే ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు మంచి జీవనశైలిని అవలంభించాలని.. ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అయితే.. ఆరోగ్యానికి మేలు చేసే దుంపల్లో బీట్‌రూట్ ఒకటి.. బీట్‌రూట్ తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. వాస్తవానికి బీట్ రూట్‌ను సలాడ్‌గా తీసుకుంటారు. కొందరు బీట్ రూట్ మామూలుగా తింటే.. మరికొందరు జ్యూస్ చేసుకుని తాగుతారు. బీట్‌రూట్‌లో ఐరన్, సోడియం, సెలీనియం, మెగ్నీషియం వంటి అనేక పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి శరీరం అనేక వ్యాధులతో పోరాడటానికి సహాయపడుతుంది.. రోజూ బీట్‌రూట్ జ్యూస్ తాగడం వల్ల రక్తపోటు అదుపులో ఉండటమే కాకుండా కొవ్వు మొదలైన వాటిని తగ్గించడంలో సహాయపడుతుందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అందుకే బీట్ రూట్ ను తప్పనిసరిగా తీసుకోవాలంటున్నారు. బీట్ రూట్ రెగ్యులర్‌గా తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలేంటో ఇప్పుడు తెలుసుకోండి.. బ్లడ్ ప్రెజర్ కంట్రోల్: బీట్‌రూట్ జ్యూస్ తాగడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. ఇందులో నైట్రేట్ ఉండటం వల్ల శరీరంలో నైట్రిక్ ఆక్సైడ్ ఉత్పత్తికి సహాయపడుతుంది. బరువు నియంత్రణ: బీట్‌రూట్ రసంలో కొవ్వు, కేలరీలు తక్కువగా ఉంటాయి. ఇది బరువు తగ్గడానికి సహాయ పడుతుంది. ఉదయాన్నే దీన్ని తాగడం వల్ల రోజంతా శరీరానికి శక్తి లభిస్తుంది. కాలేయానికి మేలు చేస్తుంది: బీట్‌రూట్‌లోని బీటైన్ అనే యాంటీ ఆక్సిడెంట్ కాలేయంలో కొవ్వు ఆమ్లాలు పేరుకుపోకుండా చేస్తుంది. ఇది కాలేయాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. నాడీ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది: బీట్‌రూట్‌లో పొటాషియం పుష్కలంగా లభిస్తుంది. ఇది శరీరంలోని కండరాలు, నాడీ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. గుండెకు మేలు చేస్తుంది: బీట్‌రూట్ రసం తాగడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. అలాగే శరీరంలో ప్లాస్మా నైట్రేట్ స్థాయిలను పెంచుతుంది. ఇది శరీరం స్టామినాను పెంచుతుంది. క్యాన్సర్ ప్రమాదం తగ్గుతుంది: బీట్‌రూట్ రసంలో యాంటీఆక్సిడెంట్లు, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఉంటాయి. ఇది క్యాన్సర్ ప్రమాదం నుండి శరీరాన్ని రక్షించడంలో సహాయపడుతుంది.



## వామ్మో.. రక్తహీనతతో బాధపడుతున్నారా..? డేంజర్ జోన్ నుంచి బయటపడాలంటే ఇలా చేయండి



ఉరుకులు పరుగుల జీవితంలో ఎన్నో అనారోగ్య సమస్యలను ఎదుర్కోవలసి వస్తోంది.. ముఖ్యంగా పేలవమైన జీవనశైలి, అనారోగ్యమైన ఆహారం.. పని ఒత్తిడి.. ఇవన్నీ రోగాల బారిన పడేలా చేస్తున్నాయి. శరీరానికి కావలసిన పోషకాలు, విటమిన్లు అందకపోతే.. ప్రమాదంలో పడినట్లే.. అందుకే.. తప్పనిసరిగా పౌష్టికాహారాన్ని తీసుకోవాలంటున్నారు వైద్య నిపుణులు.. అయితే, శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడానికి, మీ శరీరంలో తగినంత ఐరన్ ఉండటం చాలా ముఖ్యం. ఇనుము లోపం మీ ఆరోగ్యాన్ని తీవ్రంగా పాడు చేస్తుంది. శరీరంలో విటమిన్లు పుష్కలంగా ఉండటానికి కొన్ని ఆహారాలను తీసుకోవాలి.. ఐరన్ లోపాన్ని నివారించేందుకు ఎలాంటి ఆహారం తీసుకోవాలో ఇప్పుడు తెలుసుకోండి.. ఐరన్ లోపాన్ని నివారించేందుకు ఇవి తినండి.. దానిమ్మ: శరీరంలో విటమిన్లు, ఖనిజాలు ఉండటం చాలా ముఖ్యం. వీటి లోపం వల్ల అనేక వ్యాధులను ఎదుర్కోవాల్సి వస్తుంది. శరీరంలో ఐరన్ లోపం వల్ల అనేక రకాల సమస్యలు వస్తాయి. శరీరంలో ఐరన్ తక్కువగా ఉన్నప్పుడు, చాలా బలహీనత ఉంటుంది. ఐరన్ లోపం ఉన్నవారు ఆహారంలో దానిమ్మను చేర్చుకుంటే చాలా మంచిది.. దీనివల్ల రక్తహీనత సమస్య నుంచి బయటపడొచ్చు.. గుడ్డు: ఐరన్ లోపం ఉన్నవారు ఉదయం అల్పాహారంగా కూడా గుడ్లు తీసుకోవాలి. గుడ్లలో మంచి మొత్తంలో ప్రొటీన్లు, విటమిన్లు, మినరల్స్, ఐరన్ ఉంటాయి. దీని వల్ల శరీరంలో ఐరన్ లోపం ఏర్పడదు.. గుడ్లలో విటమిన్ డి కూడా లభిస్తుంది. ఐరన్ లోపం ఉన్నవారు తప్పనిసరిగా గుడ్లు తినాలి. రెగ్యులర్ గా మీ ఆహారంలో ఒక గుడ్డును చేర్చుకోండి.. బీట్‌రూట్: రోజూ బీట్‌రూట్ తీసుకోవడం వల్ల మీ శరీరంలోని రక్తహీనత తొలగిపోతుంది. ఇనుము లోపం నయమైతే, అనేక వ్యాధులు కూడా నయమవుతాయి. రోజూ బీట్‌రూట్ జ్యూస్ తాగితే శరీరంలో ఐరన్ లోపాన్ని నివారించవచ్చు.. బీట్‌రూట్ తినడం వల్ల హిమోగ్లోబిన్ పెరుగుతుంది. ఇది మీ కడుపులో మంచి బ్యాక్టీరియాను పెంచడంలో కూడా చాలా సహాయపడుతుంది. పాలకూర: పాలకూరలో కూడా ఐరన్ పుష్కలంగా ఉంటుంది. దీన్ని ప్రతిరోజూ మీ ఆహారంలో చేర్చుకోవడం చాలా మంచిది. పాలకూరలో కాల్షియం, సోడియం, ఖనిజ లవణాలు, క్లోరిన్, ఫాస్పరస్, అనేక ఇతర ముఖ్యమైన పోషకాలు ఉన్నాయి. ఇవి మీ శరీరాన్ని ఇనుము లోపం నుంచి దూరంగా ఉంచుతాయి. ఇంకా ఒత్తిడిని తగ్గించడం ద్వారా మీ శరీరాన్ని రిలాక్స్ చేయడంలో కూడా ఇవి సహాయపడతాయి. పండ్లు కూరగాయలు: తాజా పండ్లు, కూరగాయలు మీ శరీరానికి చాలా ఉపయోగకరంగా ఉంటాయి. అనేక వ్యాధుల నుండి మిమ్మల్ని దూరంగా ఉంచడంలో సహాయపడతాయి. తాజా, పండ్లు కూరగాయల్లో ఐరన్ ఎక్కువ పరిమాణంలో ఉంటుంది. కావున వీటిని ప్రతిరోజూ తింటే ఈ సమస్య నుంచి బయటపడొచ్చు..

## గుడ్లలో కంటే ఎక్కువ ప్రోటీన్ కావాలా..? అయితే ఈ పప్పులను తినండి.. ఇక నో టెన్షన్..



శరీరాన్ని ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉంచుకోవడానికి విటమిన్లు, మినరల్స్‌తో పాటు ప్రొటీన్లు కూడా చాలా అవసరం. శరీరంలో రోగనిరోధక శక్తిని పెంపొందించడానికి ప్రొటీన్ సహాయపడుతుంది. అయితే, శరీర అభివృద్ధి నుంచి రోగనిరోధక శక్తిని పెంచడానికి ప్రొటీన్ తోపాటు విటమిన్లు చాలా సహాయపడతాయి. ప్రొటీన్ మూలాలలో ఒకటి గుడ్లు.. చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరూ రోజుకు కనీసం 1 గుడ్డు తినాలని వైద్యులు సూచిస్తున్నారు. అయితే, తృణధాన్యాల్లో (పప్పులు) గుడ్ల కంటే ఎక్కువ ప్రొటీన్లు ఉంటాయి. అయితే, చాలామంది గుడ్లు తినరు లేదా మాంసాహారం తీసుకోరు.. అలాంటి వారికి ప్రొటిన్ లోపం ఉంటుంది.. అలాంటి వారు శరీరంలో ప్రొటీన్ స్థాయిలను నిర్వహించడానికి వారు పప్పులను తినవచ్చు. కొన్ని పప్పుల్లో గుడ్ల కంటే ఎక్కువ ప్రొటీన్లు ఉంటాయని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. పప్పులలో ప్రొటీన్లు ఎక్కువగా ఉంటాయి. దీనిని అన్నం లేదా రొట్టెలతో తినవచ్చు. పప్పు చాలా మందికి సులభంగా జీర్ణం కాదు. అలాంటప్పుడు పప్పు చారు తినడం వల్ల శరీరానికి ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయి. పప్పు ఆరోగ్యానికి చాలా మంచిది. కందిపప్పు, మసూర్ పప్పు, పెసర పప్పులో గుడ్ల కంటే ఎక్కువ ప్రొటీన్లు ఉంటాయని చెబుతున్నారు. కాబట్టి తల్లులు, అమ్మమ్మలు ఉపవాసం ఉన్నప్పుడు, శనగపప్పు ఉడకబెట్టి తింటారు. తద్వారా శరీరంలో ప్రొటీన్ లోపం ఉండదు. ముఖ్యంగా పెసర పప్పు కూడా బరువు తగ్గడంలో సహాయపడుతుంది. అంతే కాకుండా గుండె ఆరోగ్యాన్ని కూడా కాపాడుతుంది. కాబట్టి డైట్‌లో ఉన్నవారు కూడా పెసరపప్పు తింటే ప్రొటీన్ లెవెల్స్ అదుపులో ఉంటాయి జిమ్, యోగా లేదా ఇతర శారీరక శ్రమలలో పాల్గొనే వారికి పెసరపప్పు, కందిపప్పు, శనగల మొలకలు చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. ఎందుకంటే ఇందులో అధిక ప్రొటీన్‌తో పాటు క్యాల్షియం, ఐరన్ తగినంత మొత్తంలో ఉంటాయి. ఇంకా వీటిని కూరగా లేదా.. ఉడకబెట్టుకుని కూడా తినవచ్చు.. అందుకే డైలీ ఒక కప్పు పప్పును తింటే శరీరానికి ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.

## రొమాన్స్ పండు.. ఉదయాన్నే పరగడుపున తింటే ఆ సమస్యలకు చెక్ పెట్టినట్లే.. ట్రై చేయండి..



ప్రస్తుత కాలంలో ఎన్నో సమస్యలు వెంటాడుతున్నాయి. కావున ఆరోగ్యంపై దృష్టిసారించడం మంచిది.. అందుకే ఆరోగ్యానికి మేలు చేసే పండ్లను తినాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అలాంటి పండ్లలో కర్బూజ ఒకటి.. దీనిలోని పోషకాలు శరీరాన్ని ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి. కర్బూజ పండులో నీటిశాతం ఎక్కువ.. కావున దీన్ని తినడం ద్వారా హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది. అయితే, ప్రతి రోజూ ఉదయాన్నే కర్బూజ తినడం వల్ల చాలా వ్యాధులకు చెక్ పెట్టవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు.. ముఖ్యంగా వేసవి కాలంలో కర్బూజను తినడం వల్ల అనేక వ్యాధులు వచ్చే ప్రమాదం కూడా తగ్గుతుంది. శరీరంలో నీటి కొరతను, పోషకాల కొరతను నివారించాలంటే దీనిని తప్పనిసరిగా తినాలి.. ముఖ్యంగా పరగడుపున (ఖాళీ కడుపుతో) తింటే చాలా మేలు జరుగుతుంది. కర్బూజ ప్రయోజనాలేంటో తెలుసుకోండి.. కర్బూజను తినడం వల్ల కలిగే ప్రయోజనాలేంటో తెలుసుకోండి.. గుండె సంబంధిత వ్యాధుల నుంచి ఉపశమనం: కర్బూజను రోజూ తీసుకుంటే గుండె సంబంధిత వ్యాధుల నుంచి కూడా ఉపశమనం పొందవచ్చు. దీనిలో ఫోలిక్ యాసిడ్ ఉంటుంద. ఇది మీ రక్తాన్ని శుద్ధి చేయడంలో కూడా సహాయపడుతుంది. రక్త నాళాలలో రక్తం గడ్డకట్టడాన్ని నివారించడంలో ఇది మీకు చాలా సహాయపడుతుంది. దీన్ని ఉదయం ఖాళీ కడుపుతో తీసుకుంటే చాలా ప్రయోజనాలను పొందవచ్చు. కడుపు సమస్యలు దూరం: వేసవి కాలంలో ప్రజలకు కడుపు సంబంధిత సమస్యలు మొదలవుతాయి. అజీర్తి, మలబద్దకం, కడుపులో నొప్పి, జీర్ణ సమస్యలతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతుంటారు. అయితే, ఈ సీజన్‌లో ఎక్కువ నూనె, మసాలాలు తీసుకోవడం చాలా ప్రమాదకరం. కావున, అలాంటివి తగ్గించి.. తేలికపాటి వస్తువులను అంటే సులభంగా జీర్ణమయ్యే వాటిని తీసుకోవడం చాలా ఉపయోగకరంగా ఉంటుంది. కావున కర్బూజను తినడం చాలా మంచిది. కంటి సంబంధిత సమస్యలు: కర్బూజ తినడం వల్ల కంటి సంబంధిత సమస్యలు కూడా నయమవుతాయి. విటమిన్ ఎ బీటా కెరోటిన్ కర్బూజలో లభిస్తుంది. ఇది మీ కంటి చూపును మెరుగుపర్చి ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇంకా కంటిశుక్లం ప్రమాదాన్ని తగ్గించడంలో కూడా మీకు చాలా సహాయపడుతుంది. లైంగిక సమస్యల నుంచి ఉపశమనం: కర్బూజలోని విటమిన్ కె, ఇ కూడా పుష్కలంగా ఉంటాయి. దీని వలన ప్రత్యుత్పత్తి వ్యవస్థ బాగా పనిచేస్తుంది. దీనిని తినడం వల్ల లైంగిక సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. మూత్రపిండాల్లో రాళ్లు: కిడ్నీలో రాళ్ల సమస్యతో బాధపడుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది.. వాటి నుంచి బయటపడేందుకు నిత్యం పలు రకాల మందులు వాడుతుంటారు. అలాంటి వారు రోజూ పుచ్చకాయను తీసుకుంటే.. కిడ్నీల్లో రాళ్ల సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు..

## ఒక్కటి.. ఒకే ఒక్కటి.. పడుకునే ముందు అరటిపండు తింటే ఏమవుతుందో తెలుసా..?

అరటిపండులో ఎన్నో పోషకాలు దాగున్నాయి. ఇవి శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. అందుకే.. ఎప్పటికీ అందుబాటులో ఉండే అరటిపండును తినాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అరటిపండులో పొటాషియం, విటమిన్ సి, విటమిన్ బి6, ఫైబర్, మాంగనీస్ వంటి అనేక ముఖ్యమైన పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. వాటిలో కేలరీలు, కొవ్వు తక్కువగా ఉంటాయి. అందుకే.. ఆరోగ్యానికి మేలు చేసే అరటిపండును తింటే.. శరీరానికి అనేక ప్రయోజనాలను కలుగుతాయని పేర్కొంటున్నారు.. అయితే, పడుకునే ముందు అరటిపండు తినడం వల్ల నిద్ర, జీర్ణక్రియతోపాటు మొత్తం ఆరోగ్యంపై మంచి ప్రభావం చూపుతుంది. నిద్రపోయే ముందు అరటిపండును తినడం వల్ల కలిగే ప్రయోజనాలేంటో తెలుసుకోండి.. మంచి నిద్రను ప్రోత్సహిస్తుంది: అరటిపండ్లలో ట్రిప్టోఫాన్ అనే అమినో యాసిడ్ ఉంటుంది. ఇది సెరోటోనిన్‌గా.. మెలటోనిన్‌గా మారుతుంది. ఇవి నిద్రను నియంత్రించడంలో సహాయపడే న్యూరోట్రాన్స్‌మిటర్‌లు. కండరాల సడలింపు: అరటిపండ్లలో మెగ్నీషియం, పొటాషియం కూడా ఉన్నాయి. ఇవి కండరాలను సడలించే లక్షణాలకు ప్రసిద్ధి చెందిన ఖనిజాలను కలిగి ఉంటాయి. పడుకునే ముందు వాటిని తీసుకోవడం వల్ల మీ కండరాలు విశ్రాంతి తీసుకోవడానికి, మరింత ప్రశాంతమైన నిద్రను ప్రోత్సహిస్తాయి. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది: పడుకునే ముందు ఒకటి తినడం వల్ల రాత్రంతా రక్తంలో చక్కెర స్థాయిలలో వచ్చే అవాంతరాలను నివారించవచ్చు. ఆకలి బాధను నివారిస్తుంది:అరటిపండ్లు ఫైబర్ కు మంచి మూలం.పడుకునే ముందు అరటిపండు తినడం వల్ల రాత్రి సమయంలో ఆకలి బాధలను నివారిస్తుంది. నిరంతరాయంగా నిద్రపోయేలా చేస్తుంది. పోషకాలు సమృద్ధిగా ఉంటాయి.. అరటిపండ్లు విటమిన్లు సి, బి6, పొటాషియం, మాంగనీస్ వంటి అవసరమైన పోషకాలతో నిండి ఉన్నాయి.పడుకునే ముందు వాటిని తీసుకోవడం వల్ల మీ శరీరానికి ఈ పోషకాలు అందుతాయి. ఇది మొత్తం ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తుంది.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 9014159785, Mail:thecrimenews123@gmail.com